ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 1
ప్రకాశం
జిల్లా వార్తలు
ఆదివారం 15, జూన్ 2025



మార్కాపురం జిల్లా ఏర్పాటుకు
అడుగులు

జిల్లాలోని పశ్చిమ ప్రాంతవాసుల చిరకాల స్వప్నం నెరవేరబోతోంది. మార్కాపురం జిల్లా ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో రాష్ట్రస్థాయిలో కదలికలు వచ్చాయి. ప్రజల కోరికలు, నిర్దిష్ట సిఫార్సులు పంపాలని రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ... కలెక్టర్ తమీమ్ అన్సారియాను కోరారు. గత ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు మార్కాపురం జిల్లా ఏర్పాటుకు స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో నూతన జిల్లా ఆవశ్యకతను వివరిస్తూ ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఇటీవల ముఖ్యమంత్రికి నివేదికను అందజేశారు. సీఎం ఆదేశాలతో రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నూతన జిల్లా ఏర్పాటుకు సంబంధించిన నివేదికను పంపాలని కలెక్టర్ అన్సారియాను కోరడంతో ఆమె చర్యలు వేగవంతం చేశారు. ఈ మేరకు నివేదిక పంపాలని మార్కాపురం సబ్ కలెక్టర్‌ను ఆదేశించారు.

- ఒంగోలు కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి)

- నిర్దిష్ట సిఫార్సులతో నివేదిక పంపాలి
- కలెక్టర్‌కు సూచించిన రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ
- సీఎం చంద్రబాబు ఆదేశాలతో కదలిక



శత వసంతాల సరస్వతీ నిలయం

- వేలాది మందిని తీర్చిదిద్దిన ఒంగోలు పీవీఆర్ఎం స్కూలు
- జమిందార్ వెంకట రంగయ్య స్థాపన
- ఇక్కడ చదివిన అనేకమంది ఉన్నత స్థానాల్లో..

3

పొదిలి సీఐపై చెవిరెడ్డి దౌర్జన్యం

- పోలీస్‌స్టేషన్‌లోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నం
- పోలీసులు అడ్డుకోవడంతో ధర్నా చేస్తానని బెదిరింపు



మెయిన్‌లో..

విశాఖపట్నం టూ సేలం
గంజాయి రవాణా

- ఒంగోలు అద్దంకి బస్టాండ్‌లో 44 కిలోల పట్టివేత
- ఇద్దరు వైజాగ్ వాసులు అరెస్టు
- మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం

3

ముగిసిన ఎస్జీటీల బదిలీ కౌన్సెలింగ్

- అర్ధరాత్రి వరకు సాగిన ప్రక్రియ

పొగాకు మార్కెట్‌పై
కేంద్రం దృష్టి

- క్షేత్రస్థాయి పరిస్థితులపై వాణిజ్యశాఖ జాయింట్ సెక్రటరీ పరిశీలన
- బోర్డు ఈడీతో కలిసి ఒంగోలు-1 వేలం కేంద్రం సందర్శన
- ముందు రోజు గుంటూరులో వ్యాపార, రైతు ప్రతినిధులతో భేటీ
- వచ్చే ఏడాది ఉత్పత్తి నియంత్రణకు కసరత్తు ప్రారంభం
- ఇక నుంచి మూడేళ్లకు బ్యారన్ లైసెన్సు పునరుద్ధరణ
- పక్షం రోజుల్లో మార్కెట్ మెరుగుపడేలా హామీ

ఒంగోలు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది పొగాకు మార్కెట్లో అలజడి పెరుగుతుండటంతో కేంద్ర ప్రభుత్వం ఈ వ్యవహారంపై దృష్టి సారించింది. పంట ఉత్పత్తి పెంపు, మార్కెట్ తీరు, ఎదురవుతున్న సమస్యలు, పొగాకు బోర్డులో సంస్థాగత సమస్యలు ఇలా అన్ని అంశాలపైనా కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ పరిశీలిస్తోంది. ఈ క్రమంలోనే వాణిజ్య మంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీ కేశాంగ్ యాంగ్జామ్ షేర్పా రాష్ట్రానికి వచ్చారు. ప్రధానంగా ప్రస్తుత మార్కెట్ ప్రతికూలతకు పంట ఉత్పత్తి భారీగా పెరగడమే కారణమని ఇప్పటికే ఉన్నతస్థాయిలో ఒక అంచనాకు వచ్చినట్లు సమాచారం.



కేంద్ర ప్రభుత్వ అధికారి కేశాంగ్‌తో కలిసి పొగాకు బేళ్ల నాణ్యతను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బీఎన్

వేచిచూస్తున్న విదేశీ వ్యాపారులు

ఇతర దేశాల్లోనూ ఉత్పత్తి పెరగడం, అక్కడ నాణ్యమైన పొగాకు తక్కువ ధరలకు దొరుకుతుండటంతో విదేశీ వ్యాపారులు ఇక్కడ కొనుగోళ్లకు తొందరపడటం లేదు. దాంతో ఆంధ్రలో మార్కెట్ ప్రతికూల పరిస్థితిని ఎదుర్కొంటుండగా దక్షిణాది మార్కెట్లో మరింత ప్రతికూల పరిస్థితి కనిపిస్తోంది. ఈ అంశాలను ఉన్నతస్థాయి సమీక్షల్లో కేంద్ర అధికారులు గుర్తించి ప్రస్తుత సీజన్ సజావుగా సాగడంతో పాటు వచ్చే సీజన్‌లో ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా పంట సాగు, ఉత్పత్తి నియంత్రణపై దృష్టి సారించినట్లు సమాచారం. వాణిజ్యశాఖ జాయింట్ సెక్రటరీ పర్యటనలో ప్రధాన ఉద్దేశం అదేనని తెలుస్తుండగా శుక్రవారం గుంటూరులోని బోర్డు ప్రధాన కార్యాలయంలో బోర్డు అధికారులతోపాటు వ్యాపార, రైతు ప్రతినిధులతో సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించి ఆ అంశాలనే గట్టిగా చెప్పినట్లు తెలిసింది.

● లోగ్రేడ్ ధరే సమస్య

వాణిజ్యశాఖ సెక్రటరీ కేశాంగ్ శనివారం ఒంగోలు-1 వేలం కేంద్రాన్ని సందర్శించారు. బోర్డు ఈడీ విశ్వశ్రీ, స్థానిక ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్‌లతో కలిసి పొగాకు వేలాన్ని పరిశీలించారు. రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కూడా పంట ఉత్పత్తి నియంత్రణ అంశాన్నే ప్రధానంగా ఆమె రైతులకు చెప్పారు. అనుమతి ఇచ్చిన పంట కన్నా వచ్చే ఏడాది పెరగడానికి వీలులేదని అందుకు రైతులు సహకరించాలని కోరారు. అంతకు ముందు రైతుల తరఫున ఎమ్మెల్యే విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఏడాది ఉత్పత్తి ఖర్చులు పెరిగాయని, ధరలు సరిలేవన్నారు. గతేడాది కన్నా సగటు ధర పెరిగేలా చూడాలని కోరారు. బోర్డు ఈడీ విశ్వశ్రీ మాట్లాడుతూ వ్యాపారులతో చర్చించామని పక్షంలో మార్కెట్ మెరుగుపడుతుందని హామీ ఇచ్చారు. అప్పటికీ మార్పు లేకపోతే రైతుల తరఫున బోర్డు చర్యలు తీసుకుటుందన్నారు. రైతుల సమస్యల పరిష్కారం, గిట్టుబాటు ధరల కల్పనపై తమ శాఖ పనిచేస్తోందన్న వాణిజ్య శాఖ జాయింట్ సెక్రటరీ కేశాంగ్ ఇప్పటివరకు ఏటా ఉన్న బ్యారన్ లైసెన్సులను ఇక నుంచి మూడేళ్లకు ఒకసారి చేసేలా నిర్ణయం తీసుకున్నామని, దీనివల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు.



ఒంగోలులోని మార్ట్‌లో పుస్తకాలు, బ్యాగ్‌ల కొనుగోళ్లు ఇలా..

కలకళ

తల్లికి వందనం డబ్బులతో కుటుంబాల్లో ఆనందం

- ఎన్ని'కల' హామీ... నెరవేరిన వేళ..
- ప్రభుత్వానికి ప్రతి 'తల్లి వందనం'
- పుస్తకాలు, బ్యాగులు, యూనిఫాం ఇతరత్రా కొనుగోళ్లతో దుకాణాల్లో రద్దీ



ఒంగోలులో మహిళ ఆనందం

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన 'తల్లికి వందనం' పథకంతో జిల్లాలో ప్రతి పేద, మధ్యతరగతి కుటుంబాల్లో జూన్ బెంగ తీరింది. వారిలో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. ఎన్ని ఆర్థిక కష్టాల్లో ఉన్నప్పటికీ గతేడాది ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్న కూటమి సర్కార్‌పై అభినందనలు కురిపిస్తున్నారు. గత వైసీపీ హయాంలో ఇంటికి ఒకరికి మాత్రమే అమ్మఒడి రాగా, కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన ఏడాదికే ఇంటిలో ఎంతమంది విద్యార్థులుంటే అంతమందికీ 'తల్లికి వందనం' బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయి. ముఖ్యంగా జూన్ మాసం.. పిల్లల అడ్మిషన్‌లు, ఫీజులు, బ్యాగులు, డొనేషన్‌లు గుర్తుకు రావడంతో ఏమి చేయలో దిక్కుతోచని స్థితి ఉన్న తల్లిదండ్రులకు ఊరట లభించింది. అందరి ఇళ్లలో పండుగ వాతావరణం నెలకొంది. వారంతా కొనుగోళ్లకు ఉపక్రమించడంతో పట్టణాల్లోని దుకాణ సముదాయాలు కళకళలాడుతున్నాయి

ఒంగోలు, కార్పొరేషన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల ప్రారంభం వేళ రాష్ట్రప్రభుత్వం అమలుచేసిన తల్లికి వందనం లబ్ధితో విద్యార్థుల తల్లిదండ్రులకు జూన్ బెంగ తీరింది. ఒకేసారి పిల్లలందరికీ తల్లికి వందనం వేయడంతో ఒక్కో ఇంట్లో కనీసం రూ.13 వేల నుంచి రూ.52వేల వరకు నగదు రావడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది. తల్లుల ఖాతాల్లో జమ అయిన నగదుతో పిల్లల బ్యాగులు, యూనిఫాంలు, ఇతరత్రా వస్తువులు కొనుగోలు చేస్తుండటంతో వ్యాపారాలు ఊపందుకున్నాయి. జిల్లావ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలు వివిధ వస్తువులు కొనుగోళ్ల కోసం పట్టణాల దారిపట్టారు. దీంతో దుకాణాలలో సందడి వాతావరణం నెలకొంది. నగరంలోని రిమ్స్ సమీపంలోని ప్రముఖ సరుకుల మాల్‌లో సాధారణ రోజుల్లోనే కొనుగోలుదారులతో కళకళలాడుతోంది. ఒంగోలుతోపాటు అద్దంకి, కందుకూరు సమీపంలోని గ్రామాల ప్రజల రాకతో షాపింగ్ దుకాణాల్లో కాలుపెట్టే పరిస్థితి లేదని వెల్లడిస్తున్నారు.



వెంకటరెడ్డి (ఫైల్)

అప్పుల బాధతో
రైతు ఆత్మహత్య

రెండు నెలల తర్వాత అస్థిపంజరాన్ని గుర్తించిన పోలీసులు

ముండ్లమూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూరిమెట్ల గ్రామానికి చెందిన తానిపర్తి వెంకటరెడ్డి(37) అప్పుల బాధతో పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం ఆలస్యంగా వెలుగుచూసింది. గత మార్చి 27న అప్పుల విషయమై భార్య నాగలక్ష్మితో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి బంధువులు చుట్టుపక్కల అన్ని గ్రామాల్లోనూ వెతికారు. పొలాలు కలియ తిరిగారు. బంధువులు, స్నేహితుల ద్వారా ఇతర చోట్లా వెతికించారు. ఎక్కడా కనిపించకపోవడంతో ముండ్లమూరు పోలీసుస్టేషన్‌లో భార్య ఫిర్యాదు చేశారు. శనివారం తన బంధువైన తానిపర్తి నర్సారెడ్డి ఉమామహేశ్వర అగ్రహారం పొలాల్లో అస్థిపంజరం ఉండటాన్ని గమనించారు. విషయం తెలపడంతో నాగలక్ష్మి వచ్చి చూడగా కొన్ని ఆనవాళ్ల (చొక్కా, లుంగి) ఆధారంగా తన భర్తేనని ఆమె గుర్తించారు. విషయాన్ని పోలీసులకు తెలపటంతో ఎస్ఐ కమలాకర్ సిబ్బందితో వెళ్లి అస్థిపంజరాన్ని పరిశీలించారు. నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అస్థిపంజరాన్ని ప్రొఫెసర్ల సమక్షంలో పంచనామా నిర్వహిస్తామని ఎస్ఐ తెలిపారు. వెంకటరెడ్డి గత నాలుగు సంవత్సరాల నుంచి తనకు ఉన్న పొలంతో పాటు కొంత కౌలుకు తీసుకొని మిర్చి, పొగాకు సాగు చేస్తున్నాడు. వరుసగా తీవ్రమైన నష్టాల వచ్చాయి. రూ.20 లక్షల మేర అప్పులు ఉన్నట్టు సమాచారం. భార్యాభర్తల మధ్య ఇంట్లో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో వెంకటరెడ్డి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎస్ఐ కమలాకర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



పొదిలిలో రాళ్ల దాడిలో గాయపడిన కానిస్టేబుల్ జీవీ రత్నం (ఫైల్)

చర్యలు వేగవంతం

● పొదిలి దాడి ఘటనపై ముమ్మర దర్యాప్తు ● రెండు కేసులు.. 24 మంది అరెస్టు ● బూచేపల్లికి నోటీసులు జారీ

మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 11న పొదిలిలో పొగాకు రైతులను పరామర్శించేందుకు వచ్చిన సమయంలో జరిగిన ఘటనపై చర్యలు వేగవంతమయ్యాయి. దాడిలో పాల్గొన్న వైసీపీ మూకలను గుర్తించేందుకు పోలీసులు ముమ్మర దర్యాప్తు చేపట్టారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మహిళలపై రాళ్లు, చెప్పులు విసిరిన, పొగాకు బోర్డులో చేరి బేళ్లు తొక్కి శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన మూకలపై చర్యలు తీసుకోనున్నారు.

ఒంగోలు క్రైం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : పొదిలిలో జగన్ పర్యటనలో కొన్ని మూకలు పోలీసుల విధులను ఆటంకపరిచి ముగ్గురు పోలీసులను గాయపరిచాయి. సీసీ ఫుటేజీ ద్వారా నిందితులను గుర్తించి ఈనెల 12న తొమ్మిది మందిని అరెస్టు చేశారు. శనివారం మరో 15 మందిని అరెస్టు చేశారు. ఘటనలకు సంబంధించి బాధ్యుడిగా ఉన్న దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి పోలీసులు నోటీసులు అందజేశారు. పోలీసులు పలు కీలక సూచనలు చేసినా నిర్లక్ష్యంగా వ్యవహరించి చట్టాన్ని అతిక్రమించారని నోటీసులో పేర్కొన్నారు. వైసీపీ కార్యకర్తల కార్యకలాపాలను అడ్డుకోలేకపోయారని తెలిపారు. అందుకు సంబంధించి చట్టపరమైన చర్యలు ఎందుకు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని నోటీసులో కోరారు. ఈ మేరకు పొదిలి సీఐ వెంకటేశ్వర్లు నోటీసులు అందజేశారు. అదేక్రమంలో ఇంకా సీసీ ఫుటేజీని క్షుణంగా పరిశీలించి బాధ్యులైన వారిని అరెస్టు చేస్తామన్నారు. ఈ కేసులో ఉన్న వారిపై గతంలో నేరచరిత్ర పరిశీలించి అవసరమైన వారిపై రౌడీషీట్లు తెరిచేందుకు వెనుకాడబోమని సీఐ తెలిపారు. శాంతిభద్రతలకు భంగం కలిగించడమే కాకుండా, పోలీసు విధులను ఆటంకపరిచి, ముగ్గురు పోలీసులను గాయపరిచారని వివరించారు. ఇంకా దర్యాప్తు కొనసాగుతోందన్నారు.

నిందితుల్లో 11 మందికి నేర చరిత్ర

ఒంగోలు క్రైం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పొదిలిలో రాళ్లు, చెప్పులు దాడిలో పాల్గొన్న 24 మంది నిందితుల్లో 11 మందిపై నేర చరిత్ర ఉన్నట్లు తెలిసింది. పోలీసు రికార్డుల ప్రకారం కంభం మండలానికి చెందిన రావూరి చిన్న వెంకటరాజులు, బిజ్జం వెంకటసుబ్బారెడ్డి, పొదిలికి చెందిన షేక్ మంజూవలి, షేక్ ఇంతియాజ్, ఇస్లాంపేటకు చెందిన షేక్‌బాజీ, సాలూరుకు చెందిన పుని వెంకటేశ్వర్లు, అర్ధవీడు మండలానికి చెందిన నల్లి వెంకటకొండయ్య, కొనకనమిట్ల మండలానికి చెందిన మోరా శంకరరెడ్డి, పెదారకట్లకు చెందిన చొప్పర వీరాంజనేయులు, ముండ్లమూరు మండలానికి చెందిన మేకల క్రిష్టారెడ్డి, చీమకుర్తికి చెందిన మన్నం శ్రీధర్ బాబులపై గతంలో కేసులున్నాయి. నేర చరిత్ర కలిగినవారిపై రౌడీషీట్లు తెరిచేందుకు పరిశీలిస్తున్నామని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.



లబ్ధిదారుడికి చెక్‌ను అందజేస్తున్న మంత్రి స్వామి

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కొండపి (టంగుటూరు), జూలై 14 (ఆంధ్రజ్యోతి): పేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్ నిలుస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖా మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి అన్నారు. మండలంలోని తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన అనారోగ్య బాధితులు 32 మందికి రూ.18 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని, ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వసతులు కల్పిస్తున్నామని అన్నారు. ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ పథకంతోపాటు, పేదలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు.

స్వీట్‌షాప్ నిర్వాహకుడు బలవన్మరణం



నాగరాజు మృతదేహం

ఒంగోలు క్రైం, జూన్14 (ఆంధ్రజ్యోతి): స్వీట్‌షాప్ నిర్వహించే శ్రీరామ నాగరాజు (32) బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన ఒంగోలు నగరం కొత్తపట్నంరోడ్డులోని ఇందిరమ్మ కాలనీ 8 లైన్‌లో జరిగింది. వివరాలలోకి వెళితే.. నాగరాజు కొత్తపట్నం బస్టాండ్‌లో స్వీట్‌షాప్ నిర్వహిస్తు జీవనం సాగిస్తున్నాడు. ఇందిరమ్మ కాలనీలో ఆయన తమ్ముడు నాగేంద్రవర్మ ఇంటి పైఅంతస్తులో ఉంటుండగా, గ్రౌండ్‌ఫ్లోర్‌లో నాగరాజు కుటుంబ సభ్యులు ఉంటున్నారు. గత నెల 25న నాగరాజు తల్లి ఆరోగ్యం సరిగా లేక మృతి చెందింది. దీంతో అప్పటి నుంచి నాగరాజు మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో ఆయన భార్య గీతగాయిత్రి గొడవపడుతూ ఉంటుందని కుటుంబసభ్యులు తెలిపారు. దీంతో శుక్రవారం రాత్రి పొద్దుపోయిన తరువాత మద్యం తాగి వచ్చిన నాగరాజు బెడ్‌రూంలో పడుకున్నాడు. ఆయన భార్య హాలులో నిద్రపోయారు. శనివారం ఉదయం లేచి చూసే సరికి బెడ్‌రూం తలుపుతీయలేదు. దీంతో నాగేంద్రవర్మ ఇంటి చుట్టుపక్కల వారి సహాయంతో తలుపు పెకళించి లోపలికి వెళ్ళి చూసి సరికి చీరతో ఉరి వేసుకున్న నాగరాజును కిందకు దించారు. అప్పటికే ఆయన మృతి చెందాడని గుర్తించి తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు నాగేంద్ర వర్మ తెలిపారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోలేరమ్మ ఆలయంలో మంత్రి పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి స్వామి

జరుగుమల్లి, జూన్14 (ఆంధ్రజ్యోతి): కామేపల్లిలోని పోలేరమ్మ ఆలయంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు స్వామికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మంత్రికి ఆలయ అర్చకులు గోత్ర నామార్చనలు చేసి అమ్మవారి శేషవస్త్రం తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆలయ ఆవరణలో జరుగుతున్న అభివృద్ధి పనులు గురించి ఆలయ ఈవో బైరాగిచౌదరితో మాట్లాడి తెలుసుకున్నారు. ఆలయ పవిత్రతను కాపాడాలని ఈ సందర్భంగా ఆలయ సిబ్బందికి, గ్రామస్థులకు మంత్రి సూచించారు.

వైభవంగా కోదండరామస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



తిలకిస్తున్న భక్తులు

ఒంగోలు(రూరల్), జూన్14 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం సర్వేరెడ్డిపాలెంలో శనివాం శ్రీకోదండరామస్వామివారి దేవాలయ ఆవరణలో స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వేదపండితులు పరాంకుశంకేశవాచార్యులు స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేసి కల్యాణక్రతువును నిర్వహించారు. అనంతరం భక్తలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీటీడీ వేదపండితులు నారాయణం వెంకటరామణాచార్యులు, వేదపండితులుపరాం కుశం చక్రవర్తి, రంగా, రాముశర్మ పాల్గొన్నారు.

మహిళలపై దాడి తప్ప..
వైసీపీ సాధించిందేమీ లేదు !

● మార్కాపురం ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు జగన్ పొదిలి పర్యటనలో ఆ పార్టీ శ్రేణులు మహిళలపై దాడి చేయడం తప్ప వాళ్ల సాధించిందేమీ లేదని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం మార్కాపురంలోని జవహర్‌నగర్ కాలనీలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో పొదిలి పర్యటనలో వైసీపీ మూకలు మహిళలపై చేసిన దాడి వీడియోలను చూపించారు. ఎలాంటి సమస్య లేకున్నా కేవలం బలప్రదర్శన కోసమే జగన్ పర్యటన ఏర్పాటు చేశారని విమర్శించారు. అమరావతి మహిళలను తీవ్ర పదజాలంతో వైసీపీ మీడియా సంస్థలో కించపరిచేలా మాట్లాడినందుకు తెలుగు మహిళలు శాంతియుతంగా నిరసన తెలిపారన్నారు. కానీ మద్యం మత్తులో వైసీపీ రౌడీ మూకలు ఇష్టారాజ్యంగా రాళ్ల, చెప్పులతో మహిళలని కూడా చూడకుండా దాడి చేయడం సిగ్గు చేటని మండిపడ్డారు. అలాంటి వారిని పోలీసులు అరెస్ట్ చేస్తుంటే వైసీపీ నాయకులు గగ్గోలు పెట్టడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. గత వైసీపీ పాలనలో తాను ప్రజాసమస్యలపై నిరసనలు, ధర్నాలు చేస్తే 17కేసులు నమోదు చేశారని గుర్తు చేశారు. తల్లికివందనం పథకం కింద తల్లుల ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమ చేస్తుంటే వైసీపీ నాయకులు తట్టుకోలేక పోతున్నారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో కుటుంబంలో ఒక్కరికి మాత్రమే లబ్ధి కలిగిందన్నారు. కానీ నేడు ఎంతమంది పిల్లలుంటే అంతమందికి రూ.13వేల చొప్పున ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన మాటకు కట్టుబడి అన్ని పథకాలు అమలు చేస్తున్నారని, ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి తట్టుకోలేక వైసీపీ శ్రేణులు దుష్ప్రచారాలు చేస్తున్నాయని ఆరోపించారు. సమావేశంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చెరువుకొమ్ముపాలెం-యరజర్ల రోడ్డు
అధ్వానం!

గుంతలమయంగా మారిన వైనం ● అవస్థలు పడుతున్న వాహనదారులు
పట్టించుకోని అధికారులు



చెరువుకొమ్ముపాలెం వద్ద రోడ్డు ఇలా..



యరజర్ల సమీపంలో రోడ్డుపై ఏర్పడిన భారీ గుంతలు

ఒంగోలు మండలంలోని చెరువుకొమ్ముపాలెం-యరజర్ల గ్రామాల మధ్య గల తారురోడ్డు గుంతలయయంగా మారింది. దీంతో వాహనదారులు ఈ రోడ్డులో ప్రయాణించాలంటే అవస్థలు పడుతున్నారు. ఒంగోలులోని జాతీయ రహదారి నుంచి రాత్రి సమయాల్లో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు ఈ గుంతలు గమనించలేక ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రతిరోజు ఇలాంటి సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రహదారుల అభివృద్ధిపై దృష్టి సారించిన నేపథ్యంలో ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి ఈ రోడ్డులో ఏర్పడిన గుంతలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

- ఒంగోలు(రూరల్), ఆంధ్రజ్యోతి

నిరుద్యోగ భృతిని కూడా ఇవ్వాలి

● పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులు, యువజనులకు ఇచ్చిన నిరుద్యోగ భృతి పథకాన్ని కూడా అమలు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్, రాజశేఖర్ కోరారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.50 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేయాలన్నారు, స్థానిక మాదాల నారాయణస్వామి భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతిని వెంటనే ఇవ్వాలన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా హామీని అమలు చేయకపోవడం దారుణంగా ఉందని చెప్పారు. పాఠశాలలు పునఃప్రారంభమైనందున మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు విద్యార్థుల నుంచి భారీగా ఫీజులు, యూనిఫాం, పుస్తకాల పేరుతో భారీగా డబ్బులు వసూళ్ళు చేస్తున్నారని, అందువల్ల ప్రభుత్వం ఆయా పాఠశాలలను నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్.శ్యామ్, వి.కోటి, వెంకట్రావు, సచిన్, ప్రేమ్‌కుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పేస్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే

● విద్యార్థులకు పట్టాల ప్రదానం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కరస్పాండెంట్ శ్రీధర్

ఒగోలు విద్య, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో వనివారం తృతీయ గ్రాడ్యుయేషన్ డే వేడుకలను నగరంలోని ఓ కన్వెన్షన్‌ల హాలులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరై కళాశాల వైస్ చైర్మన్ మద్దిశెట్టి వాసుబాబు మాట్లాడుతూ విద్యార్థులు తమ సబ్జెక్టుకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకొని ఉన్నత స్థాయికి ఎదిగి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాక్షించారు. మరో అతిథి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ యువ ఇంజనీర్లు సరైన కేరీర్‌ను ఎంపిక చేసుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన ఇంజనీరింగ్ విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ఇంజనీరింగ్ డిగ్రీ పట్టాతో పాటు కంపెనీల ఉద్యోగ ఆఫర్ లేటర్లతో బయటకు పంపించాలని లక్ష్యంగా యాజమాన్యం కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వివిధ ఇంజనీరింగ్ విభాగాలు, ఎంబీఏ, ఎంటెక్ పూర్తి చేసిన 1100 మంది విద్యార్థులకు పట్టాలను అందజేశారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలతో పాటు కోర్ విభాగాల్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీకే. మూర్తి, కొల్లూరి శ్రీనివాసరెడ్డి, సురేంద్రకుమార్. రూప అక్కేష్, జీఈ.బాబు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాలి



కరవదిలో యోగా చేస్తున్న ఎంపీడీవో రాజశేఖర్‌రావు



చేకూరపాడులో యోగాసనాలు చేస్తున్న అధికారులు

● ఎంపీడీవో రాజశేఖర్‌రావు

ఒంగోలు(రూరల్), జూన్14 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాలని, దీనివల్ల శారీరక, మానసిక ఒత్తిడి తగ్గి ఆరోగ్యంగా జీవించవచ్చని ఎంపీడీవో రాజశేఖర్‌రావు పేర్కొన్నారు. ఒంగోలు మండలంలోని పలు గ్రామాల్లో శనివారం యోగా కార్యక్రమాలు జరిగాయి. కరవది, ఉలిచి గ్రామాల్లో జరుగుతున్న యోగా సాధనను ఎంపీడీవో పరిశీలించారు. ప్రతిరోజు యోగా సాధన చేయాలని కోరారు. పంచాయతీ కార్యదర్శులు పూర్ణచంద్రరావు. కాంచన పాల్గొన్నారు.

మద్దిపాడు: మల్లవరంలో శనివారం యోగా శిక్షణ కార్యక్రమాన్ని ప్రభుత్వ ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావు నిర్వహించారు. సంపూర్ణ ఆరోగ్యంతో సంతోషంగా జీవించాలంటే యోగాను జీవితంలో ఒక భాగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వీరాంజనేయులు, సర్పంచ్ నారా సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా చేకూరపాడులోని వేణుగోపాల స్వామి ఓరియంటల్ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన యోగా తరగతులలో ఎంఈవోలు రవి, రమణయ్యలతో కలిసి ఆయన యోగాసనాలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం అనిత, నరసింహారావు, కొండలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొండపి: ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని ఎంపీడీవో బి.రామాంజనేయులు అన్నారు. శనివారం ఉదయం ఉపాధి హామీపథకం కూలీలతో మండల కార్యాలయాల ఆవరణలో యోగా చేయించారు. ప్రతి ఒక్కరూ పనులు చేస్తున్నా, యోగా కూడా చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి వున్నం రామ్మోహన్ పాల్గొన్నారు.

చట్టాలను అందరూ గౌరవించాలి

● జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి
● సబ్ జైళ్లలో ఆకస్మిక తనిఖీలు



సబ్‌జైలులో బియ్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి

గిద్దలూరు టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవించాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి, జిల్లా న్యాయ సేవాధికార చైర్‌పర్సన్ ఎ.భారతి పేర్కొన్నారు. శనివారం గిద్దలూరులోని సబ్‌జైలును ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో ఉన్న విచారణ ఖైదీలను, డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో శిక్షను అనుభవిస్తున్న ఖైదీలతో మాట్లాడారు. ఆ తరువాత సబ్ జైలులో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. మంచి చెడులను గ్రహించే విచక్షణా జ్ఞానాన్ని ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలన్నారు. కుటుంబసభ్యుల మధ్య సత్సంబంధాలు మెరుగుపడాలని, అవి కొరవడిన రోజు మానవ, కుటుంబ సంబంధాలు విచ్ఛిన్నం అయినపుడు సమాజంలో శాంతి ఉండదని చెప్పారు. ఆవేశంతో విచక్షణా జ్ఞానాన్ని కోల్పోయి నేరాలకు పాల్పడుతున్నారని, అలాగే మత్తు పదార్థాలకు బానిసైన యువత ఆరోగ్యాన్ని నష్టం చేసుకోవడమేకాక కుటుంబసభ్యులకు దూరమవుతున్నారని ఆమె అన్నారు. బెయిల్, అరెస్టు, ఉచిత న్యాయ సహాయం గురించి అవగాహన కల్పించారు. విచారణ ఖైదీలకు అందుతున్న సదుపాయాలు, ఆహారం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ షేక్ ఇబ్రహీం షరీఫ్, గిద్దలూరు అడిషనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ది ఫస్ట్‌క్లాస్ కె.భరత్‌చంద్ర, సబ్ జైలు సూపరింటెండెంట్ యు.లింగారెడ్డి, న్యాయవాది సీహెచ్.పోలయ్య, పారా లీగల్ వలంటీర్ అద్దంకి మధుసూదన్‌రావు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

మార్కాపురం: జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎ.భారతి శనివారం మార్కాపురం సబ్‌జైల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా సబ్‌జైల్ పరిసరాలను, ప్రధానంగా కిచెన్, పారిశుధ్య పరిస్థితి, ఖైదీల వసతి తదితర అంశాలపై పరిశీలించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎవరైనా న్యాయవాదిని పెట్టుకోలేకుంటే మండల న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆరవ అదనపు జిల్లా న్యాయాధికారి ఎం.శుభవాణి, అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.బాలాజీ, జైలు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పాకల బీచ్‌లో యోగా

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం సింగరాయకొండ మండలం పాకల బీచ్ వద్ద ఉదయం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు యోగా కార్యక్రమాలను నిర్వహిస్తామని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామితో పాటు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు. ప్రజలు పాల్గొనాలని కోరారు. యోగా కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలు తమతో పాటు యోగా మ్యాట్‌ను తెచ్చుకోవాలని కలెక్టర్ సూచించారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

ఒంగోలు(రూరల్), జూన్ 14(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికలలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సీపీఐ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. శనివారం ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 21,22,23 తేదీల్లో దర్శిలో సీపీఐ జిల్లా మహాసభలు జరుగుతాయన్నారు. రాష్ట్ర మహాసభలు ఆగస్టు 20 నుంచి 25వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎల్.నారాయణ, ఆర్.వెంకటరావు, అందె నాసరయ్య, వై.రవీంద్రబాబు, వి.హనుమారెడ్డి, సయ్యద్‌యాసిన్, కేవీ.కృష్ణగౌడ్, సయ్యద్‌మౌలాలి, ఎం.విజయ, పి.ప్రభాకర్ పాల్గొన్నారు

వాహనం ఢీకొని గేదె మృతి

నాగులుప్పలపాడు, జూన్14 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక గేదె మృతి చెందగా మరో రెండు గేదెలు గాయపడ్డాయి. ఈ ఘటన శనివారం ఉప్పుగుండూరు సమీపంలోని టోల్‌గేట్ వద్ద జరిగింది. ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన బట్టు వేణుకు చెందిన గేదె, కొమ్మనబోయిన శ్రీనివాసరావుకు చెందిన రెండు గేదెలు శుక్రవారం రాత్రి నుంచి కనిపించకపోవడంతో వారు వెదుకుతున్నారు. ఈక్రమంలో గ్రామ సమీపంలోని టోల్‌గేట్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని వేణుకు చెందిన గేదె రోడ్డు పక్కన పడి మృతి చెంది ఉంది. అలాగే శ్రీనివాసరావుకు చెందిన రెండు గేదెలు తీవ్ర గాయాలతో కనిపించాయి. మృతి చెందిన గేదె రూ.లక్ష విలువ చేస్తుందని యజమాని ఆవేదన వ్యక్తం చేశారు.

డీఎస్సీకి 86శాతం మంది హాజరు

ఒంగోలు విద్య, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శనివారం జరిగిన మెగా డీఎస్సీకి 86శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. జిల్లాలోని మూడు పరీక్షా కేంద్రాల్లో ఉదయం సెషన్‌లో 280 మంది అభ్యర్థులకు 240 మంది హాజరు కాగా 40 మంది గైర్హాజరైనట్లు డీఈవో కిరణ్‌కుమార్ తెలిపారు. మధ్యాహ్నం సెషన్‌లో పరీక్ష జరగలేదు.

17న సంఘీభావ ర్యాలీ

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : గాజాలోని పాలస్తీయన్లపై ఇజ్రాయిల్ ప్రభుత్వం సాగిస్తున్న ఊచకోతను ఖండిస్తూ ఈనెల 17వతేదీన ఒంగోలులో నిర్వహిస్తున్న సంఘీభావ నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని వామపక్షాల నాయకులు కోరారు. శనివారం స్థానిక సుందరయ్యభవన్‌లో సీపీఎం, సీపీఐ, సీపీఐఎంఎల్, న్యూడెమోక్రసీ పార్టీల నాయకులు సమావేశమయ్యారు. పాలస్తీనాకు సంఘీభావంగా పట్టణాలు, మండలాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో నాయకులు ఎస్‌కే.మాబు, వెంకట్రావు, ఎంఎస్.సాయి, ఆర్.మోహన్, జీవీ.కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు, శ్రీరామ్ శ్రీనివాసరావు, కొత్తకోట వెంకటేశ్వర్లు, పరిటాల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

క్షయ పట్ల అవగాహన పెంచుకోవాలి

మద్దిపాడు, జూన్14(ఆంధ్రజ్యోతి): ప్రజలు క్షయ వ్యాధి పట్ల అవగాహన పెంచుకోవాలని హెల్త్ సూపర్‌వైజర్ చంద్రమౌళి అన్నారు. శనివారం మద్దిపాడు పీహెచ్‌సీలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ 60 సంవత్సరాలు దాటిన వ్యక్తులు మద్యపానం, పొగతాగటం వల్ల క్షయ వచ్చే అవకాశం ఉందన్నారు. ఆశాకార్యకర్తలు, ఏఎన్ఎంలు గ్రామాల్లో వారం రోజుల పాటు దగ్గుతో బాధపడుతుంటే వారికి కళ్లెపరీక్షలు చేయాలని చెప్పారు. వందరోజుల పాటు మండల వ్యాప్తంగా క్షయ అనుమానితుల్ని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ బాటకోటయ్య, దరియా, సుభాషిణి, పద్మ, రజిత, నాగరాజకుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పండ్లతోటల పెంపకానికి ఉపాధి నిధులు

మద్దిపాడు, జూన్ 14(ఆంధ్రజ్యోతి) ఉపాధి హామీ పథకం ద్వారా సన్న, చిన్న కారు రైతులు పండ్లతోటలు సాగు చేసుకోవాలని ఏపీవో ధనుంజయ్‌వర్మ శనివారం ఓ ప్రకటనలో కోరారు. పండ్ల మొక్కలు నాటిన తరువాత మూడేళ్ల వరకు ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తుందన్నారు. ఐదు ఎకరాలలోపు భూమి, ఉపాధి హామీ జాబ్‌కార్డు ఉన్నవారు ఈ పథకానికి అర్హులు. ఆసక్తి గల రైతులు ఉపాధి హామీ సిబ్బందిని సంప్రదిరంచి దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

గంజాయి తరలిస్తున్న నిందితుడు

● అదుపులోకి తీసుకున్న పోలీసులు ?

ఒంగోలు క్రైం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి గంజాయి తరలిస్తున్న నిందితుడిని శనివారం ఉదయం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఒంగోలు నగరం అద్దంకి బస్టాండ్‌లో బస్సు దిగి వస్తుండగా 8 కిలోల గంజాయి ఉన్నట్లు అనుమానించిన పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఒంగోలులో కొంతమంది విక్రయదారులకు గంజాయి సరఫరా చేస్తున్నట్లు గుర్తించినట్లు తెలుస్తోంది. ఇంకా ఈ విషయం పోలీసులు నిర్ధారించలేదు.

ప్రపంచశాంతి కోసం పోరాడాలి



చేగువేరా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

ఒంగోలు కలెక్టరేట్ జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో ఎక్కడ అన్యాయం జరిగినా యువత సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చిన యోధుడు చేగువేరా అని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.వినోద్ అన్నారు. ఒంగోలులోని ఎస్ఆర్ఐకాలేజీలో శనివారం చేగువేరా జయంతి సందర్భంగా విద్యార్థులతో కలిసి నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శి బండి వీరస్వామి అధ్యక్షతన జరిగిన సభలో వినోద్ మాట్లాడుతూ ప్రపంచమానవళి విముక్తి కోసం పోరాడిన చేగువేరా జీవితం విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు విజయకుమార్, పి.దేవా, టి.విజయ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాఖలో బదిలీలను మాన్యువల్‌గా నిర్వహించాలి

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : వైద్యఆరోగ్యశాఖలో ఉద్యోగుల బదిలీలను జూమ్ విధానంలో కాకుండా మాన్యువల్ విధానంలో నిర్వహించాలని ఏపీఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు కే శరత్ బాబు కోరారు. స్థానిక ఎన్‌జీవో భవన్‌లో శనివారం జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైద్యఆరోగ్యశాఖలో బదిలీలను పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. అయితే వైద్యశాఖలో బదిలీలను మాన్యువల్‌గా కాకుండా జూమ్ మీటింగ్ ద్వారా జరపాలని నిర్ణయించడాన్ని ఆయన ఖండించారు. జూమ్ మీటింగ్ ద్వారా బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించడం వల్ల ఉద్యోగులు నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. సాంకేతిక సమస్యలు వచ్చే పరిస్థితి ఉంటుందన్నారు. వైద్యఆరోగ్యశాఖలో మహిళాఉద్యోగినులు ఎక్కువ మంది ఉన్నారని, వారికి సాంకేతికపరంగా కూడా పెద్దగా అవగాహన లేకపోవడం వల్ల బదిలీల్లో నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. అందువల్ల ఉద్యోగుల బదిలీలు పారదర్శకంగా జరగాలంటే జూమ్ విధానంలో కాకుండా మాన్యువల్ విధానంలో నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్‌చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆర్‌సీహెచ్ కృష్ణారెడ్డి, ఒంగోలు పట్టణ అధ్యక్షుడు కొత్తపల్లిమంజేష్, కార్యదర్శి షేక్ మగ్దుమ్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



శత వసంతాల సరస్వతీ నిలయం

ఒంగోలు పీవీఆర్ఎం స్కూలు


పిశుపాటి వెంకట రంగయ్య (ఫైల్)

● వేలాదిమందికి విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల ● పిశుపాటి వెంకట రంగయ్య జమిందార్ స్థాపన ● ఇక్కడ చదివిన అనేకమంది ఉన్నతస్థానాలకు

ఒక అక్షరం లక్ష మెదళ్లను కదిలించే ఆయుధం అంటారు. అటువంటి అక్షరానికి బీజం పడేది పాఠశాలలో. ఏ పాఠశాలలో అయితే నిబద్ధత కలిగిన గురువులు ఉంటారో అటువంటి పాఠశాలలో చదివే విద్యార్థులు సైతం విద్యలో రాణించటమే కాకుండా క్రమశిక్షణకు మారుపేరుగా కూడా నిలుస్తారు. మనిషి జీవితంలో పాఠశాల విద్యే పునాది. ఆ పునాది ఎంత గట్టిగా ఉంటే అతని భవిష్యత్తు అంత ప్రజ్వలంగా ఉంటుంది. ఎన్నో వేల మంది విద్యార్థులకు అటువంటి గట్టి పునాదిని వేసి వారు జీవితంలో ఉన్నత స్థాయికి, స్థానానికి చేరుకోవటానికి తొలిమెట్టుగా నిలిచిన ఘనత ఒంగోలు నగరంలోని పిశుపాటి వెంకట రంగయ్య మునిసిపల్ ఉన్నత పాఠశాల (పీవీఆర్ఎం హైస్కూల్)ది.

నేడు శతాబ్ది ఉత్సవం

ఒంగోలు కల్చరల్,జూన్ 14(ఆంధ్రజ్యోతి):ఒంగోలు సమీపంలోని కరవది గ్రామానికి చెందిన జమిందార్ పిశుపాటి వెంకట రంగయ్య దాతృత్వంతో ఏర్పడి వంద సంవత్సరాలకు పైగా ఘన చరిత్ర కలిగిన పీవీఆర్ మునిసిపల్ ఉన్నత పాఠశాల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొదటి ఐదు స్థానాలలో ఉన్న ఉన్నతమైన పాఠశాలలో ఒకటిగా పేరుపొందింది. ఇక్కడ చదివిన అనేకమంది ఉన్నత స్థానాలను పొందటమే కాకుండా విదేశాలలో సైతం రాణిస్తున్నారు. అటువంటి ఘన చరిత్ర కలిగిన పీవీఆర్ఎం ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవం నేడు ఒంగోలు కోర్టు సెంటర్‌లో ఉన్న పీవీఆర్ఎం బాలికల ఉన్నత పాఠశాలలో జరుగనున్నది.

ఎలిమెంటరీ పాఠశాలగా ప్రారంభం

కరవది గ్రామానికి చెందిన జమిందారు పిశుపాటి వెంకట రంగయ్య బ్రిటిష్ అధికారులు, నాటి నెల్లూరు జిల్లా అధికారుల అనుమతితో ఎలిమెంటరీ పాఠశాలను 1898లో ప్రారంభించారు. అప్పట్లో ఆ పాఠశాలను ఒంగోలులోని పాతమార్కెట్ సమీపంలో ఏర్పాటుచేశారు. దానిని పిశుపాటి వెంకట రంగయ్య (పీవీఆర్) పేరుతోనే పిలిచేవారు.

సొంత భవనం ఏర్పాటు

పాతమార్కెట్ వద్ద ఉన్న పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎక్కువ అయి స్థలం సరిపోకపోవటంతో వెంకట రంగయ్య ప్రస్తుతం పీవీఆర్ బాలికల ఉన్నత పాఠశాల ఉన్న స్థలాన్ని తన సొంత నిధులతో కొనుగోలు చేసి, రంగూన్ నుంచి టేకును తెప్పించి పాఠశాల భవనాన్ని నిర్మించారు. ఆ పాఠశాల భవనం 1925లో ప్రారంభం అయింది. అప్పటివరకు ఎలిమెంటరీ విద్య మాత్రమే ఉన్న స్కూలులో 1 నుంచి 8 తరగతుల వరకు ప్రవేశపెట్టారు. అలాగే ఆ పాఠశాల విద్యార్థుల సంఖ్య 1000కి చేరింది.

రెండు పాఠశాలలుగా ఏర్పాటు

ఇక పీవీఆర్ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగటం ఉన్న పాఠశాల భవనం సరిపోకపోవటంతో నాటి ప్రధానోపాధ్యాయుడు కొప్పోలు హనుమంత రావు చొరవచూపి, పీవీఆర్ స్కూలులో చదివి అప్పట్లో డైరక్టర్ ఆఫ్ పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్‌గా ఉన్న కొణిజేడు గ్రామానికి చెందిన తాటిపర్తి వెంకారెడ్డిని కలిసి మరో భవన నిర్మాణానికి అనుమతి కోసం విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం బస్టాండు వెళ్లే దారిలో ఉన్న పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల భవనానికి 1989 జూలై 31న అనుమతి లభించింది. దీంతో కోర్టుసెంటర్‌లో ఉన్న పాఠశాలను బాలికలకు, నూతనంగా నిర్మించిన భవనంలో బాలురకు విద్యాభ్యాసం జరిగేది. 1989 సెప్టెంబర్ 18న కోర్టుసెంటర్‌లో ఉన్న పాఠశాలకు పీవీఆర్ఎం బాలికల ఉన్నత పాఠశాలగా గుర్తింపు లభించింది.

ఉన్నత స్థాయిలో ఎంతో మంది విద్యార్థులు

ఇక పీవీఆర్ ఉన్నత పాఠశాలలో చదివిన అనేకమంది అటు ప్రభుత్వ రంగంలో, ఇటు వైద్య, వ్యాపార రంగాలలో ఉన్నత స్థానాలకు చేరుకున్నారు. అంతేకాకుండా అనేకమంది విదేశాలకు సైతం వెళ్లి ఉన్నత ఉద్యోగాలు సంపాదించారు. ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం (హైకోర్టు) న్యాయమూర్తిగా పనిచేసిన కాళ్ళకూరి గిరిజా శంకర్, ఐఏఎస్ అధికారిగా పనిచేసిన నాయని లక్ష్మీ నరసింహారావు, ఆంధ్రప్రదేశ్ డీజీపీగా పనిచేసిన సాంబశివరావు ఇలా చెప్పుకుంటూ పోతే ఉన్నతస్థానాలను అధిరోహించిన అనేకమంది ఆ పాఠశాల విద్యార్థులే. అంతటి ఘనచరిత్ర కలిగిన పీవీఆర్ పాఠశాల శతాబ్ది ఉత్సవాన్ని పూర్వ విద్యార్థులు ఒక కమిటీగా ఏర్పడి నేడు నిర్వహించనున్నారు.

మునిసిపల్ ఉన్నత పాఠశాలగా రూపాంతరం

ఇక పిశుపాటి వెంకట రంగయ్య ఆస్తుల పంపకంలో భాగంగా ఆయన కుమారుడు పిశుపాటి వెంకట్రాయ శర్మకు, అనంతరం వెంకట్రాయ శర్మ కుమారుడు వెంకట రమణయ్యకు పాఠశాల నిర్వహణ బాధ్యత వచ్చింది. అయితే వెంకట రమణయ్య నిర్వహణలో పాఠశాల అనేక ఒడిదొడుకులు ఎదుర్కొని, ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించలేని స్థితి ఏర్పడటంతో ఆ పాఠశాలను మూసివేయాలని నిర్ణయించారు. ఎంతోమంది విద్యార్థులకు విద్యాబుద్ధులు అందిస్తున్న పాఠశాల మూతపడబోతుందన్న విషయం బాధ కలిగించిన నాటి ప్రధానోపాధ్యాయుడు నర్సింగోలు జనార్దనరావు విషయాన్ని ఒంగోలు మునిసిపల్ చైర్మన్ ధారా గోపాల శాస్త్రిని కలిసి సమస్య పరిష్కారానికి చర్చించారు. దాంతో గోపాల శాస్త్రి చొరవతో 1950లో పీవీఆర్ ఉన్నత పాఠశాల ఒంగోలు మునిసిపాలిటీ పరిపాలన కిందకు వచ్చింది. అప్పటి నుంచి దానిని పీవీఆర్ మునిసిపల్ ఉన్నత పాఠశాలగా పిలవటం ప్రారంభమైంది. అప్పటివరకు పాఠశాలలో కేవలం 8వ తరగతి వరకు మాత్రమే ఉండేది. 1951లో 9వ తరగతి, 1952లో పదవ తరగతి, 1953-54లో ఎస్ఎస్ఎల్‌సీలను ప్రవేశపెట్టారు. ఒకానొక దశలో అంటే 1975 నుంచి 1990 ప్రాంతాల వరకు ఈ పాఠశాలలో చదివే విద్యార్థుల సంఖ్య సుమారు 2,700కు చేరుకుంది. అంత తారస్థాయికి విద్యార్థుల సంఖ్య చేరుకోవటానికి నాటి ఉపాధ్యాయ బృందం కృషితో పాటు 1977 నుంచి 1989వరకు 12 సంవత్సరాలపాటు పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా పనిచేసిన కొప్పోలు హనుమంత రావు కృషికూడా ఎంతో ఉందని చెప్పొచ్చు.

పీవీఆర్‌లో పనిచేయటం ఎంతో గర్వకారణం



ఎంతో ఘన చరిత్ర కలిగిన పీవీఆర్ పాఠశాలలో పనిచేయటం నిజంగా గర్వకారణం. ఈ పాఠశాలలో చదివిన ఎంతో మంది విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నతస్థానాలకు చేరుకున్నారు. పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది సైతం ఎంతో నిబద్ధతతో పనిచేసేవారు. దీంతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగి రెండు వేలకు పైగా విద్యార్థులు కలిగిన పాఠశాలగా రాష్ట్రస్థాయిలో నాడు గుర్తింపు పొందింది. నేను ప్రధానోపాధ్యాయుడిగా పదవీ విరమణ చేసిన 1989వ సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య 2,700 మంది. ఇంతగొప్ప పాఠశాలను ఒంగోలుకు అందించిన పిశుపాటి వెంకట రంగయ్య గారు చిరస్మరణీయులు.

-కొప్పోలు హనుమంతరావు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు



ఎస్జీటీలకు నిర్వహిస్తున్న కౌన్సెలింగ్

ముగిసిన ఎస్జీటీల బదిలీ కౌన్సెలింగ్

● అర్ధరాత్రి వరకు సాగిన ప్రక్రియ

ఒంగోలు విద్య, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీ కౌన్సెలింగ్ శనివారం అర్ధరాత్రితో ముగిసింది. శనివారం టీచర్ల బదిలీల సీనియార్టీ జాబితాల్లో 2,301 నుంచి 3,148 వరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్జీటీల బదిలీల కౌన్సెలింగ్ ప్రారంభం నుంచి ప్రతిరోజు అర్ధరాత్రి వరకు కౌన్సెలింగ్ జరుగుతుండగా శుక్రవారం మాత్రం తెల్లవారేదాకా జరిగింది. మొత్తం మీద బదిలీల కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఎస్జీటీలకు మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహించారు.

స్పౌజ్‌లో కొందరికి చిక్కులు

స్పౌజ్ పాయింట్లతో మెరుగైన స్థానం కోరుకుందాం అనుకున్న మహిళా టీచర్లు బదిలీల్లో చుక్కలు చూశారు. భర్త దూరంగా పనిచేస్తుండటంతో భార్యలు కూడా వారి దగ్గరికి పోవాల్సి రావడంతో కొందరు అనివార్యంగా సుదూర ప్రాంతాలు కోరుకోవాల్సి వచ్చింది. స్పౌజ్ పాయింట్లు లేని కొందరు టీచర్లకు మేలైన స్థానాలు దొరకడంతో వారు ఆనందంగా ఉండగా దూర ప్రాంతాలకు పోయినవారు మాత్రం శాపనార్థాలు పెడుతున్నారు. మొత్తంగా టీచర్ల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ మొదట్లో కొంత గందరగోళంగా ఉన్నా తర్వాత సాఫీగా ముగిసింది.

రిక్వెస్టు బదిలీ వారికి ఊరట

అభ్యర్థన మేరకు బదిలీల కోసం దరఖాస్తు చేసిన వారికి చివరి రోజు ఊరట లభించింది. తప్పనిసరి బదిలీ కాని వారు స్థానాలు కోరుకునే పనైతేనే హాజరు కావాలి. మంచి స్థానాలు లేవని వారు కోరుకునేందుకు ఆసక్తి చూపకపోతే వారు కౌన్సెలింగ్‌కు హాజరుకాకపోయినా ఇబ్బంది లేదని డీఈవో కిరణ్‌కుమార్ ఊరట కల్పించారు. హాజరుకాని వారికి 'నాట్అప్లైడ్' అని నమోదు చేసి వదిలేస్తామని చెప్పారు. దీంతో బదిలీ తప్పనిసరి కాని వారు కొందరు కౌన్సెలింగ్‌కు హాజరు కాలేదు. మొదట్లో స్థానాలు కోరుకోని వారు కూడా తప్పనిసరిగా కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని నిబంధన పెట్టడంతో వారు ఇబ్బందిపడ్డారు. అయితే ఆఖరు రోజు వారికి అవకాశం ఇవ్వడంతో స్థానాలు కోరుకోని వారు ఊపిరిపీల్చుకున్నారు.

టీచర్ల సంఘాల సహకారం

టీచర్ల బదిలీల కౌన్సెలింగ్‌లో ఒకటి, రెండు ఘటనలు మినహా మిగిలిన విషయాల్లో టీచర్ల సంఘాలు కౌన్సెలింగ్‌కు పూర్తిగా సహకరించాయి. సంఘాలన్నీ కౌన్సెలింగ్ జరిగే పాత జిల్లా పరిషత్ సమావేశపు హాలు వద్ద షామియానాలు, కుర్చీలు, చల్లటి నీరు ఏర్పాటు చేశారు. కౌన్సెలింగ్ నిర్వహణలో డీఈవో, ఇతర అధికారుల బృందానికి సహకరించాయి. విద్యాశాఖ గుంటూరు ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి, జాయింట్ డైరెక్టర్ అబ్రహంలు కూడా ఒకరోజు కౌన్సెలింగ్‌ను పర్యవేక్షించారు. మొత్తంగా జిల్లాలో టీచర్ల బదిలీల కౌన్సెలింగ్ ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా ప్రశాంతంగా ముగియడంతో అటు అధికారులు, ఇటు టీచర్లు ఊపిరి పీల్చుకున్నారు.

నేడు ఎస్జీటీ ఉర్దూ కౌన్సెలింగ్

ఎస్జీటీ ఉర్దూ, పీఈటీ భాషా పండితులకు ఆదివారం ఉదయం 9 గంటలకు కౌన్సెలింగ్ జ.రుగుతుంది. సీనియారిటీ జాబితాలోని 1 నుంచి 76 వరకు ఉన్న ఉపాధ్యాయులు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలి. ప్రిఫరెన్షియల్ కేటగిరీ, స్పౌజ్ పాయింట్లు పొందిఉన్నవారు ఎస్ఆర్‌లు తీసుకుని హాజరు కావాలి.



గంజాయితో పాటు నిందితులను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

విశాఖపట్నం టూ సేలం

గంజాయి రవాణా

● ఒంగోలు అద్దంకి బస్టాండ్‌లో 44 కిలోలు పట్టివేత
● ఇద్దరు విశాఖ వాసుల అరెస్టు
● మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం

ఒంగోలు క్రైం, జూన్14 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి తమిళనాడులోని సేలంకు గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి 44 కిలోల గంజాయిని ఒంగోలు ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విశాఖపట్నంకు చెందిన వడిసెల మోహన్‌రావు, నెత్తింటి అప్పలరావును అరెస్టు చేసినట్లు సీఐలు నరహరి, రామారావులు తెలిపారు. శనివారం ఉదయం అద్దంకి బస్టాండ్ సెంటర్‌లో అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రెండు కిలోల బరువున్న 22 గంజాయి ప్యాకెట్లు, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

విశాఖపట్నంలోని అరిలోవ లోన్-16 వద్ద ఆనంద్ అనే వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడైయిందన్నారు. కిలో గంజాయి రూ.4 వేలకు కొనుగోలు చేసి తమిళనాడు రాష్ట్రంలోని సేలంలో రూ. 7 వేలకు విక్రయిస్తామని వారు చెప్పినట్లు తెలిపారు. సేలంలో భూపతి ,అండిస్వామి అనే వారికి విక్రయించేందుకు గంజాయిని బస్సులలో తరలిస్తున్నామని నిందితులు అంగీకరించారని సీఐ తెలిపారు. ఇంకా మరి కొంత మందిని అరెస్టు చేయాల్సి ఉందని వివరించారు.ఈ దాడిలో పాల్గొన్న ఎస్సైలు డి.మౌలాలి,పి.రాజేంద్రప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్ వెంకటరావు , కానిస్టేబుళ్లు శ్రీనివాసరావు కొండలరావు ,రామిరెడ్డి, బాలసుబ్బయ్య,హర్షవర్ధన్, నాగరాజు, జయసూర్య, డ్రైవర్ బ్రహ్మంలను ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హేమంత్‌నాగరాజు అభినందించారని అన్నారు.

అశ్వవాహనంపై వరాహ లక్ష్మీనరసింహుడు

పాతసింగరాయకొండలో వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి స్వామి



సింగరాయకొండ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధిగాంచిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో తొమ్మిదవ రోజైన శనివారం దేవస్థానంలో మూలవిరాట్ శ్రీవరాహ లక్ష్మీనరసింహస్వామి, ఉభయ దేవేరులు రాజ్యలక్ష్మీ, గోదాదేవి అమ్మవార్లకు, యోగానంద లక్ష్మీనరసింహస్వామి, స్వయంభు ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చప్పరంపై ఆశీనులైన ఉత్సవమూర్తులను మోతకాపులు గ్రామోత్సవానికి తీసుకెళ్లారు. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దేవస్థానంలో వరాహ లక్ష్మీనరసింహస్వామి, అమ్మవార్లను, యోగానంద లక్ష్మీనరసింహుడిని, ఆంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి స్వామికి అర్చకులు ఆశీర్వచనం, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో పి. కృష్ణవేణి, ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు, ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రిపాటి రామయ్య, టీడీపీ నాయకులు కొండ్రగుంట శ్రీనివాసులు, గాలి హరిబాబు, మించల బ్రహ్మయ్య, నక్కా బ్రహ్మేశ్వరరావు, చిగురుపాటి గిరి, పామర్తి మాధవరావు, నర్రా రాంబాబు, సన్నెబోయిన మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు. రాత్రికి ప్రత్యేకంగా అలంకరించిన అశ్వవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం ఉదయం స్వామివారికి లక్ష్మీసంవాద ఉత్సవం, చక్రస్నానం, రాత్రికి ధ్వజావరోహణ, పూర్ణాహుతి కార్యక్రమాలు ఉంటాయి.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు అడ్డగింత

నిలదీసిన గాంధీనగర్ వాసులు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని 33 డివిజన్ పరిధిలోని గాంధీనగర్‌లో గృహాలకు స్మార్ట్ మీటర్లు బిగించే ప్రక్రియను శనివారం గృహయజమానులతో పాటు సీపీఎం నాయకులు అడ్డుకున్నారు. గాంధీనగర్ మూడవ లైన్‌లోని గృహాలకు స్మార్ట్ మీటర్లు బిగించేందుకు ఉపక్రమించారు. తమ నివాసాలకు ఉన్న మీటర్లు పనిచేస్తున్నాయని గృహ యజమానులు చెప్పగా స్మార్ట్‌మీటర్ల నిర్వాహకులు ఉచితంగానే మీటర్లను ఏర్పాటు చేస్తున్నామని నచ్చచెప్పే ప్రయత్నంచేసినా బిగించేందుకు ఒప్పుకోలేదు. మరో వైపు సీపీఎం నాయకులు చీకటి శ్రీనివాసరావు, పీర్‌సాహెబ్, దాసు, గురువయ్య తదితరులు అక్కడకు చేరుకొని స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకున్నారు. స్మార్ట్ మీటర్లు బిగించే కాంట్రాక్టర్ ఎవరని ప్రశ్నించారు. దీంతో చేసేది ఏమి లేక అక్కడి నుంచి స్మార్ట్ మీటర్లుబిగించే నిర్వాహకులు వెళ్లిపోయారు.


స్మార్ట్‌మీటర్లు బిగించేందుకు వచ్చిన వారిని ప్రశ్నిస్తున్న సీపీఎం నాయకులు

హెచ్‌ఎంల శిక్షణ వాయిదా

ఒంగోలు విద్య, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఈనెల 16నుంచి ప్రారంభం కానున్న లీడర్‌షిప్ శిక్షణ కార్యక్రమం వాయిదావేశారు. ఈ మేరకు సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీల కౌన్సెలింగ్ పూర్తయి ఈనెల 16న కొత్త పాఠశాలల్లో చేరనున్నారు. చేరగానే టీచర్లు శిక్షణకు వెళితే పాఠశాలల్లో పిల్లల నమోదుపై ప్రతికూల ప్రభావం చూపుతుందన్న భావనతో శిక్షణా కార్యక్రమాలను వాయిదా వేశారు. తిరిగి ఈనెల 23నుంచి ప్రారంభించనున్నారు. ఒక్కొక్క బ్యాచ్‌కు నాలుగు రోజుల పాటు శిక్షణను నిర్వహించనున్నారు. మొదటి బ్యాచ్‌కు ఈనెల 23నుంచి 26 వరకు, రెండో బ్యాచ్‌కు 28నుంచి జూలై1 వరకు, మూడో బ్యాచ్‌కు జూలై 7నుంచి 10 వరకు నిర్వహించాలని నిర్ణయించారు.

నేడు కొత్త టీచర్లు పాఠశాలల్లో చేరాలి

ఒంగోలు విద్య, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : బదిలీ అయి పాఠశాలల్లో చేరకుండా ఆగిపోయిన స్కూలు అసిస్టెంట్ తెలుగు, హిందీ, ఫిజికల్ డైరెక్టర్లు తాజాగా బదిలీ అయిన బాషాపండితులందరూ ఆదివారం కొత్త స్థానాల్లో చేరాలని డీఈవో కిరణ్‌కుమార్ ఆదేశించారు. సింగిల్ సెక్షన్ హైస్కూళ్లలో పనిచేస్తూ రిలీవ్ కానీ పాఠశాలల నుంచి బదిలీ అయిన టీచర్లు కొత్త స్థానాల్లో చేరి మళ్లీ పాత పాఠశాల్లోనే విధులు నిర్వహించాలి. వీరి స్థానంలో కొత్త టీచరు వచ్చే వరకు వీరు పాత పాఠశాలల్లోనే పనిచేయాల్సి ఉంటుంది. జీతం మాత్రం బదిలీ అయిన కొత్త స్థానం నుంచి పొందుతారని డీఈవో తెలిపారు.

మహిళలపై దాడిచేయించింది జగనే

● వైసీపీ గూండాలతో రాళ్లు వేయిస్తుంటే చూస్తూ ఉండాలా?
● మంత్రి స్వామి విమర్శ

కొండపి (టంగుటూరు), జూన్14 (ఆంధ్రజ్యోతి): పరామర్శ పేరుతో జగన్ వైసీపీ గూండాలను తీసుకువచ్చి శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలపై దాడి చేయించారని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. తూర్పు నాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో శనివారం మాట్లాడారు. పోలీసులపై, మహిళలపై దాడి చేయించిన జగన్ సానుభూతి తెలపకపోగా, దొంగే.. దొంగ దొంగ అని అరచినట్లుగా జగన్ మాట్లాడటం సిగ్గుచేటని మంత్రి విమర్శించారు. జగన్ ప్రజలిచ్చిన తీర్పును గౌరవించకుండా, దాడులు చేస్తుంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకోవాలా? అని మంత్రి ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరిస్తున్నందునే జగన్ ఇంకా రోడ్లమీద తిరుగుతున్నాడని, జగన్‌లా ప్రభుత్వాన్ని, పోలీసులను నడిపితే రోడ్డుమీదకు కూడా రాలేడని మంత్రి అన్నారు. జగన్ తాను తప్పు చేసి ఎదుటి వ్యక్తులపై నెట్టే వైఖరిని మార్చుకోవాలని మంత్రి స్వామి హితవు పలికారు.

బిజినెస్ ప్లస్

ఒంగోలు ● ఆదివారం 15 జూన్ 2025

మోతీలాల్ ఓస్వాల్ బీఎస్ఈ 1000 ఇండెక్స్ ఫండ్

మోతీలాల్ ఓస్వాల్ మ్యూచువల్ ఫండ్ (ఎంఓఎంఎఫ్).. బీఎస్ఈ 1000 ఇండెక్స్ ఫండ్‌ను తీసుకువచ్చింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఫండ్. దీని బీఎస్ఈ 1000 టీఆర్ఈ బెంచ్‌మార్క్ ఇండెక్స్‌గా ఉండనుంది. ఈ ఇండెక్స్ ఫండ్‌లో లార్జ్, మిడ్, స్మాల్, మైక్రోక్యాప్ విభాగాలకు చెందిన కంపెనీలున్నాయి. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.500. సిప్ రూపంలో కూడా ఇన్వెస్ట్ చేయవచ్చు. ముగింపు తేదీ ఈ నెల 19.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



15వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	515
వరంగల్	542	గోదావరి	500
చిత్తూరు	613	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	97	విజయవాడ	100
వరంగల్	97	గుంటూరు	103
కరీంనగర్	97	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	97	చిత్తూరు	94
కర్నూలు	97	నెల్లూరు	99
విశాఖపట్నం	90	అనంతపురం	99
గోదావరి	100		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,01,680 ▲	93,200 ▲	1,20,000 ▲
విజయవాడ	1,00,300 ▲	97,500 ▲	1,10,000 ▲
విశాఖపట్నం	1,01,400 ▼	93,200 ▲	1,20,000 ▲
రాజమండ్రి	1,01,670 ▲	93,200 ▲	1,09,400 ▲
ప్రొద్దుటూరు	98,100 ▼	90,250 ▼	1,05,000 ▲
ముంబై	99,060 ▲	90,740 ▲	1,06,170 ▲



నేడు ఫాదర్స్ డే. ఈ సందర్భంగా మీ తండ్రికి ఏదైనా బహుమతి ఇవ్వాలనుకుంటున్నారా..? చిన్న పిల్లలిచ్చే చిరు కానుకైనా నాన్నకు కలిగే సంతోషం చెప్పలేనంత. టీనేజీలో ఉంటే.. డాడీ ఇచ్చే పాకెట్ మనీతో గిఫ్ట్ కొని ఆయన్ని సంబుర పెట్టవచ్చు. ఇప్పటికే ప్రయోజకులై, సంపాదిస్తుంటే మాత్రం కాస్త భిన్నంగా ఆలోచించండి. మీ జీవితానికి సుస్థిర బాట వేసిన నాన్న భవిష్యత్‌కు ఆర్థిక భరోసా కల్పించే కానుక అందించడం మేలు.

లవ్ యూ U నాన్న

Happy Father's Day

ఆరోగ్య బీమా

వయసుతో పాటు ఆరోగ్య సమస్యలూ పెరగడం సాధారణం. కానీ, ఈ రోజుల్లో వైద్యం చాలా ఖరీదైపోయింది. దేశంలో వైద్య ఖర్చులు ఏటా 14 శాతం చొప్పున పెరుగుతున్నాయని ఓ సర్వే వెల్లడించింది. ఈ ప్రత్యేక దినోత్సవం సందర్భంగా మీ నాన్న ఆరోగ్యానికి బీమాతో ధీమా కల్పించండి. మీ నాన్న పేరిట హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ కొనుగోలు చేయడం మేలు. మీ తండ్రి గారికి ఇప్పటికే దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలుంటే వాటికీ బీమా కవరేజీ లభించేలా పాలసీ తీసుకోవడం ఉత్తమం. ఒకవేళ మీ తండ్రి వయసు 50-60 ఏళ్లు పైబడితే, క్యాన్సర్, గుండెపోటు వంటి తీవ్ర అనారోగ్యాల ఖర్చులకూ కవరేజీ కల్పించే క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీని తీసుకోవడం మంచిది.

రిటైర్మెంట్ ప్లాన్

మీ నాన్నకు రిటైర్మెంట్ ప్లాన్ బహుమతిగా ఇవ్వండి. లేదా ఆయన పేరిట యూనిట్ లింక్డ్ పెన్షన్ ప్లాన్ (యూఎల్‌పీపీ)లో ఇన్వెస్ట్ చేయొచ్చు. సాధారణంగా ఈ పథకాలు ఈక్విటీలతో పాటు రుణపత్రాల్లోనూ పెట్టుబడులు పెడుతుంటాయి. కాబట్టి, దీర్ఘకాలంలో మంచి ప్రతిఫలాలు లభించే అవకాశం ఉంటుంది. ఈ పాలసీ గడువు ముగిశాక, పోగైన కార్పస్‌లో 60 శాతం వెనక్కి తీసుకొని, మిగతా సొమ్ముతో నెలవారీ పెన్షన్ లభించేలా ప్లాన్ చేయండి. తద్వారా మలి వయసులో మీ నాన్నకు ఆర్థిక స్వేచ్ఛ కల్పించండి. అంతేకాదు, మన సగటు ఆయుష్షు 80 ఏళ్లకు పెరిగింది. కాబట్టి, రిటైర్మెంట్ తర్వాత 20-30 ఏళ్ల వరకు మీ నాన్నకు ప్రతినెలా ఖర్చులకు సరిపడా సొమ్ము చేతికందేలా దీర్ఘకాలిక వ్యూహంతో పెట్టుబడులు పెట్టండి.

పొదుపు పథకాలు

మీ తండ్రి పేరిట కొంత సొమ్మును ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయవచ్చు. ఒకవేళ సీనియర్ సిటిజన్ అయితే, అధిక వడ్డీ చెల్లించే పొదుపు పథకాలు చాలా అందుబాటులో ఉన్నాయి. బ్యాంకులు, పోస్టల్ డిపార్ట్‌మెంట్ వీరి కోసం ప్రత్యేక పథకాలను ఆఫర్ చేస్తున్నాయి. లేదంటే, ఏదైనా మ్యూచువల్ ఫండ్ స్కీమ్ లోనూ పెట్టుబడులు పెట్టవచ్చు. క్రమానుగత పెట్టుబడి పథకాలు (సిప్) కూడా మంచి ప్రత్యామ్నాయం.

షేర్లు, సెక్యూరిటీలు

భవిష్యత్‌లో మంచి ప్రతిఫలాలు అందించేందుకు అవకాశాలున్న కంపెనీల షేర్లను కానుకగా ఇవ్వండి. ప్రభుత్వ సెక్యూరిటీల్లోనూ పెట్టుబడులు పెట్టవచ్చు. కొంత రిస్క్ తీసుకోగలిగితే, మంచి రేటింగ్ కలిగిన కార్పొరేట్ బాండ్లలోనూ ఇన్వెస్ట్ చేయొచ్చు.

యాడ్ ఆన్ కార్డ్

మీ క్రెడిట్ కార్డుపై యాడ్ ఆన్ కార్డు తీసుకోగలిగే వెసులుబాటు ఉంటే.. దాన్ని మీ నాన్నకు గిఫ్ట్‌గా ఇవ్వవచ్చు. తద్వారా చిన్న మొత్తాల్లో ఖర్చుల కోసం వారు ఆ కార్డును ఉపయోగించుకునే వీలుంటుంది.

గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ నిర్వహిస్తున్నారా..!

ఇదీ GST



రాంబాబు గొండాల

దేశ ఆర్థికాభివృద్ధిలో రవాణా రంగం పాత్ర ఎంతో కీలకం. ముఖ్యంగా వస్తు రవాణా సేవలు (ట్రాన్స్‌పోర్ట్ సర్వీస్) సరిగా లేకుంటే ఏ ప్రాంతంలో కూడా పారిశ్రామికాభివృద్ధి, వ్యాపారాభివృద్ధి జరగదు. ఒక ఫ్యాక్టరీకి ముడి సరుకు కావాలన్నా, తయారైన వస్తువులు బయటకు పోవాలన్నా, ఒక వ్యాపారి సరుకు కొనుగోలు చేయాలన్నా, అమ్మాలన్నా లేదా ఒక రైతు పండించిన పంటను అమ్ముకోవాలన్నా రవాణా సౌకర్యం లేకుంటే ఏదీ జరగదు. ఇంత ముఖ్య పాత్ర పోషిస్తున్న 'గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్'కు సంబంధించి జీఎస్టీ విధివిధానాలు, పన్ను రేటు వివరాలు మీ కోసం. ఇంతకు ముందు సర్వీస్ ట్యాక్స్‌లో కానీ ఇప్పుడు జీఎస్టీలో కానీ వస్తు రవాణాకు సంబంధించి 'గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ' అనే ఒక సర్వీస్ ప్రవేశపెట్టడం జరిగింది. దీనినే జీటీఏ అని అంటారు. జీఎస్టీలో గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ మీద విధించే పన్ను ఈ జీటీఏకు సంబంధించి ఉంటుంది. మరి జీటీఏ అంటే ఏమిటి? వస్తు రవాణా చేసే ప్రతి వాహనం జీటీఏ కిందకు వస్తుందా?

జీఎస్టీ పరిభాషలో చెప్పాలంటే రోడ్డు ద్వారా వస్తు రవాణా చేస్తూ కన్‌సైన్‌మెంట్ నోట్ లాంటివి ఇచ్చే వ్యక్తి లేదా సంస్థను గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ అంటారు. మరి కన్‌సైన్‌మెంట్ నోట్ అంటే ఏమిటి? దీనికి అటుఇటుగా నిర్వచించినప్పటికీ ట్రాన్స్‌పోర్ట్‌కు సంబంధించిన వ్యక్తి తన వాహనంలో రవాణా చేసే వస్తువులకు సంబంధించి ఇచ్చే రసీదు. ఇందులో వస్తువులు పంపే వ్యక్తి, స్వీకరించే వ్యక్తి, రవాణా అవుతున్న వస్తువుల వివరాలతో పాటుగా సరుకు ఎక్కడి నుంచి బయలుదేరుతుంది, ఎక్కడకు రవాణా అవుతుందనే వివరాలు ఇందులో ఉంటాయి. కన్‌సైన్‌మెంట్ నోట్‌కు ఎందుకు అంత ప్రాముఖ్యత ఉందంటే ఎప్పుడైతే ట్రాన్స్‌పోర్టర్ కన్‌సైన్‌మెంట్ నోట్ ఇస్తాడో.. ఆ వస్తువులకు సంబంధించిన పూర్తి బాధ్యత వస్తు విక్రయదారుని నుంచి ట్రాన్స్‌పోర్టర్‌కు బదిలీ అవుతుంది. ఆయా వస్తువులు గమ్యస్థానం చేరే వరకు వాటి సంరక్షణ బాధ్యత అతనిదే. కాబట్టి ఏ వాహనదారుడైతే కన్‌సైన్‌మెంట్ నోట్ ఇస్తాడో అతను మాత్రమే జీటీఏ కింద పరిగణించబడతాడు. అతను మాత్రమే జీఎస్టీ పరిధిలోకి వస్తాడు. అంటే రోడ్డు మీద ఉండే చిన్న వాహనాలు, ఆటో సర్వీస్‌లు జీటీఏ పరిధిలోకి రావు. ఎందుకంటే ఇవి సాధారణంగా ఎలాంటి కన్‌సైన్‌మెంట్ నోట్ ఇవ్వవు.

మరి జీటీఏ కిందకు వచ్చే వ్యక్తి ఎంత పన్ను కట్టాలి? జీటీఏకి సంబంధించి రెండు రకాల పన్ను శ్లాబులు ఉన్నాయి. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) వాడుకుంటే 12 శాతం లేకుంటే 5 శాతం చొప్పున పన్ను కట్టాల్సి ఉంటుంది.

అయితే జీటీఏ ఈ కింది కేటగిరిలోని వ్యక్తులకు సర్వీస్ అందజేస్తే సదరు సర్వీస్‌ను రివర్స్ చార్జ్ కింద పరిగణించి ఆయా సేవలు అందుకునే వ్యక్తులు 5 శాతం చొప్పున పన్ను కట్టాల్సి ఉంటుంది. అవేమిటంటే.. ఏదేనీ ఫ్యాక్టరీ, సొసైటీ, కో-ఆపరేటివ్ సొసైటీ, జీఎస్టీ కింద రిజిస్టర్ అయిన వ్యక్తులు, బాడీ కార్పొరేట్, పార్ట్‌నర్‌షిప్ ఫర్మ్, క్యాజువల్ ట్యాక్సబుల్ పర్సన్ మొదలైనవి. అంటే, ఎప్పుడైతే ఒక జీటీఏ పైన తెలిపిన కేటగిరీలోని వ్యక్తులకు లేదా సంస్థలకు సరుకు రవాణా చేస్తేంటే.. ఆయా వ్యక్తులు లేదా సంస్థలు రివర్స్ చార్జ్ మెకానిజం (ఆర్‌సీఎం) కింద 5 శాతం పన్ను చెల్లించాలి. ఇలాంటి సందర్భంలో జీటీఏకి ఐటీసీ పొందే అర్హత ఉండదు. అంటే వారు కొనే లారీల మీద లేదా ఇతర సర్వీసుల మీద ఐటీసీ పొందే అర్హత కోల్పోతారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని తనంతట తానే ట్యాక్స్ కడుతూ ఐటీసీ పొందే సౌలభ్యాన్ని ప్రభుత్వం కల్పించింది. కానీ పన్ను 12 శాతం చొప్పున కట్టాలి. అంటే ఒక జీటీఏ తనంత తానే ట్యాక్స్ కట్టాలంటే (ఫార్వర్డ్ ట్యాక్స్ మెకానిజం) కచ్చితంగా 12 శాతం చెల్లించాలి. ఒకసారి ఈ విధానాన్ని ఎంచుకుంటే ఆ ఆర్థిక సంవత్సరం మొత్తం అదే విధానంలో ఉండాలి.

అయితే 2022 జూలైలో దీనికి మళ్లీ సవరణ చేయటం జరిగింది. దీని ప్రకారం ఫార్వార్డ్ మెకానిజంలో రెండు రకాల ఆప్షన్స్ ఇవ్వటం జరిగింది. 5 శాతం, 12 శాతం అంటే జీటీఏ తనే ట్యాక్స్ కడుతూ ఐటీసీ పొందాలంటే 12 శాతం ఎంచుకోవాలి. ఒకవేళ 5 శాతం ఎంచుకుంటే ఐటీసీకి అర్హత ఉండదు. ఇది ఏదీ కాకుండా సర్వీస్ పొందిన వ్యక్తి పన్ను కట్టాలంటే ఆర్‌సీఎం విధానాన్ని ఎంచుకోవాలి. అప్పుడు కూడా ఐటీసీ అర్హత ఉండదు. మరి ఏ విధానం ఎంచుకున్నాడో ఎలా తెలవాలంటే.. తదుపరి ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తాను ఎంచుకునే విధానానికి సంబంధించి అనెగ్జర్-V ను మార్చి 15లోపు దాఖలు చేయాల్సి ఉంటుంది. అంటే 2025-26 ఆర్థిక సంవత్సరంలో తాను ఏ పన్ను విధానాన్ని ఎంచుకుంటున్నది 2025 మార్చి 15లోపు తెలియజేయాలి. ముఖ్యంగా గుర్తు పెట్టుకోవాల్సిన విషయం ఏమిటంటే ఒకసారి ఒక విధానాన్ని ఎంచుకుంటే ఆ ఆర్థిక సంవత్సరం మొత్తం అదే విధానంలో కొనసాగాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

వ్యక్తిగత రుణం తీసుకుంటున్నారా!

ఈ నిబంధనలు తెలుసుకోండి..



ప్రస్తుత ప్రపంచంలో ఎక్కువ మంది అప్పుల అప్పారావులే. ఖర్చులు ఆదాయాన్ని మించిపోయినప్పుడు ఎవరైనా అప్పులు చేయక తప్పదు. ఆరోగ్య బీమా లేకుండా ఆరోగ్యం దెబ్బతిన్నప్పుడు, ఇంటి రిపేర్లు, లేదా ఇతర అత్యవసర ఖర్చుల కోసం అప్పులు చేయక తప్పదు. ఈ రోజుల్లో చేబదులు ఇచ్చే వాళ్లు తక్కువ. అప్పుడు వ్యక్తిగత రుణాలే గతి.

బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల (ఎన్‌బీఎఫ్‌సీ) నుంచి వ్యక్తిగత (పర్సనల్) రుణాలు తీసుకునే వారి సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోంది. కొద్దిగా రిస్క్ ఉన్నా వడ్డీ రేటు కొద్దిగా ఎక్కువగా ఉండడంతో బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు కూడా ఈ రుణాలు ఇచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి. ప్రస్తుతం బ్యాంకు రుణాల్లో దాదాపు 36 శాతం ఈ రుణాలే. దీన్ని బట్టి బ్యాంకులు కూడా ఈ రుణాలపై ఎంత ఆసక్తితో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. కాకపోతే కొన్ని అర్హతలకు లోబడి మాత్రమే బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఈ రుణాలు ఇస్తాయి. ఆ అర్హతలు ఏమిటో తెలుసుకుందాం.

రుణ అర్హతలు: వ్యక్తిగత రుణాల మంజూరుకు ప్రతి బ్యాంకు, ఎన్‌బీఎఫ్‌సీ కొన్ని నిబంధనలు పాటిస్తుంది. ఈ అర్హతలు ఆయా సంస్థలను బట్టి వేరు వేరుగా ఉంటాయి. అయితే అన్ని సంస్థలు రుణం తీసుకునే వ్యక్తి కనీస ఆదాయం, క్రెడిట్ స్కోరు, వయసు, చేస్తున్న ఉద్యోగం, తీసుకునే రుణాన్ని ఎంత కాలంలో చెల్లిస్తాడు? అనే విషయాలను తప్పనిసరిగా చూస్తాయి. పై విషయాల ఆధారంగా వ్యక్తిగత రుణం తీసుకున్న వ్యకికి ఎంత రుణం మంజూరు చేయవచ్చు? ఆ రుణం తీసుకున్న వ్యక్తి ఆ రుణాన్ని సకాలంలో తిరిగి చెల్లించగలడా? లేదా? అనే అంశంపై బ్యాంకులు ఒక అవగాహనకు వస్తాయి. ప్రస్తుతం చాలా బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఈ రుణాల మంజూరు ప్రక్రియను ఆన్‌లైన్ చేశాయి. ఆయా బ్యాంకుల వెబ్‌సైట్‌లోకి వెళ్లి మీ కేవైసీ వివరాలు, కావాల్సిన ఈఎంఐ ప్లాన్ ఎంటర్ చేస్తే వ్యక్తిగత రుణ మంజూరుకు మీకు అర్హత ఉన్నదీ, లేనిదీ బ్యాంకులు వీలైనంత త్వరగా తెలియజేస్తాయి. ఈ రుణాల కనీస వడ్డీ 10.5 శాతం నుంచి ప్రారంభమవుతుంది.

ప్రధాన అర్హతలు

- 21 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్కులై ఉండాలి
- కనీస క్రెడిట్ స్కోర్ 700 పైన ఉండాలి
- ఉంటున్న నగరాన్ని బట్టి కనీస నెలవారీ ఆదాయం
- ఎన్నాళ్ల నుంచి ఆయా సంస్థల్లో పని చేస్తున్నారు
- స్వయం ఉపాధా లేక ఉద్యోగమా?
- ఇతర రుణాల చెల్లింపు భారమేమైనా ఉందా లేదా అనే అంశం

తెలుసుకోవడం ఎలా?

వ్యక్తిగత రుణాలకు మనకు అర్హత ఉందా? లేదా? అనే విషయం తెలుసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. ఇందుకు ప్రస్తుతం ఆన్‌లైన్‌లో అనేక ఫ్రీ టూల్స్ ఉన్నాయి. ఆ వెబ్‌సైట్లలోకి లాగిన్ అయి మీ వయసు, ఆదాయం, ఉద్యోగం, ఇప్పటికే ఉన్న అప్పుల వంటి వివరాలు నమోదు చేస్తే చాలు. మీరు ఎంత వ్యక్తిగత రుణానికి అర్హులో వెంటనే తెలిసిపోతుంది.

స్పోర్ట్స్

ఒలింపిక్ చాంపియన్‌కు ఆర్య జోడీ షాక్

వరల్డ్‌కప్‌లో స్వర్ణం కైవసం



మ్యూనిచ్: ఒలింపిక్ చాంపియన్‌కు షాకిచ్చిన భారత షూటింగ్ జోడీ ఆర్య బోర్స్-అర్జున్ బబుతా స్వర్ణాన్ని కైవసం చేసుకొంది. ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్‌లో శనివారం జరిగిన 10 మీ ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ ఈవెంట్ స్వర్ణ పోరులో ఆర్య-అర్జున్ జంట 17-7తో చైనాకు చెందిన వరల్డ్ చాంపియన్ ద్వయం జీఫీ వాంగ్-లిహావో షెంగ్‌ను చిత్తు చేసింది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో అర్జున్ (317.7 పాయింట్లు), ఆర్య (317.5)లు మొత్తం 635.2 పాయింట్లు సాధించి రెండో స్థానంలో నిలవగా.. షెంగ్-వాంగ్ జంట 635.9 పాయింట్లతో అగ్రస్థానాన్ని సొంతం చేసుకొన్నారు.

రెండు దశలలో రంజీట్రోఫీ

దేశవాళీ టోర్నీలో మార్పులు

న్యూఢిల్లీ: ఈసారి రంజీ ట్రోఫీ (2025-26) అక్టోబరు 15 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు రెండు దశలలో జరగనుంది. ఈమేరకు శనివారం జరిగిన బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్ణయించింది. అలాగే ఈ సీజన్ రంజీట్రోఫీలో మార్పులు కూడా చోటు చేసుకోనున్నాయి. వచ్చే సీజన్‌నుంచి ప్లేట్‌గ్రూపు నుంచి ఎలీట్‌కు ఒక్కోజట్టు మాత్రమే పదోన్నతి, రెలిగేషన్ అవనున్నాయి. రంజీ తొలి దశ అక్టోబరు 15 నుంచి నవంబరు 19 వరకు, రెండో దశ జనవరి 22 నుంచి ఫిబ్రవరి ఒకటి వరకు నిర్వహిస్తారు. నాకౌట్ ఫిబ్రవరి 6 నుంచి 28 వరకు జరుగుతుంది. దులీప్ ట్రోఫీని ఆగస్టు 28 నుంచి సెప్టెంబరు 15 వరకు నిర్వహిస్తారు. ఇరానీ కప్ అక్టోబరు ఒకటి నుంచి 5 వరకు జరుగుతుంది. ముస్తాక్ అలీ టోర్నీలో సూపర్ లీగ్ విధానాన్ని ప్రవేశపెడుతున్నారు. అలాగే ప్లేట్ గ్రూప్‌నూ పునఃప్రవేశపెడుతున్నారు.

హైదరాబాద్, విశాఖలో కివీస్ మ్యాచ్‌లు!

వచ్చే ఏడాది జనవరిలో మూడు వన్డేలు, ఐదు టీ20లలో భారత్-న్యూజిలాండ్ జట్లు తలపడనున్నాయి. జనవరి 11 నుంచి 31 వరకు సిరీస్ జరగనుంది. ఈ సిరీస్‌లో భాగంగా జనవరి 11న జరిగే తొలి వన్డేకు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనున్నట్టు తెలిసింది. రెండో వన్డే రాజ్‌కోట్ (జనవరి 14), మూడో వన్డే ఇండోర్ (జనవరి 18), తొలి టీ 20 నాగ్‌పూర్ (జనవరి 21), రెండో టీ20 రాంచి (జనవరి 23), మూడో టీ20 గువాహటి (జనవరి 25), నాలుగో టీ 20 విశాఖపట్నం (జనవరి 28), ఐదో టీ20 తిరువనంతపురం (జనవరి 31)లో జరగనున్నట్టు సమాచారం.

ప్రణతికి కాంస్యం

ఆసియా జిమ్నాస్టిక్స్



న్యూఢిల్లీ: భారత్‌కు చెందిన ప్రణతి నాయక్ ఆసియా సీనియర్ మహిళల ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్ వాల్ట్ విభాగంలో కాంస్యం సాధించింది. దక్షిణకొరియాలోని జెచియాన్‌లో శనివారం జరిగిన ఫైనల్లో 30 ఏళ్ల ప్రణతి 13.466 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానం దక్కించుకుంది. యిహాన్ ఝూంగ్ (చైనా, 13.650) స్వర్ణం, థీ క్విన్ (వియత్నాం, 13.583) రజతం నెగ్గారు. భారత్‌కే చెందిన ప్రొతిష్ట సమంత (13.016) నాలుగో స్థానంలో నిలిచింది. ఈ ప్రదర్శనతో ఆసియా స్థాయి పోటీలలో 3 పతకాలు అందుకున్న భారత జిమ్నాస్ట్‌గా ప్రణతి రికార్డుకెక్కింది. దీంతో దీపా కర్మాకర్ (రెండు పతకాలు)ను అధిగమించింది. 2019, 2022 ఆసియా చాంపియన్‌షిప్స్‌లో ప్రణతి కాంస్యాలు నెగ్గింది.

ఢిల్లీ చెస్ విజేత అభిజిత్



న్యూఢిల్లీ: ఢిల్లీ ఓపెన్ చెస్ టైటిల్‌ను భారత జీఎం అభిజిత్ గుప్తా (8.5 పాయింట్లు) సొంతం చేసుకున్నాడు. 9వ రౌండ్‌లో మిహాయిల్ (బెలారస్)పై కీలక విజయం సాధించిన అభిజిత్.. ఇంటర్నేషనల్ మాస్టర్ అరోనిక్ ఘోష్‌తో చివరి రౌండ్‌ను డ్రా చేసుకున్నాడు. నికీ టెన్కో (బెలారస్) రెండో, భారత గ్రాండ్‌మాస్టర్ దీప్తాయన్ ఘోష్ మూడో స్థానంలో నిలిచారు.

'బన్నీ హాప్స్' క్యాచ్‌లు కుదరవు..

దుబాయ్: బౌండరీల దగ్గర పట్టే 'బన్నీ హాప్స్' క్యాచ్‌ల విషయంలో మెరిల్‌బోన్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. క్యాచ్ విషయంలో ఫీల్డర్ నియంత్రణ కోల్పోయే అవకాశం ఉంటే మైదానంలో ఉన్నప్పుడే బంతిని పైకి విసిరి.. లైన్ దాటి తిరిగి లోనికి వచ్చే అందుకోవాల్సి ఉంటుంది. అంటే బౌండరీ బయట బంతిని పలుమార్లు ఎగర వేయడం కుదరదు. ఈనెల నుంచే కొత్త రూల్ ఐసీసీ ప్లేయింగ్ కండిషన్‌లో భాగం కానుండగా.. వచ్చే ఏడాది అక్టోబరు నుంచి ఎంసీసీ రూల్ ఆఫ్ లాలో అధికారికంగా చేరుస్తారు. మరోవైపు వన్డేల్లో రెండు కొత్తబంతుల నిబంధనల్లో మార్పు, కంకషన్ సబ్‌స్టిట్యూట్ ప్రొటోకాల్‌ను ఐసీసీ ఆమోదించింది.

సఫారీలు సాధించారు

27 ఏళ్ల తర్వాత తొలి ఐసీసీ టైటిల్ సొంతం

వరల్డ్ టెస్టు చాంపియన్‌గా దక్షిణాఫ్రికా

ఫైనల్లో ఆసీస్‌పై ఘన విజయం

ఏళ్లు కాదు.. దశాబ్దాలపాటు ఎదురుచూసిన తరుణమిది. తమ శక్తి యుక్తులన్నీ ధారపోసి పోరాడినా ఐసీసీ టోర్నీల్లో నిరాశగా వెనుదిరగడమే చూసిన దక్షిణాఫ్రికా ఇప్పుడు సగర్వంగా 'గద' ఎత్తుకుంది. ఒత్తిడికి చిత్తయ్యే జట్టంటూ.. చోకర్స్‌గా ముద్ర వేసి క్రీడాలోకం పరిహసించినా.. క్రికెట్ పుట్టినిల్లుగా భావించే లార్డ్స్‌లోనే 'ఇదిగో ఇదీ మా సత్తా' అంటూ వరల్డ్ టెస్టు చాంపియన్స్ హోదాలో పోడియంపై నిలిచింది. బలమైన ప్రత్యర్థి ఆసీస్ బౌలర్ల ధాటికి తొలి ఇన్నింగ్స్‌లో విలవిల్లాడిన బ్యాటర్లు లక్ష్య ఛేదనలో మాత్రం తెగించి నిలబడ్డారు. శతక వీరుడు మార్‌క్రమ్‌తో పాటు చీలమండ గాయం ఇబ్బందిపెట్టినా గెలుపు కోసం కెప్టెన్ బవుమా క్రీజులో నిలిచిన తీరుకు వహ్వా.. అనాల్సిందే. దీంతో 27 ఏళ్ల తర్వాత ఐసీసీ టోర్నీల్లో సఫారీలు విజేతలయ్యారు.



సంక్షిప్త స్కోర్లు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 212; దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 138 ఆలౌట్; ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: 207 ఆలౌట్ (స్టార్క్ 58 నాటౌట్, క్యారీ 43, లబుషేన్ 22; ఎన్‌గిడి 3/38, రబాడ 4/59); దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: 282/5 (మార్‌క్రమ్ 136, బవుమా 66; బెడింగమ్ 21; స్టార్క్ 3/66).

2 లార్డ్స్ మైదానంలో రెండో అత్యధిక ఛేదన (282)ను సాధించిన జట్టుగా సౌతాఫ్రికా. 1984లో ఇంగ్లండ్‌పై 342 పరుగుల ఛేదనతో విండీస్ టాప్‌లో ఉంది.

3 డబ్ల్యూటీసీలో వరుసగా మూడో సీజన్‌లోనూ కొత్త విజేత రావడం విశేషం. గతంలో న్యూజిలాండ్, ఆస్ట్రేలియా చాంపియన్స్‌గా నిలిచాయి.

దక్షిణాఫ్రికా ఆడిన ఐసీసీ ఫైనల్స్

టోర్నీ	ఏడాది	ప్రత్యర్థి
నాకౌట్ ట్రోఫీ	1998	విండీస్‌పై గెలుపు
మహిళల టీ20 వరల్డ్‌కప్	2023	ఆసీస్ చేతిలో ఓటమి
పురుషుల టీ20 వరల్డ్‌కప్	2024	భారత్ చేతిలో ఓటమి
మహిళల టీ20 వరల్డ్‌కప్	2024	కివీస్ చేతిలో ఓటమి
వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్	2025	ఆసీస్‌పై విజయం

లండన్: రెండేళ్ల పాటు అద్భుత విజయాలతో సాగిన దక్షిణాఫ్రికా ప్రయాణం.. ప్రతిష్ఠాత్మక వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకోవడంతో ముగిసింది. శనివారం డబ్ల్యూటీసీ ఫైనల్‌లో ఆస్ట్రేలియాను 5 వికెట్ల తేడాతో ఓడించిన బవుమా సేన ఐసీసీ టెస్టు గదను సగర్వంగా అందుకుంది. అలాగే ఈ జట్టుకిది వరుసగా ఎనిమిదో టెస్టు విజయం కాగా.. 1998లో నాకౌట్ ట్రోఫీ తర్వాత రెండో ఐసీసీ టోర్నీ విజయం కావడం విశేషం. అటు ఇప్పటికే పది ఐసీసీ టైటిళ్లను ఖాతాలో వేసుకున్న ఆసీస్ రెండోసారి డబ్ల్యూటీసీ టైటిల్‌పై ఆశలు పెట్టుకున్నా నిరాశే ఎదురైంది. 2010 (టీ20 వరల్డ్‌కప్) తర్వాత కంగారూలు ఓ ఐసీసీ టోర్నీ ఫైనల్లో ఓడడం ఇదే తొలిసారి. నాలుగో రోజు కేవలం విజయానికి 69 పరుగుల దూరంలో నిలిచిన సఫారీలు తమ రెండో ఇన్నింగ్స్‌లో 282/5 స్కోరు సాధించారు. మార్‌క్రమ్ (136), బవుమా (66) గెలుపులో కీలక పాత్ర పోషించారు. స్టార్క్‌కు మూడు వికెట్లు దక్కాయి. అంతకుముందు ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 212, సౌతాఫ్రికా 138 పరుగులు చేయగా.. రెండో ఇన్నింగ్స్‌లో 207 పరుగులు సాధించిన ఆసీస్ ప్రత్యర్థి ముందు 282 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. **ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా మార్‌క్రమ్** నిలిచాడు.

4 ఐసీసీ టోర్నమెంట్ ఫైనల్స్‌లో ఆసీస్ ఓడడం ఇది నాలుగోసారి.

తొలి సెషన్‌లోనే..: నాలుగో రోజు 213/2 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన సౌతాఫ్రికా గెలుపునకు మరో 69 పరుగులే చేయాల్సివుంది. ఆసీస్ బౌలర్లు సఫారీలపై ఒత్తిడి పెంచేందుకు స్టంప్స్‌ను లక్ష్యంగా చేసుకుని బంతులు విసిరారు. వికెట్ల కోసం ఆసీస్ తమకున్న మూడు రివ్యూలను కూడా వాడేసుకుంది. కొత్త బంతిని సైతం తీసుకున్నా.. మొక్కవోని ఏకాగ్రతతో బ్యాటర్లు క్రీజులో నిలిచారు. తొలి సెషన్‌లో కేవలం మూడు బౌండరీలు మాత్రమే వచ్చాయి. అయితే మూడో ఓవర్‌లోనే కెప్టెన్ బవుమాను కమిన్స్ దెబ్బతీయడంతో మూడో వికెట్‌కు 147 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కానీ మార్‌క్రమ్ వారికి అడ్డుగా నిలిచాడు. స్టబ్స్ (8)తో కలిసి నాలుగో వికెట్‌కు 24.. బెడింగమ్ (21 నాటౌట్)తో కలిసి ఐదో వికెట్‌కు 35 పరుగులు జోడించాడు. గెలుపునకు మరో 6 పరుగుల దూరంలో అతడి 6 గంటల 23 నిమిషాల సుదీర్ఘ పోరాటానికి పేసర్ హాజెల్‌వుడ్ తెరదించాడు. మార్‌క్రమ్‌కు ఇరు జట్ల ఆటగాళ్లతో పాటు లార్డ్స్ ప్రేక్షకులు లేచి నిలబడి చప్పట్లతో అభినందనలు తెలిపారు. చివరకు 84వ ఓవర్‌లో స్టార్క్ వైడ్ ఫుల్‌టాస్‌ను కవర్ పాయింట్ వైపు వెరెయిన్ (4 నాటౌట్) సింగిల్ తీయడంతో దక్షిణాఫ్రికా అంతులేని సంబరాల్లో మునిగింది.

ప్రైజ్‌మనీ

దక్షిణాఫ్రికాకు - రూ. 31.05 కోట్లు

ఆస్ట్రేలియాకు - రూ. 18.63 కోట్లు

సరికొత్త అధ్యాయం

ఎన్నాళ్ల నిరీక్షణ.. ఎన్నేళ్ల నిర్వేదన..! కీలక నాకౌట్ మ్యాచ్‌ల్లో ఓటములతో అభిమానుల కలలు కల్లలు కావడం.. జట్టు నైరాశ్యంలో మునిగిపోవడం. మొత్తంగా వెరసి 'అన్ లక్కీ' అనే ట్యాగ్‌ను సొంతం చేసుకొన్న జట్టు దక్షిణాఫ్రికా. చోకర్స్ (కీలక మ్యాచ్‌ల్లో ఒత్తిడికి చిత్తయ్యే జట్టు)గా ముద్ర వేసుకొన్న సఫారీలు ఇప్పుడు చాంపియన్లుగా నిలిచారు.



దిగ్గజాల వల్ల కానిది..: ఏబీ డివిల్లీర్స్, గ్రేమ్ స్మిత్, గ్యారీ కిర్‌స్టెన్, అలెన్ డొనాల్డ్, జాక్ కలిస్ లాంటి దిగ్గజ ఆటగాళ్లు జట్టు కోసం ఎంతో శ్రమించారు. వీరందరి కృషితో జట్టు మెరుగుపడినా.. ఐసీసీ ట్రోఫీ మాత్రం అందని ద్రాక్షే అయింది. ఎట్టకేలకు మార్‌క్రమ్, బవుమా అద్భుత పోరాటంతో సౌతాఫ్రికా క్రికెట్ చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించారు.

ఓటములను దిగమింగుకొని..: నాకౌట్స్‌లో నిరాశ.. సఫారీలకు 1992 నుంచి వెంటాడుతోంది. ఆ వరల్డ్‌కప్‌లో ఇంగ్లండ్‌తో సెమీస్ మ్యాచ్‌లో వరుణుడి రూపంలో షాక్ తగిలింది. 1999 వరల్డ్‌కప్‌లో ఆస్ట్రేలియాతో సెమీస్ మ్యాచ్ టై కావడం అనేది ఎప్పటికీ గుండెల్లో ముల్లులాంటిదే. గతేడాది జూన్ 29న జరిగిన టీ20 ప్రపంచకప్ ఫైనల్లో భారత్ చేతిలో ఓడిన దక్షిణాఫ్రికా.. ఏడాది తిరిగే సరికి 'జూన్ 14'ను సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజుగా మార్చుకొంది. కెరీర్ చివర్లో ఉన్న రబాడ.. ఫైనల్ మ్యాచ్‌లో కంగారూల పనిబట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో డకౌటైన మార్ క్రమ్.. భారీ శతకంతో మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. వీరిద్దరి పోరాట స్ఫూర్తితో సౌతాఫ్రికా అసాధ్యాన్ని సుసాధ్యం చేసింది.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

తల్లికి వందనం.. పేదల ఇంట ఆనందం

- రాచర్ల మండలంలో 4,269 మందికి
- ఒక్కో కుటుంబంలో ముగ్గురు, ఐదుగురికి వర్తింపు

రాచర్ల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన తల్లికి వందనం పథకం మండలంలో 4,269 మందికి వర్తించింది. ఈ పథకం ద్వారా ఒక్కో కుటుంబంలో ముగ్గురు, నలుగురు పిల్లలు ఉన్నప్పటికీ డబ్బులు జమ అయ్యాయి. దీంతో ఆయా కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఆకవీడు-1 పంచాయతీలో మొత్తం 509 మందికి గాను 461 మంది అర్హులు, 48 మంది అనర్హులుగా, ఆకవీడు-2లో 190 మందికి గాను 175 మంది అర్హులు, 15 మంది అనర్హులు, చోళ్లవీడులో 418 మందికి గాను 360 మంది అర్హులు, 58 మంది అనర్హులు, చినగానిపల్లెలో 242 మందికి గాను 218 మంది అర్హులు, 24 మంది అనర్హులు, జేపీ చెరువులో 303 మందికి గాను 273 మంది అర్హులు, 30 మంది అనర్హులు, అనుమలపల్లెలో 413 మందికి గాను 355 మంది అర్హులు, 58 మంది అనర్హులు, రాచర్ల-1లో 619 మందికి గాను 506 మంది అర్హులు, 113 మంది అనర్హులు, రాచర్ల-2లో 197 మందికి గాను 169 మంది అర్హులు, 28 మంది అనర్హులు, అనుమలవీడులో 376 మందికి గాను 311 మంది అర్హులు, 65 మంది అనర్హులు, సోమిదేవిపల్లిలో 161 మందికి గాను 135 మంది అర్హులు, 26 మంది అనర్హులు, గుడిమెట్టలో 382 మందికి గాను 315 మంది అర్హులు, 67 మంది అనర్హులు, సత్యవోలులో 215 మందికి గాను 195 మంది అర్హులు, 20 మంది అనర్హులు, యడవల్లిలో 244 మందికి గాను 183 మంది అర్హులు, 61 మంది అనర్హులుగా గుర్తింపపడ్డారు. మండలస్థాయిలో 4269 మందికి గాను 3656 మంది అర్హులు, 613 మంది అనర్హులుగా గుర్తించారు. ముగ్గురికి, నలుగురికి కూడా తల్లికి వందనం వర్తించినట్లు తెలిపారు. అనర్హులుగా గుర్తింపబడ్డ వారికి త్వరలో తల్లికి వందనం వర్తిస్తుందని, అంతేకాకుండా వివిధ కారణాల చేత తల్లికి వందనం వర్తించని వారికి కూడా వర్తించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఎంఇఒ వి.గిరిధరశర్మ తెలిపారు.


చంద్రబాబు, పవన్‌కల్యాణ్, అశోక్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న తల్లులు, విద్యార్థులు

కంభం, అర్ధవీడు మండలాల్లో

కంభం : ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమందికీ తల్లికి వందనం పథకం వర్తింప చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని నెరవేర్చారు. శుక్రవారం పాఠశాలలు ప్రారంభించిన రోజే తల్లుల ఖాతాల్లోకి డబ్బులు వేయడంతో ఆయా కుటుంబాల వారు ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెప్తున్నారు.

చంద్రబాబుకు కృతజ్ఞతలు



గత ప్రభుత్వంలో అమ్మఒడి పథకం ద్వారా తమ కుటుంబంలో ఒక్కరికే లబ్ధి చేకూరింది. ప్రస్తుత ప్రభుత్వంలో మా ముగ్గురు పిల్లలకు తల్లికి వం దనం వర్తించింది. ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

- రవికుమార్, రాచర్ల



తనకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. జగన్ హయాంలో ఒక్కరికే డబ్బులు జమ అయ్యాయి. చంద్రబాబు ప్రభుత్వం ముగ్గురు పిల్లలకూ పథకం వర్తింప చేసింది.

- చల్లా సంజయ్, చోళ్లవీడు



కంభం తెలుగువీధికి చెందిన ఉయ్యాలవాడ నరేంద్రప్రసాద్ దంపతులకు ముగ్గురు సంతానం. వీరు కూరగాయలు అమ్మి జీవిస్తుంటారు. పిల్లల చదువుల కోసం కష్టాలు పడే వారు. ప్రభుత్వం ముగ్గురు పిల్లలకు రూ.39వేలు జమ చేయడంతో వారి ఆనందానికి హద్దులు లేవు. వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఒక్కరికే వేసి మోసం చేసిందని, ప్రజా ప్రభుత్వం ఇచ్చిన మాట నిలపెట్టుకున్నదన్నారు. వారు ఈసందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ అజెండా

తల్లికి వందనం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లిన ఎమ్మెల్యే కందుల

మార్కాపురం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ అజెండా అని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. తల్లికి వందనం పథకం కింద లబ్ధిదారులైన పలువురి ఇళ్లకు శనివారం ఎమ్మెల్యే నారాయణరెడ్డి వెళ్లి పలుకరించారు. ముఖ్యంగా వారి అనుభూతులను అడిగి తెలుసుకున్నారు. మూడు నుంచి ఐదు మంది పిల్లలు ఉన్న మహిళలకు అందరికీ రూ.13వేల చొప్పున బ్యాంకు ఖాతాల్లో శుక్రవారం నగదు జమ కావడం ఎంతో సంతోషంగా ఉందని లబ్ధిదారుల ఆయనకు తెలిపారు. పిల్లల చదువులు ఇక తమ కుటుంబాలకు ఏమాత్రం భారం కాదని మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆవుల అల్లూరమ్మ ఇంటిలో ఐదు మంది పిల్లలుంటే వారికి ఒక్కొక్కరికి రూ.13 వేల చొప్పున మొత్తం రూ.65 వేలు నగదు వచ్చినట్లు తెలిపారు. తమకు పక్కా గృహం లేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలపడంతో తాను తప్పకుండా ఇంటిని మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. చిన్నారులకు చాక్లెట్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అందరికీ అమ్మఒడి పేరుతో రూ.15 వేలు ఇస్తానని చెప్పి గెలిచాక జగన్‌రెడ్డి కేవలం ఒక్కరికి మాత్రమే రూ.13 వేలు అందించినట్లు గుర్తుచేశారు. చంద్రబాబు ఇచ్చిన మాట మేరకు ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ తల్లికి వందనం వర్తించేలా చేశారని కందుల పేర్కొన్నారు. ఆయన వెంట మున్సిపల్ ఏఈలు ఉమామహేశ్వరరావు, భూపాల్‌రెడ్డి, సచివాలయాల సిబ్బంది, టీడీపీ నాయకులు మాలపాటి వెంకటరెడ్డి, కౌన్సిలర్ షేక్ చిన్నషెక్షావలి పాల్గొన్నారు.


తల్లికి వందనం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

పిల్లల భవిష్యత్‌కు బంగారుబాట

గిద్దలూరు టౌన్ : ప్రజా ప్రభుత్వం విద్యార్థుల కోసం తల్లికి వందనం పథకం విద్యార్థుల భవిష్యత్‌కు బంగారుబాట వేస్తుందని సొసైటీ బ్యాంక్ చైర్మన్ దుత్తా బాలీశ్వరయ్య అన్నారు. ప్రభుత్వం తల్లికి వందనం అందించడంతో లబ్ధిపొందిన చిన్నారులు, వారి తల్లులు 5వ వార్డులో శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ము ఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమం 5వ వార్డు ఇన్‌చార్జి సంపత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరగ్గా విద్యార్థులు, వారి తల్లులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు కృతజ్ఞతలు



పెద్ద దోర్నాల : మండలంలోని హసనాబాద్ గ్రామానికి చెందిన ఈదర లక్ష్మీదేవి తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా తన పిల్లలిద్దరికీ డబ్బులు అకౌంటులో వేసి చదువుకు భరోసా ఇచ్చనందులకు చంద్రబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు.

- ఈదర లక్ష్మీదేవి, హసనాబాద్ గ్రామం. దోర్నాల మండలం

ప్రభుత్వానికి మా మద్దతు



చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం ఎంత మంది పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం ఇస్తామన్నారు. పాఠశాలలు తెరిచే సమయంలో మా ఇద్దరి పిల్లలకు డబ్బులు వేశారు. సంతోషంగా ఉంది. మా మద్దతు ఎప్పుడూ ఈ ప్రభుత్వానికే ఉంటుంది.

- శంకుల నారాయణమ్మ, హసనాబాద్ గ్రామం, దోర్నాల

వైభవంగా స్వామి వారి కల్యాణం

రాచర్ల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జేపీచెరువు అటవీ ప్రాంతంలో గల నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం శనివారం వైభవంగా జరిగింది. వందలాది మంది భక్తులు వీక్షించగా ఆలయ పూజారులు అన్నవరం సత్యనారాయణస్వామి బృందం కల్యాణాన్ని జరిపించారు. ప్రతినెలా 2వ శనివారం ఆలయంలో స్వామి వారి కల్యాణం నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.నాగయ్య తెలిపారు. శ్రీకృష్ణదేవరాయ కాపు బలిజ సత్రంలో భక్తులకు అన్నదానం నిర్వహించినట్లు నిర్వాహకులు గోపాల్‌రావు తెలిపారు.

మురారిపల్లిలో టీడీపీ సంబరాలు

ఎర్రగొండపాలెం రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఎర్రగొండపాలెం మండలంలోని టీడీపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. శనివారం పార్టీ కార్యాలయ అవరణలో బాణసంచా కాల్చారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నేరవేర్చే సత్తా ఉన్న నాయకుడు చంద్రబాబు అన్నారు. తల్లికి వందనం అమలుతో తల్లుల కళ్లల్లో ఆనందం నింపారన్నారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు కైపు బ్రహ్మారెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి మేడగం సుబ్బారెడ్డి, అంజిరెడ్డి, రామలింగారెడ్డి, చిన్న రాజయ్య, కాశయ్య, షేక్ ఖాసీంపీరా, ఉమ్మడి వెంకటేశ్వర్లు, మరియబాబు పాల్గొన్నారు.

నేడు అయ్యప్పస్వామి ప్రతిష్ఠ వార్షికోత్సవం

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప స్వామి ఆలయంలో స్వామి 20వ ప్రతిష్ఠ వార్షికోత్సవం ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు తాడువాయి గోపాల మల్లికార్జునరావు శనివారం ప్రకటనలో తెలిపారు.

పంచాయతీ కార్యదర్శిగా శ్రీనివాసరావు

ఎర్రగొండపాలెం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా కేఎల్ శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పామూరు గ్రామపంచాయతీ నుంచి బదిలీపై ఇక్కడకు డిప్యూటీ ఎంపీడీవోగా బదిలీపై వచ్చారు. గ్రేడ్1 పంచాయతీ కార్యదర్శి కావడంతో ఆయన్ని కార్యదర్శిగా నియమిస్తూ ఎంపీడీవో బీ శ్రీనివాసరావు ఉత్తర్వులు ఇచ్చారు. గ్రామపంచాయతీలో పారిశుధ్యం, తాగునీటి వంటి సమస్యలు పరిష్కరిస్తానని శ్రీనివాసరావు తెలిపారు. ఇక్కడ పనిచేసిన కార్యదర్శి రాజశేఖరరెడ్డి మేలో సస్పెండ్ అయిన విషయం తెలిసిందే.

లోవోల్టేజీ సమస్య పరిష్కారం

గిద్దలూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 8వ వార్డులో కొంతకాలంగా ఉన్న విద్యుత్ లోవోల్టేజీ సమస్య పరిష్కారమైంది. వార్డులో నెలకొన్న విద్యుత్ లోవోల్టేజీ సమస్య గురించి మున్సిపల్ కౌన్సిలర్ గడ్డం భాస్కర్‌రెడ్డి స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్లగా ఎమ్మెల్యే వెంటనే స్పందించి విద్యుత్ శాఖ అధికారులతో చర్చించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయించారు. మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్లను 8వ వార్డులో ట్రాన్స్‌కో అధికారులు ఏర్పాటు చేసి లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించారు. శనివారం కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తుండగా మున్సిపల్ కౌన్సిలర్ గడ్డం భాస్కర్‌రెడ్డి పాల్గొనగా లోవోల్టేజ్ సమస్యను పరిష్కరింప చేసిన కౌన్సిలర్ భాస్కర్‌రెడ్డిని, ఎమ్మెల్యే అశోక్‌రెడ్డిని వార్డు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

కరాటే పోటీల నిర్వహణ

గిద్దలూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాయిటెక్నో పాఠశాల ఆవరణలో కరాటే నేర్చుకున్న విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ టెస్టులను నిర్వహించారు. 40 మంది ఈ టెస్టులో పాల్గొన్నారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో రూరల్ సీఐ రామకోటయ్య కరాటే విద్యార్థులకు వారు సాధించిన బెల్టులను, సర్టిఫికెట్లను అందచేశారు. ప్రతి ఒక్కరూ ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని, ముఖ్యంగా బాలికలు తప్పనిసరిగా కరాటే నేర్చుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో సిద్దార్థ కరాటే అకాడమీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోహన్‌రావు న్యాయ నిర్ణేతగా పాల్గొనగా స్థానిక అసోసియేషన్ అధ్యక్షుడు జేవీ నారాయణ, ఉపాధ్యక్షుడు రంగారెడ్డి, ప్రతినిధులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదాతలు

గిద్దలూరు టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం చేయడం వలన మరొకరికి ప్రాణదాతలు అవుతారని టీడీపీ నాయకుడు ముత్తుముల క్రిష్ణకిశోర్‌రెడ్డి అన్నారు. శనివారం మేమున్నాం సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలో ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా 27 మంది రక్తదానం చేశారు. క్రిష్ణకిశోర్‌రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, గర్భిణులకు డెలివరి, తదితర ఆపద సమయాలలో రక్తదాతలు ఇచ్చే రక్తం వారి ప్రాణాలను కాపాడుతుందన్నారు. ఈ సందర్భంగా సేవాసమితి అధ్యక్షుడు చల్లా అశోక్‌రెడ్డిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో సొసైటీ బ్యాంక్ చైర్మన్ దుత్తా బాలీశ్వరయ్య పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : అన్ని దానాలలో గొప్పదైన రక్తదానం ప్రాణదానంతో సమానమని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మార్కాపురం శాఖ చైర్మన్ డా. చెప్పల్లి కనకదుర్గ అన్నారు. రక్తదాతల దినోత్సవం సందర్భంగా డాక్టర్ శ్రావణి వైద్యశాలలో డాక్టర్ కనకదుర్గ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ వ్యవస్థాపకులు జాన్ హెన్రీ చిత్రపటానికి నివాళులర్పించారు. 70సార్లు రక్తాన్ని అందించిన దాత ప్రసాద్‌ను సన్మానించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

'తల్లికి వందనం' వర్తింపజేయాలి

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : తల్లికి వందనం పథకాన్ని ఆప్కాస్‌లో ఉన్న మున్సిపల్ కార్మికులందరికీ వర్తింపజేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కాశిం డిమాండ్ చేశారు. పూలసుబ్బయ్య భవన్‌లో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సమావేశం శనివారం నిర్వహించారు.

ఉగ్రవాదంపై పోరాటం సాగాలి

మార్కాపురం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమైక్యత, లౌకిక విలువలపై ఆధారపడి ఉగ్రవాదంపై పోరాటం సాగించాలని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో శనివారం మత సామరస్యం, దేశ సమగ్రత పరిరక్షణకై సమైక్యత సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మణరావు మాట్లాడుతూ పెహల్గాంలో ఉగ్రదాడి అనంతరం దేశప్రజలు ప్రదర్శించిన ఐక్యత, స్ఫూర్తి అందరినీ ఒక్కతాటిపైకి చేర్చిందన్నారు. ఉగ్రవాదులును అణిచేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను ప్రజలంతా అభినందించారన్నారు. ఉగ్రవాదుల చర్యలను, వారి విద్వేషపూరిత భావజాలాన్ని మెజారిటీ మతోన్మాదంతో ఎదుర్కోలేమన్నారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది పిచ్చుకల శ్రీనివాసరావు, లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక నాయకులు పాల్గొన్నారు.

విద్యా కిట్ల అందజేత

గిద్దలూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకటాపురం గ్రామంలో గల మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన కిట్లను అందచేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కడియం శేషగిరి, విద్యా కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, వైస్ చైర్మన్ రామయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయంలో సౌకర్యాలు మెరుగుపర్చాలి

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : చెన్నకేశవస్వామి ఆలయంలో భక్తులకు అవసరమైన సౌకర్యాలు మెరుగుపర్చాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు అన్నారు. లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయాన్ని బీజేపీ బృందం శనివారం సందర్శించింది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో బాత్ రూమ్‌లు, వసతి లేక సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బందిగా ఉందని వారు గుర్తించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు రాయలసీమ, ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారని, భక్తులకు సౌకర్యాలు లేవని, రాత్రుళ్ల ఆలయ ప్రాంగణంలో ఉండాలంటే ఇబ్బందిగా ఉందని తెలిపారు. ఈవో భక్తుల ఇబ్బందులు లేకుండా చూసి సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బొంతల కృష్ణ, మద్దెల లక్ష్మీ, ప్రవీణ్, మురళీ, శీను, కామేశ్వరరావు పాల్గొన్నారు.

మద్యం, గంజాయితో కుటుంబాలు చిన్నాభిన్నం


మాట్లాడుతున్న డీపీవో ఆయేషాబేగం

మార్కాపురం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మద్యం, గంజాయి వంటి వ్యసనాలు కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తాయని డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ ఆయేషాబేగం అన్నారు. ఎస్సీ, బీసీ కాలనీలోని వెలుగు కార్యాలయంలో శనివారం మద్యం, మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీపీవో ఆయేషాబేగం మాట్లాడుతూ మహిళలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కుటుంబంలో ఎవరైనా మత్తు పదార్థాలకు అలవాటుపడినట్లు గుర్తిస్తే వారిని మాన్పించేందుకు కృషి చేయాలన్నారు. పిల్లలు స్కూల్, కాలేజీల నుంచి వచ్చిన వెంటనే వారి బ్యాగులు, పుస్తకాలను పరిశీలించాలన్నారు. ముఖ్యంగా వారి ప్రవర్తనపై ఎప్పటికప్పుడు విచారిస్తుండాలన్నారు. మత్తుకు బానిసైన వారిని డీఎడిక్షన్ కేంద్రాల్లో చేర్పవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు, మార్కాపురం ఏఈఎస్‌లు ఎ.వెంకట్, డి.బాలయ్య, సీఐ వెంకటరెడ్డి, ఎస్సై గోపాలకృష్ణ, మార్కాపురం టౌన్ ఎస్సై డాక్టర్ రాజమోహన్‌రావు, మహిళలు పాల్గొన్నారు.

హసనాబాద్‌లో రహదారి పనులు

పెద్ద దోర్నాల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హసనాబాద్ గ్రామంలో ప్రధాన రహదారి పనుల్లో కొంత భాగం ఎంపీపీ గుమ్మా పద్మజ శనివారం చేపట్టారు. గ్రామంలోని ఎస్సీ పాలెం నుంచి సుమారు వంద మీటర్ల మేర గుంతలు పడి అధ్వానంగా మారింది. దీంతో ఆ భాగం నిర్మాణాన్ని ఎంపీపీ సొంత నిధులతో మెటల్ పరిచేందుకు పూనుకున్నారు. ఎంపీపీ స్వగ్రామం కావడం, గతంలో చేపట్టిన నిర్మాణ పనులు నిలిచి పోవడంతో రోడ్డు పనులను నిర్వహిస్తున్నారు. కర్నూలు-గుంటూరు రహదారి నుంచి హసనాబాద్‌కు వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణం 2018లో నాబార్డు నిధులు రూ. 87లక్షలతో మంజూరయ్యాయి.పనులు కూడా ప్రారంభించారు. ఎన్నికల కోడ్ రావడంతో పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. ఇప్పటికీ పనులు పునఃప్రారంభం కాలేదు.దీంతో రోడ్డు అస్తవ్యస్తంగా తయారయింది.


ఎక్స్‌కవేటర్‌తో పనులు చేయిస్తున్న నాయకులు

మహిళలపై దాడి తప్ప వైసీపీ సాధించిందేమీ లేదు

ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అధ్యక్షుడు జగన్ పొదిలి పర్యటన మహిళలపై దాడి చేయడం తప్ప వాళ్లు సాధించిందేమీ లేదని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. జవహర్‌నగర్ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన పొదిలి పర్యటనలో వైసీపీ మూకలు మహిళలపై ఏ విధంగా దాడి చేశారో వీడియోలను చూపించారు. ఎలాంటి సమస్య లేకున్నా కేవలం బల ప్రదర్శన కోసమే జగన్ పర్యటన ఏర్పాటు చేశారన్నారు. అమరావతి మహిళలను తీవ్ర పదజాలంతో వైసీపీ మీడియా సంస్థలో కించపరిచే విధంగా మాట్లాడినందుకు తెలుగు మహిళలు శాంతియుతంగా నిరసన తెలిపారన్నారు. కానీ మద్యం మత్తులో వైసీపీ రౌడీ మూకలు ఇష్టారాజ్యంగా రాళ్లు, చెప్పులతో మహిళలని కూడా చూడకుండా దాడి చేయడం సిగ్గుచేటన్నారు. అలాంటి వారిని పోలీసులు అరెస్ట్ చేస్తుంటే వైసీపీ నాయకులు గగ్గోలు పెట్టడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. గత వైసీపీ పాలనలో తాను ప్రజా సమస్యలపై నిరసనలు, ధర్నాలు చేస్తే 17కేసులు నమోదు చేశారన్నారు. తెలుగుదేశం పార్టీ సంక్షేమ పాలనను వైసీపీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయని అన్నారు. ముఖ్యంగా తల్లికి వందనం కింద తల్లుల ఖాతాల్లో నగదు జమ చేస్తుంటే వైసీపీ నాయకులు ఇష్టానుసారంగా విమర్శలు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో కుటుంబంలో ఒక్కరికి మాత్రమే లబ్ధి కలిగిందన్నారు. కానీ నేడు ఎంతమంది పిల్లలుంటే అంతమందికి రూ.13వేల చొప్పున ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాటకు కట్టుబడి అన్ని పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న ఆదరణను చూసి తట్టుకోలేక వైసీపీ శ్రేణులు దుష్ప్రచారాలు చేస్తున్నాయని అన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు వక్కలగడ్డ మల్లికార్జున్, తాళ్లపల్లి సత్యనారాయణ, గుంటక సుబ్బారెడ్డి, మాలపాటి వెంకటరెడ్డి, కనిగిరి బాలవెంకటరమణ పాల్గొన్నారు.

కమనీయం చెన్నయ్య శాంతి కల్యాణం

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురంలో వెలసి ఉన్న రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం స్వామికి శాంతి కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యుల ఆధ్వర్యంలో చెన్నకేశవ స్వామి మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, అభిషేకాలు, అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ మధ్య రంగ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులను శోభాయమానంగా అలంకరించి కల్యాణ ఘట్టాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకుని కళ్యాణం తిలకించారు. రాయలసీమ నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈవో గొలమారి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.


కల్యాణంలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి

వేంకటేశ్వరునికి శేష వాహన సేవ

శివాజీ నగర్‌లోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి శనివారం శేష వాహన సేవలో దర్శనమిచ్చారు. ఆలయంలో సప్తమ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అరుణ్ కుమారాచార్యులు శనివారం ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్ఠ, యాగశాల ప్రవేశం, కలశారాధన నిర్వహించారు.

నేడు కల్యాణం

ఆదివారం స్వామికి హనుమంత వాహన సేవ అనంతరం కల్యాణం నిర్వహిసుతన్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు పి.పి.వెంకటేశ్వర్లు, కార్యదర్శి కొండలరావు, అదనపు కార్యదర్శి నిట్టూరి రమేష్ తెలిపారు.

ఘనంగా తిరుమల నాథుని గరుడోత్సవం

పెద్దారవీడు : మండలంలోని రాజంపల్లిపై వెలసిన శ్రీ గొర్రాలికొండ తిరుమలనాథస్వామివారి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దేవేరులతో కూడిన తిరుమలనాథుని శనివారం గరుడవాహనంపై ఊరేగించారు. ఆలయ వేద పండితులు భవానీ ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రధాన క్రతువులు నిర్వహించారు. స్వామివారు, అమ్మవార్ల మూలవిరాట్, ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. ఈసందర్భంగా గరుడసేవ ఉభయదాతలు స్వామి, అమ్మవార్లకు ప్రసాదాలు సమర్పించారు. వివిధ కుల సత్రాలవారు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు ఏర్పాటు చేశారు.


ప్రత్యేక అలంకరణలో తిరుమలనాథుడు

చట్టాలను అతిక్రమించవద్దు

- జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి
- సబ్ జైళ్ల ఆకస్మిక తనిఖీ

గిద్దలూరు టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ చట్టాలను అతిక్రమించవద్దని జిల్లా ప్రధాన న్యాయాధికారి, జిల్లా న్యాయ సేవాధికార చైర్‌పర్సన్ ఎ.భారతి అన్నారు. శనివారం పట్టణంలోని సబ్ జైలును ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసమయంలో ఉన్న విచారణ ఖైదీలను, డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో శిక్షను అనుభవిస్తున్న ఖైదీలతో ఆమె మాట్లాడారు. ఆ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆ తరువాత సబ్ జైలులో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. మంచి చెడులను గ్రహించే విచక్షణా జ్ఞానాన్ని ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలన్నారు. కుటుంబసభ్యుల మధ్య సత్సంబంధాలు మెరుగుపడ్డాని, అవి కొరవడిన రోజు మానవ సంబంధాలు, కుటుంబ సంబంధాలు విచ్ఛిన్నం అయినపుడు సమాజంలో శాంతి ఉండదన్నారు. ఆవేశంతో విచక్షణా జ్ఞానాన్ని కోల్పోయి నిగ్రహం కోల్పోయి నేరాలకు పాల్పడుతున్నారని, అలాగే మత్తు పదార్థాలకు బానిసైన యువత ఆరోగ్యాన్ని నష్టం చేసుకోవడమేకాక కుటుంబ సభ్యులకు దూరమవుతున్నారని ఆమె అన్నారు. బెయిల్, అరెస్టు, ఉచిత న్యాయ సహాయం గురించి అవగాహన కల్పించారు. విచారణ ఖైదీలకు అందుతున్న సదుపాయాలు, ఆహారం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ షేక్ ఇబ్రహీంషరీఫ్, గిద్దలూరు అడిషనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ది ఫస్ట్‌క్లాస్ కె.భరత్‌చంద్ర, సబ్ జైలు సూపరింటెండెంట్ యు.లింగారెడ్డి, న్యాయవాది సీహెచ్ పోలయ్య, పారా లీగల్ వలంటీర్ అద్దంకి మధుసూదన్‌రావు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.


సబ్ జైలులో నిత్యావసర సరుకులను పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి

మార్కాపురం : జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎ.భారతి శనివారం మార్కాపురం సబ్‌జైల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆమె సబ్‌జైల్ పరిసరాలను పరిశీలించారు. ప్రధానంగా కిచెన్, పారిశుధ్య పరిస్థితి, ఖైదీల వసతి తదితర అంశాలపై పరిశీలించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎవరైనా న్యాయవాదిని పెట్టుకోలేకుంటే మండల న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా ఏర్పాటు చేస్తామని వారికి తెలిపారు. వారిలో మార్పు వచ్చే విధంగా జైలు సిబ్బంది పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆమె వెంట మార్కాపురం ఆరవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎమ్.శుభవాణి, అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.బాలాజీ, జైలు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

తాళ్లూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): యోగాతో ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీవో దారా హనుమంతరావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద శనివారం యోగా కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. నిత్యం ఒత్తిడితో ఉండే ప్రజలు, ఉద్యోగులు ప్రశాంతంగా ఉండాలన్న తలంపుతో రాష్ట్రాన్ని యోగాంధ్రగా ప్రకటించిందన్నారు. ప్రతి వ్యక్తి నిత్యజీవితంతో యోగా చేయటం వల్ల ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. అనంతరం ఆయా గ్రామపంచాయతీలు, పాఠశాలల్లో యోగాభ్యాసంపై గ్రామ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.సంజీవరావు, ఎంఈవో-2 ఎల్.సుధాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఉల్లాసం

పామూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు క్రమం తప్పకుండా యోగాసనాలు వేయడంద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుందని డాక్టర్ గడ్డె ఏడుకొండలు అన్నారు. శనివారం యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్.వాసుదేవరావు, ఎంపీడీవో బ్రహ్మయ్య, సీఐ భీమానాయక్, ఎస్ఐ కిశోర్‌బాబు, పంచాయతీ కార్యదర్శులు జీవీ అరవిందారెడ్డి, జి.నాగేశ్వరరావు, యారవ శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ డీవీ మనోహర్, తదితరులు పాల్గొన్నారు. అలాగే, సీఎస్‌పురం మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో డీఎల్‌డీ వో శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతోనివారి మహోత్సవం

దొనకొండ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): దొనకొండలోని ఆర్సీఎం చర్చిలో పునీత అంతోనివారి మహోత్సవ వేడుకలు సంఘకాపరి రెవరండ్ ఫాదర్ గుడిపల్లి థామస్ ఆధ్వర్యంలో సంఘస్తులు శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన సహవారస పీఠాధిపతులు మోస్టు రెవరండ్ డాక్టర్ పిల్లి అంతోనిదాస్ ఈ వేడుకల్లో ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం పునీత అంతోనివారు, మేరిమాతలను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీల్లో దొనకొండ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ వేడుకల్లో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వందల సంఖ్యలో ప్రజలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నీట్‌లో ప్రతిభచాటిన విద్యార్థులు

పామూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నీట్‌లో పలువురు విద్యార్థులు ప్రతిభచాటారు. పామూరుకు చెందిన దరిశి వసంత్ నీట్ పరీక్షల్లో 8500 ర్యాంకు సాధించారు. అతని తండ్రి పామూరు లో మెడికల్ షాపు నిర్వహిస్తున్నారు. కార్డియాలజి వైద్యుడిని కావాలన్నదే తన లక్ష్యమని వసంత్ పేర్కొన్నారు.

పసుపుగల్లు విద్యార్థులకు ర్యాంకులు

ముండ్లమూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పసుపుగల్లు గ్రామానికి చెందిన కొదపాల చిన బ్రహ్మారెడ్డి, పద్మల కుమారుడు సంపత్ కుమార్‌రెడ్డి శనివారం విడుదలైన నీట్ ఫలితాల్లో ఈడబ్ల్యూఎస్ కోటాలో 4,567 ర్యాంకును సాధించాడు. జనరల్ కోటాలో 37,801 ర్యాంకు వచ్చింది. అదే గ్రామానికి చెందిన తూము రమణారెడ్డి సంపూర్ణల కుమారుడు చిరంజీవిరెడ్డి ఈబీసీ కోటాలో 15వేల ర్యాంకు సాధించాడు.

దేవదాయ భూములకు కౌలు వేలం

తాళ్లూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలో దేవదాయశాఖ పరిధిలోగల శివరాంపురం అగస్త్యేశ్వరస్వామి ఆలయం, రామభద్రాపురం కోదండరామస్వామి ఆలయాలను చెందిన భూముల కౌలుకు సంబంధించి పంగులూరు గ్రూపు దేవస్థాన కార్యనిర్వహణాధికారి వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం వేలం నిర్వహించారు. అగస్త్యేశ్వరస్వామి ఆలయానికి చెందిన 28.72 ఎకరాలు, కోదండరామస్వామి ఆలయానికి చెందిన 14.32 ఎకరాల భూములకు వేలం నిర్వహించారు. మూడేళ్ల పాటు కౌలుకు భూమిసాగు చేసుకునేందుకు వేలం నిర్వహించారు. అగస్త్యేశ్వరస్వామి ఆలయ భూములకు గత సంవత్సరం రూ.2,99,500 కౌలుఉండగా, ప్రస్తుతం నిర్వహించిన వేలంలో రూ.4,25,500 రైతులు దక్కించుకున్నారు.

కోదండరామస్వామి ఆలయ భూములకు గత సంవత్సరం రూ.1,48,500 ఉండగా, ప్రస్తుతం నిర్వహించిన వేలంలో రూ.1,51,500 రైతులు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఈవో జి.వాసుబాబు, ఆర్‌పీ ప్రసాద్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

ఒంగోలు(రూరల్), జూన్ 14(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికలలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సీపీఐ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. శనివా రం ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 21,22,23 తేదీల్లో దర్శిలో సీపీఐ జిల్లా మహాసభలు జరుగుతాయన్నారు. రాష్ట్ర మహాసభలు ఆగస్టు 20 నుంచి 25వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంఎల్.నారాయణ, ఆర్.వెంకటరావు, అందె నాసరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు ప్రారంభమైన బాలికల వసతి గృహం

- నాటి టీడీపీ ప్రభుత్వంలో శంకుస్థాపన
- నిర్మాణం పూర్తయినా పట్టించుకోని గత వైసీపీ ప్రభుత్వం
- ఇబ్బందులు పడిన విద్యార్థినులు


దొనకొండ జడ్పీ పాఠశాల ఆవరణలో ప్రారంభమైన బాలికల వసతి గృహ భవనం

దొనకొండ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మించిన బాలికల వసతిగృహ భవనం టీడీపీ కూటమి ప్రభుత్వం చొరవతో ఎట్టకేలకు ప్రారంభమైంది. గ్రామీణ ప్రాంతాల్లోని పేద కుటుంబాలకు చెందిన బాలికలకు పూర్తిస్థాయి సౌకర్యాలతో విద్యను అందించాలనే ధ్యేయంతో 2018లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం 120 మంది బాలికలు ఉండేందుకు దొనకొండకు బాలికల వసతి గృహం మంజూరు చేసింది. జడ్పీ పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేస్తే బాలికలకు రక్షణగా ఉంటుందని అప్పట్లో అధికారులు భావించి భవన నిర్మాణం చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్(ఏపీఈడబ్ల్యూఐసీ) నేతృత్వంలో దాదాపు కోటిన్నర రూపాయల వ్యయంతో మంజూరైన వసతి గృహ భవనానికి అప్పటిమంత్రి శిద్దా రాఘవరావు శంకుస్థాపన చేశారు. 2021 ఆగస్టులో కాంట్రాక్టర్ పనులు పూర్తిచేశారు.

అయితే, గత వైసీపీ పాలకులు బాలికల వసతిగృహ భవనం వినియోగం గురించి పట్టించుకోలేదు. దీంతో మూడేళ్లుగా ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా దర్శనమిస్తుంది. ప్రస్తుత ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల బాలికల విద్యాభివృద్ధిపై దృష్టిసారించింది. హాస్టల్ భవనం అన్నీ సౌకర్యాలతో జడ్పీ పాఠశాల హెచ్‌ఎం పర్యవేక్షణలో కొనసాగేలా చర్యలు చేపట్టింది. వసతి గృమానికి వార్డెన్, పార్ట్‌టైం టీచర్, హెడ్‌కుక్, చౌకీదారు తదితర పోస్టులకు అర్హులైన వారిని ఎంపిక చేయటంతో శుక్రవారం విధుల్లో చేరారు. అవసరమైన వంటసామాన్లు, మౌలిక సౌకర్యాలు సమకూర్చారు. గత కొన్ని సంవత్సరాలుగా వసతిగృహ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న బాలికలకు టీడీపీ కూటమి ప్రభుత్వం చొరవతో సమస్య తీరింది. వసతిగృహ భవనం ప్రారంభం కావటంతో ప్రభుత్వ పనితీరుపట్ల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వసతి గృహంలో కళాశాల బాలికలకు అవకాశం

- వీవీ రామాంజనేయులు, హెచ్‌ఎం, జడ్పీ ఉన్నత పాఠశాల



బాలికల వసతిగృహ భవనంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న గ్రామీణ ప్రాంతాలకు చెందిన బాలికలకు ప్రవేశ సౌకర్యం కల్పించేలా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. సోమవారం నుంచి దాదాపు 120 మంది బాలికలను వసతి గృహంలో చేర్చుకుంటాం.

విద్యకు అధిక ప్రాధాన్యం

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి


జిల్లా పరిషత్ పాఠశాల ఏర్పాటు శిలాఫలకాన్ని ఆవిష్కరణలో పాల్గొన్న ఉగ్ర

పామూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): విద్యకు ప్రభుత్వం అధిక పాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించే పేదింటి విద్యార్థుల కోసం బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించిందన్నారు. మండలంలోని నర్రమారెళ్ల గ్రామంలోని పాఠశాలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారు. ఉన్నత పాఠశాల శిలాఫలకాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లుతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర శనివారం ప్రాంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నర్రమారెళ్లతో పాటు, మోపాడు, పడమటకట్టకిందపల్లి గ్రామాల్లోని ప్రాథమికోన్నత పాఠశాలలు పదో తరగతి పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేసినట్టు చెప్పారు. విద్యార్థులకు సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్టు చెప్పారు. సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా పాఠశాలలు ప్రారంభం రోజునే ఎంతమంది పిల్లలు ఉంటే అంత మందికి తల్లికివందనం కింద నగదు వేసిన ఘనత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కే దక్కిందన్నారు. ఈసందర్భంగా విద్యా కిట్లను అందజేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి, మాజీ ఎంపీపీ దశరథరామయ్య, జి .శ్రీనువాసులు, ఎంఈవో-1 డీవీ సుబ్బారావు, ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, హెచ్‌ఎం షేక్ మహబూబ్‌బాషా, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో స్వామివార్ల శాంతి కల్యాణం

పామూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పామూరు మండలంలోని నర్రమారెళ్ల గ్రామంలో సీతారామచంద్ర స్వామి తిరునాళ్ల వేడుకల్లో భాగంగా శనివారం ఆలయ అర్చకులు మహంకాళి శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో శాంతి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివార్లకు గుంటుపల్లి నాగేశ్వరరావు, సుబ్బరాయుడు, బసవయ్య, నాగార్జున ఆర్థిక సహకారంతో వెండి కిరీటాన్ని బహూకరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర మాట్లాడుతూ దైవ కార్యక్రమాలను అందరూ కలిసిమెలసి జరుపుకోవాలని సూచించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవస్థాన నిర్వాహకులు ఉగ్రను స్వామివార్ల శేషవస్త్రంతో ఘనంగా సత్కరించారు.

కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ గుంటుపల్లి దశరథరాములు, అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, జి.శ్రీనువాసులు, ఎం. రమణయ్య, పోకా వినోద్, జి.నాగమల్లేశ్వరరావు, గోళ్ల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మిట్టపాలెంలో..

సీఎస్‌పురం(పామూరు), జూన్ 14 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం మిట్టపాలెం గ్రామంలో సీతారాముల కల్యాణాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా నారాయణస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ పాములపాటి మాధవప్రసాద్, రమణమ్మ దంపతుల ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, నారాయణస్వామి దేవస్థాన చైర్మన్ కొమ్మినేని చినఆదినారాయణ, బిజయరామిరెడ్డి, తాళ్ల వెంకటసుబ్బయ్య, చలువాది తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనం.. కుటుంబాల ఆనందం


తల్లికి వందనం అమలుతో పిల్లలతో ఆనందం వ్యక్తం చేస్తున్న పావనీదేవి

దర్శి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకం అమలుతో పిల్లల తల్లితండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చదువులకు ఆటంకం లేకుండా కూటమి ప్రభుత్వం స్కూళ్ల ప్రారంభం రోజునే ఖాతాల్లో నగదు జమచేయటం సంతోషకరమని ప్రశంసిస్తున్నారు. దర్శి పట్టణం 6వ వార్డుకు చెందిన పావనీదేవి, సుబ్బాచారి దంపతుల కుమార్తె అమృతసాయి ఈ ఏడాది పదో తరగతిలో చేరింది. కుమారుడు మణికంఠసాయి ఏడో తరగతిలో చేరాడు. దర్శి పట్టణంలోని ఒక ప్రైవేట్ స్కూల్లో వీరు చదుతున్నారు. ఇద్దరు పిల్లలకు రూ.13వేలు చొప్పున నగదు జమకావటంతో సంతోషం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖమంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మండలంలో 11503 మంది విద్యార్థులు తల్లికి వందనం పథకం పొందుతున్నారు. నిబంధనలకు అనుగుణంగా లేని 1691 మందిని అనర్హుల జాబితాలో చేర్చారు. మరో 365 మందికి అర్హత ఉన్నప్పటికీ ఆధార్ అనుసంధానం కాకపోవటంతో నగదు జమకాలేదు. విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లో నగదు జమ అవుతుండటంతో వీరు విద్యాశాఖ కార్యాలయానికి వచ్చి ఆధార్ అనుసంధానం చేసుకుంటున్నారు. ఒక్కరోజులో 200 మంది విద్యార్థులకు ఆధార్ అనుసంధానం చేసినట్లు ఎంఈవో రఘురామయ్య తెలిపారు. మిలిగిన వారికి ఆధార్ అనుసంధానం చేసి అర్హులందరికీ పథకం వర్తింపచేస్తామని చెప్పారు.

దొనకొండలో 7440 మందికి తల్లికి వందనం

దొనకొండ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు తల్లికి వందనం పథకం అమలుచేస్తున్నారు. దీంతో తల్లుల బ్యాంక్ ఖాతాల్లో శుక్రవారం నుంచి నగదు జమ అవుతున్నాయి. 1వ తరగతి నుండి ఇంటర్ విద్యార్థుల వరకు తల్లికి వందనం పథకంకు చెందిన నగదు జమచేసేలా ప్రభుత్వ నిర్ణయించి అమలుచేయటం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం అమ్మఒడి పేరుతో ఇంట్లో ఒకరికి మాత్రమే నగదు జమచేసింది. కూటమి ప్రభుత్వం ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి నగదు జమ చేస్తుంది. దీంతో విద్యార్థుల చదువుల భారం తల్లిదండ్రులపై పడకుండా ప్రభుత్వం భరోసా కల్పించిందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

మండలంలోని 14 సచివాలయాల పరిధిలో 7440 మంది విద్యార్థులు తల్లికి వందనం పథకంలో అర్హులు కాగా, 606 మంది విద్యార్థులు వివిధ కారణాలతో అనర్హులుగా గుర్తించారు.

మనస్పర్థలతో యువకుడు ఆత్మహత్యాయత్నం

- కాపాడిన పోలీసులు


గోవిందును కాపాడిన ఎస్ఐ కమలాకర్, సిబ్బంది

ముండ్లమూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య మనస్పర్థలతో యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా పోలీసులు రక్షించారు. మండలంలోని వేములబండకు చెందిన అవుల అనూష, దొనకొండ మండలం పెద్దన్నపాలెంకు చెందిన మిండాల గోవిందు గత కొంతకాలంగా ప్రేమించుకున్నారు. వీరిద్దరూ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్నారు. గతనెల 20న మండలంలోని వేంపాడు ఆంజనేయస్వామి గుడిలో కులాంతర వివాహం చేసుకున్నారు. అయితే, మనస్పర్థలు ఏర్పడటంతో శనివారం ఉదయం ముండ్లమూరు పోలీసుస్టేషన్‌కు వచ్చారు. ఆ సమయంలో భార్య అనూష స్టేషన్‌లో ఉండగానే కళ్ళుగప్పి వెళ్ళిపోయారు. ఒంటి గంట సమయంలో దర్శి మండలం రాజంపల్లి సమీపంలో నుంచి భార్య అనూషాకు వీడియో కాల్‌చేసి తాను పురుగులమందు తాగి చనిపోతున్నానని తెలిపారు. విషయాన్ని ఎస్ఐ కమలాకర్‌కు తెలపడంతో లోకేషన్ ద్వారా రాజంపల్లి పొలాల్లో ఉన్నట్టు గుర్తించి వెంటనే సంఘటనా స్థలానికి వెళ్ళారు. అప్పటికే గోవిందు చేతిలో ఎలుకల మందు శీతలపానీయంలో కలిపి ఉండటంతో ఎస్ఐకి అనుమానం వచ్చి గోవిందును గట్టిగా ప్రశ్నించాడు. ఎలుకల మందు సేవిస్తే ఆస్పత్రికి తీసుకెళతానని చెప్పటంతో తాను తాగలేదని, కొంత ఆలస్యమైతే తాగేవాడినని ఎస్ఐకు సమాధానం ఇచ్చారు. సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి కాపాడిన ఎస్ఐకి గోవిందు తల్లిదండ్రులు బాలంకయ్య, మల్లేశ్వరి, అనూష తండ్రి అచ్చయ్య కృతజ్ఞతలు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


సుబ్బారెడ్డి(ఫైల్)

ముండ్లమూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతిచెందాడు. ఈఘటన మండలంలోని ఉల్లగల్లులో చోటుచేసుకొంది. ఆగ్రామ పొలాల్లో వేముల వెళ్ళే ప్రధాన రహదారి సమీపంలో చెట్టుకు ఉరివేసుకొని కుమ్మెత సుబ్బారెడ్డి(37) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉండటాన్ని శనివారం మధ్యాహ్నం ముండ్లమూరు పోలీసులు గుర్తించారు. వేముల గ్రామానికి చెందిన కుమ్మెత సుబ్బారెడ్డి రూ.4 లక్షల నగదును ఉల్లగల్లులోని కెనరా బ్యాంకులో బాకీ చెల్లించేందుకు గురువారం ఇంటినుంచి వెళ్లాడు. సాయంత్రానికి ఇంటికి రాక పోవటంతో అదేరోజు సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇంతలో శనివారం మధ్యాహ్నం ఉల్లగల్లు గ్రామానికి చెందిన రైతు పొలానికి వెళ్లగా, చెట్టుకు గుర్తు తెలియని వ్యక్తి ఉరి వేసుకొని మృతి చెందాడని గ్రామస్థులకు తెలపడంతో పోలీసులకు సమాచరమివ్వగా వారు సంఘనాస్థలాన్ని పరిశీలించారు. విషయం తెలియడంతో సుబ్బారెడ్డి భార్య శేషారత్నం, బంధువులు అక్కడికివచ్చారు. మృతదేహాన్ని చూసి తమ భర్తేనని ఒక్కసారిగా కన్నీరు మున్నీరుగా విలపించారు. ఎస్ఐ కమలాకర్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. సుబ్బారెడ్డికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బేల్‌దారి మేస్త్రిగా సుబ్బారెడ్డి పనిచేస్తుంటారు. ఇంటినుంచి తీసుకెళ్లిన నాలుగు లక్షలతో పేకాటలో ఆడి ఉంటాడని మృతుని బంధువులు అనుమానిస్తున్నారు. పేకాట రాయుళ్ళే హత్య చేసి ఉంటారని వారు ఆరోపిస్తున్నారు. మృతదేహం ఒక చోట, ద్విచక్ర వాహనం మరోచోట, చెప్పులు మరోచోట పడి ఉండటంతో ఎక్కడో చంపి అనుమానించకుండా చెట్టుకు ఉరివేసినట్టు చిత్రీకరించి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దర్శి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్టు ఎస్ఐ కమలాకర్ తెలిపారు.

వైసీపీవి కుటిల రాజకీయాలు

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ధ్వజం

దర్శి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): చట్ట వ్యతిరేఖ కార్యకలాపాలకు పాల్పడుతూ వైసీపీ నాయకులు జైలుబాట పడుతున్నారని టీడీపీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. ఈమేరకు శనివారం ఓ ప్రకటన విడుదలచేశారు. పొదిలిలో మహిళలు, పోలీసులపై దాడులు చేసిన దోషులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుండగా వైసీపీ సైకోలు ఉలిక్కిపడుతున్నారని విమర్శించారు. మహిళలపై చెప్పులు, రాళ్లు విసిరి గాయపర్చిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటే తప్పేమిటని ప్రశ్నించారు. రాజధాని మహిళలు శాంతియుతంగా యాత్ర చేస్తుంటే పోలీసులతో లాఠీచార్జి చేయించిన జగన్‌రెడ్డికి ఆ దృశ్యాలు గుర్తుకు రావటంలేదా అని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు అవినీతి, అక్రమాలతో, వేధింపులతో ప్రజలను ఇబ్బంది పెట్టిన వైసీపీ నాయకులకు ప్రభుత్వం దోషులపై కఠిన చర్యలు తీసుకుంటుండటంతో దిక్కుతోచక నిందారోపణలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రౌడీషీటర్లు, గంజాయి బాచ్‌లను ప్రోత్సహించిన జగన్‌రెడ్డి ఇప్పుడు ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు అరాచకాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కూటమి ప్రభుత్వం పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు అన్నీ చర్యలు తీసుకున్నప్పటికీ ఏదో గొడవ చేయాలనే దురుద్దేశంతో పొదిలికి వచ్చి మహిళలపై దాడులు చేయించారని విమర్శిచారు. దాడులకు పాల్పడిన వారిని ప్రభుత్వం వదిలిపెట్టే ప్రశక్తేలేదన్నారు. సూత్రదారులు, పాత్రదారులపై చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. తల్లికి వందనం పథకం అమలుతో మహిళలు రాష్ట్ర వ్యాప్తంగా ఆనందం వ్యక్తం చేస్తుండటంతో ఏమి చేయాలో పాలుపోక వైసీపీ నాయకులు కుటిల రాజకీయాలకు పాల్పడుతున్నారని ఎద్దేవా చేశారు.

పామూరులో ఆక్రమణల తొలగింపు


ఎక్స్‌కవేటర్‌తో కాలువలపై ఉన్న ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

పామూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పామూరు పట్టణంలోని ఆర్‌అండ్‌బీ రోడ్లకు ఇరువైపులా కాలువలపై ఉన్న ఆక్రమణలను పంచాయతి, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఎక్స్‌కవేటర్లతో తొలగించారు. ఆక్రమణలు తొలగించడంతో పట్టణంలో రోడ్లన్నీ విశాలంగా మారాయి. గత వారం రోజుల నుంచి కాలువలపై ఉన్న నిర్మాణాలను, బంకులను కొందరు వ్యాపారస్తులు స్వచ్ఛందంగానే తొలగించుకున్నారు. ఈనేపథ్యంలో శనివారం ఉదయం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద నుంచి రోడ్డుకు ఇరువైపులా కాలువలపై ఆక్రమణలతో పాటు ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన కాలువలను సైతం పగులకొట్టడాన్ని పట్టణ ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. అర్థంతరంగా కాలువలను ధ్వంసం చేస్తే ఇళ్లలోకి మేము ఎలా వెళ్లాలని కొందరు మహిళలు ప్రశ్నిస్తున్నారు. ఆక్రమణల తొలగింపుతో ఎలాంటి గొడవలు జరగకుండా సీఐ భీమానాయక్, ఎస్ఐ కిశోర్‌బాబు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

చేగువేరా స్ఫూర్తితో ముందుకు సాగాలి


చేగువేరా చిత్రపఠానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన డీవైఎఫ్ఐ నాయకులు

కనిగిరి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): చేగువేరా స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కేవీ పిచ్చయ్య అన్నారు. చేగువేరా 97వ జయంతి సందర్భంగా శనివారం స్థానిక సుందరయ్య కాలనీలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా పిచ్చయ్య మాట్లాడుతూ తాను పుట్టిన క్యూబా స్వాతంత్ర్యం కోసం పోరాడి ప్రాణలర్పించారన్నారు. యుద్ధంతో ప్రజలకు నష్టం వాటిల్లుతుందని భావించే వాడిలో చేగువేరా ఒకరన్నారు. రాజకీయం పేరుతో జరిగే యుద్ధాలతో ప్రజలకు నష్టం వాటిల్లుతుందన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు పి.నరేంద్ర, నెహ్మత్, శివ, నందకిషోర్, ప్రసంగి, వలి, ఎలిషా, మహేంద్ర, నవీన్, లక్ష్మణ్, చిన్నబాబు, సిద్ధా తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం


ఎక్కువ సార్లు రక్తదానం చేసిన వారిని సత్కరిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రక్తదానం మరొకరికి ప్రాణదానమని మున్సిపల్ చైర్మన్ గఫార్ అన్నారు. ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా రక్తదాతలకు శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేసినవారు మరింత ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఇప్పటికే 54 సార్లు రక్తదానం చేసిన ముత్యాల శ్రీనివాసులురెడ్డి, 40 సార్లు రక్తదానం చేసిన వర సింగారెడ్డి, 18సార్లు రక్తదానం చేసిన మారెళ్ళ వెంకటకృష్ణారెడ్డి అభినందనీయులన్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని ప్రతిఒక్కరూ రక్తదాతలుగా మారాలన్నారు. కార్యక్రమంలో గుడ్‌హెల్ప్ రమేష్, మదర్ సేవాసమితి అధ్యక్షుడు నాయబ్ రసూల్, చమిడిశెట్టి (బొట్టు) శ్రీనివాసులునాయుడు, నాగూర్‌బీ, భారతి, రక్తదాతలు పాల్గొన్నారు.

శాస్త్రీయ సమాజస్థాపనే జేవీవీ లక్ష్యం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ ధనుంజయుడు

కనిగిరి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ సమాజ స్థాపనే లక్ష్యంగా జేవీవీ చేస్తున్న కృషి అభినందనీయమని ప్రముఖ వైద్యులు మర్రి ధనుంజయుడు అన్నారు. సాయి సిద్ధార్థ ఆస్పత్రిలోని ఆయన చాంబర్‌లో శనివారం జేవీవీ చేపట్టిన శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా డాక్టర్ ధనుంజయ మాట్లాడుతూ ప్రజల్లో నెలకొన్న మూఢ విశ్వాసాలను ప్రారద్రోలేందుకు జేవీవీ చేస్తున్న అవగాహన, శిక్షణ కార్యక్రమాలు భవిష్యత్ తరాలకు ఎంతో మేలు చేకూర్చనున్నాయన్నారు.

కార్యక్రమంలో జేవీవీ జిల్లా నాయకులు జి.శ్రీనివాసులురెడ్డి, షేక్ ఖాజాహుస్సేన్, మేడం కోటిరెడ్డి, షరీఫ్ పాల్గొన్నారు.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ఆదివారం, 15 జూన్ 2025 | బాపట్ల | 4 పేజీలు





అల్లర్లు లేవు... రాజకీయ అలజడులు లేవు...! ఆక్రమణలు లేవు.. అక్రమ నిర్బంధాలు లేవు..! అన్నింటికీ మించి రాజకీయ దౌర్జన్యాలు.. రెచ్చగొట్టే ప్రసంగాలు అసలే లేవు..! ఇదంతా ఎక్కడో కాదు. చీరాల నియోజకవర్గంలో రమారమి ఒక్కటిన్నర దశాబ్దం అనంతరం నెలకొన్న తాజా పరిస్థితి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి స్థానికంగా శాసనసభ్యుడు మద్దులూరి మాలకొండయ్య పాలన ప్రారంభమైన ఏడాదిలో నెలకొన్న వాతావరణం. గతంలో ఆ నియోజకవర్గంలో కొనసాగిన రాజకీయ పరిస్థితికి ఇది పూర్తిగా భిన్నమైనది. అందుకు ఎమ్మెల్యే మాలకొండయ్య రాజకీయ పోకడే ప్రధాన కారణమంటే ఏమాత్రం అతిశయోక్తి కాదు. సామాన్య కుటుంబంలో జన్మించిన మాలకొండయ్య ఎన్నో అవరోధాలు, అడ్డంకులను ఎదుర్కొని అటు వ్యక్తిగత జీవితంలోనూ, ఇటు రాజకీయాల్లోనూ నిలదొక్కుకున్నారు. విజయవాడ కేంద్రంగా వ్యాపార రంగంలోకి అడుగుపెట్టి అనతికాలంలోనే స్థిరపడ్డారు. మరోవైపు వామపక్ష భావజాలంతో విద్యార్థి ఉద్యమాల్లో పాల్గొన్న ఆయన రాజకీయాల పట్ల మక్కువతోనే పెరిగారు. 1995 ప్రాంతంలో స్వగ్రామం ఉన్న పంచాయతీ సర్పంచ్ పదవి బీసీలకు రిజర్వ్‌కావడంతో స్థానికులు ప్రధానంగా బడుగు,బలహీనవర్గాల వారు సర్పంచ్‌గా కొండయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆతర్వాత 2001-02 ప్రాంతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో పొన్నలూరు ఎంపీపీగా తన సతీమణిని గెలిపించుకోగలిగారు. అప్పటి నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్నా చట్టసభలకు వెళ్లాలన్న ఆయన అభిలాష నెరవేరేందుకు గత అసెంబ్లీ ఎన్నికల వరకు ఎదురుచూడాల్సి వచ్చింది. గత ఎన్నికలకు ముందు చంద్రబాబునాయుడు ప్రోత్సాహం, సూచనతో చీరాల నియోజకవర్గానికి వచ్చిన కొండయ్య.. అనతికాలంలోనే ప్రజలతో మమేకం కాగలిగారు. రాజకీయ విశ్లేషకుల అంచనాలను పటాపంచలు చేస్తూ ఎమ్మెల్యేగా గెలుపొంది చిరకాల స్వప్నాన్ని నెరవేర్చుకోగలిగారు. అనంతరం తనను ఆదరించిన ప్రజల రుణం తీర్చుకునే క్రమంలో భాగంగా ముందడుగు వేస్తున్నారు. తొలి ఏడాదిలోనే నియోజకవర్గంలో రాజకీయ ప్రశాంతతను సాధించిన ఆయన చీరాల మునిసిపాలిటీ పాలకవర్గాన్ని చేజిక్కించుకోవడం ద్వారా రాజకీయ చతురతలో తానేమీ తీసిపోనని నిరూపించుకున్నారు. ఆపై నిర్దిష్ట ప్రణాళికతో అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టిసారించి తొలి అడుగు దిగ్విజయంగా వేయగలిగారు. బడుగు, బలహీనవర్గాలకు చెందిన పేద ప్రజలు అధికంగా నివసించే నియోజకవర్గంలో పర్యాటకరంగ అభివృద్ధితోపాటు చేతివృత్తులు, కులవృత్తులకు చేయూతగా ప్రజల ఆర్థికాభ్యున్నతి కోసం ఆయన పథకాల సాధనలో ముందుకు సాగుతున్నారు.



పర్యాటక రంగానికి ప్రాధాన్యం
చేతివృత్తులకు చేయూత

- తాగు, సాగునీటి రంగాలకు పెద్దపీట
- మౌలిక వసతుల కల్పనపై దృష్టి

విస్తీర్ణంలో చిన్నదైన చీరాల నియోజకవర్గంలో రెక్కాడితేకాని డొక్కాడని సామాన్య ప్రజానీకమే అధికంగా జీవిస్తుంటారు. చీరాల, వేటపాలెం ప్రాంతాలు కొన్నిరంగాల వ్యాపారకేంద్రాలుగా ఉన్నప్పటికీ ఆర్థికంగా అభివృద్ధి చెందని పేద కుటుంబాలే 90శాతం వరకు ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. సామాజికంగా చూస్తే బడుగు బలహీన, దళితవర్గాల ప్రజానీకం అత్యధికం. మొత్తం ప్రజానీకంలో అగ్రవర్ణాల ప్రజానీకం 10శాతం కూడా ఉండదు. కులవృత్తులు, చేతివృత్తులు ఆ నియోజకవర్గ ప్రజల ప్రధాన జీవనాధారం. పారిశ్రామిక అభివృద్ధి అంతంతమాత్రమే. పేరొందిన ఐటీసీ నెలకొల్పిన పరిశ్రమ, చేనేత, జీడిపప్పు ఉత్పత్తికి అనుగుణమైన పరిశ్రమలే కనిపిస్తాయి. నియోజకవర్గం పొడవునా తీరప్రాంతం ఉంది. దీంతో అటు తీరప్రాంతం, ఇటు చేతివృత్తుల అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలను చేపట్టాల్సిన అవశ్యకత ఎక్కువగా ఉంది. ఈ విషయంలో దశాబ్దాలుగా కొన్ని ప్రయత్నాలు జరిగినా ఆశించిన అభివృద్ధి జరగలేదు. రాష్ట్ర విభజన అనంతరం రాజధాని అమరావతి చేరువగా ఉండటంతో పర్యాటక రాకపోకలు కూడా పెరిగిపోయాయి. ఈ దశలో ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన మాలకొండయ్య కొన్ని దీర్ఘకాలిక అభివృద్ధి పథకాలపై దృష్టిసారించారు.

పర్యాటకంపై ప్రత్యేక దృష్టి

పర్యాటకరంగ అభివృద్ధి ద్వారా ప్రజల రాకపోకలు పెరిగితే ఉపాధి అవకాశాలు అధికంగా ఉంటాయి. తీరప్రాంతంలో పర్యాటకులకు కనీస వసతులు కల్పించే కొన్ని చర్యలను ఎమ్మెల్యే కొండయ్య చేపట్టి పురోభివృద్ధి చూపించారు. దీంతో ప్రతివారం సుమారు 30వేల మంది ప్రయాణికులు తీరప్రాంతానికి వస్తున్నారు. ఆ పర్యాటకుల సంఖ్యను లక్షకు పెంచేదిశగా అక్కడ కార్యక్రమాలు చేపడుతున్నారు. ఓడరేవు నుంచి పొట్టిసుబ్బయ్యపాలెం వరకు గల పది కిలోమీటర్ల పొడవు రోడ్డును డబుల్‌రోడ్డుగా మార్చే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఓడరేవు, రామాపురం బీచ్‌ల వద్ద ఒక్కోచోట సుమారు 30 లక్షలు ఖర్చుపెట్టి పర్యాటకుల కోసం టాయ్‌లెట్స్, స్నానాలు చేసే షవర్స్ ఏర్పాటు చేస్తున్నారు. అధిక వ్యయంతో రిసార్ట్స్‌లో ఉండే అవకాశం లేనివాళ్లకు ఈ సౌకర్యాలు ఉపయోగపడనున్నాయి. అలాగే వాహనాలు నిలుపుకునేందుకు ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాల అభివృద్ధి, కంటైనర్ ఫుడ్‌కోర్టుల ఏర్పాటుకు మెప్మా ఆధ్వర్యంలో చర్యలు తీసుకున్నారు. ఇంకోవైపు గ్రీనరీ అభివృద్ధికీ నిధులు సమకూరుస్తున్నారు. పక్కనే బాపట్లకు దగ్గరలో ఉన్న సూర్యలంక బీచ్‌నుంచి ఓడరేవు బీచ్‌ను కలిపేందుకు అవసరమైన బ్రిడ్జిల నిర్మాణానికి చర్యలు చేపట్టారు. తొలివిడతగా ఒకభాగం బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. భవిష్యత్తులో సూర్యలంక నుంచి చీరాల నియోజకవర్గం చివరి వరకు తీరప్రాంతం మొత్తం పర్యాటక ప్రాంతంగా మార్చేలా అటు బ్రిడ్జిలు ఇటు రహదారి అభివృద్ధితోపాటు ఎక్కడికక్కడ కనీస సౌకర్యాలు, రక్షణ చర్యల ఏర్పాటుకు అనుగుణంగా ముందుకు వెళ్తున్నట్లు ఎమ్మెల్యే మాలకొండయ్య వివరించారు. రిసార్ట్స్ ఏర్పాటుకు ముందుకొచ్చిన వారికి స్థలాల సేకరణలోనూ చేయూతనిస్తున్నారు.

చేతివృత్తుల అభివృద్ధిపై..

చేతివృత్తిదారుల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని హ్యాండ్లూమ్ పార్కు సాధన దిశగా అడుగులేస్తున్నట్లు ఎమ్మెల్యే కొండయ్య తెలిపారు. జీడిపప్పు ప్రాసెసింగ్ పార్కు, సీఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, మత్స్యకారుల కోసం ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు తన భవిష్యత్తు లక్ష్యాలని ఆయన చెప్పారు. మునిసిపాలిటీ అభివృద్ధి కోసం ఇప్పటికే ప్రత్యేక ప్రణాళికను రూపొందించుకున్న ఆయన డ్రైన్ల అభివృద్ధి, మంచినీటి సరఫరా పైప్‌లైన్లు, రోడ్ల విస్తరణకు కొంతమేర నిధులు సాధించిన కొండయ్య.. మరిన్ని నిధుల కోసం కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలతో చర్చలు ప్రారంభించారు.

అభివృద్ధి కొండంత

చీరాల ఎమ్మెల్యే కొండయ్య ఏడాది పాలన సూపర్ సక్సెస్

నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణం



సర్పంచ్ నుంచి ఎమ్మెల్యే వరకు ఓర్పు, నేర్పుగా రాజకీయ అడుగులు

ధైర్యంగా ముందుకు సాగి.. మన్ననలు పొంది..

గత ఎన్నికలకు ముందు చీరాల నుంచి బలహీనవర్గాలకు చెందిన వారిని రంగంలోకి దించాలని భావించిన తెలుగుదేశం పార్టీ అనేకమంది నాయకుల పేర్లను పరిశీలించింది. చివరికి టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అవకాశాన్ని కొండయ్యకిచ్చారు. గత ఎన్నికలకు ముందు నియోజకవర్గంలో ప్రవేశించేరోజే అప్పటి అధికార వైసీపీ నుంచి అవరోధాలు ఎదురయ్యాయి. చీరాలలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించుకునే అవకాశం కూడా లేకుండా చేసే ప్రయత్నం జరిగింది. అయినా వెనుకడుగు వేయకుండా ముందుకు సాగి నియోజకవర్గంలో అటు పార్టీ శ్రేణులతోనూ, ఇటు ప్రజలతోనూ మమేకం కాగలిగారు. అప్పటికే చీరాల ప్రాంతంలో దౌర్జన్యపూరిత రాజకీయాలు ఉన్నప్పటికీ సౌమ్యుడైన రాజకీయనేతగా ప్రజల దృష్టిని ఆకర్షించారు. బడుగు,బలహీనవర్గాల ప్రజలు అధికంగా ఉండే చీరాల నియోజకవర్గంలో ఆవర్గాల ప్రజల మన్ననలు పొందగలిగారు. దీనికితోడు వైసీపీ ప్రభుత్వ వ్యతిరేకత, అంతకుమించి కూటమి ప్రభుత్వ సానుకూల వాతావరణం కూడా కలిసొచ్చి విజయాన్ని చేజిక్కించుకున్నారు. 30 ఏళ్ల రాజకీయ జీవితంలో చట్టసభల్లోకి వెళ్లాలన్న ఆకాంక్షను తీర్చిన చీరాల ప్రజల రుణం తీర్చుకోవాలన్న దృఢదీక్షతో కార్యాచరణ రూపొందించుకున్నారు. తాను, లేక తనకుమారులిద్దరిలో ఒకరు ప్రతిరోజూ చీరాల ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా ముందుకు సాగుతున్నారు. అలాగే రాజకీయ దౌర్జన్యాలకు ఫుల్‌స్టాప్ పెట్టి ప్రజలు ప్రశాంత వాతావరణంలో గడిపే పరిస్థితిని ఏర్పాటు చేయడంలో సఫలీకృతులయ్యారు. రాజకీయంగా అక్కడే స్థిరపడాలన్న దృఢనిర్ణయంతో అన్నివర్గాల ప్రజలకు చేయూతనిచ్చే బృహత్తర ప్రణాళికను రూపొందించుకుని ముందడుగు వేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

చిన్నతనం నుంచే రాజకీయాల పట్ల ఆసక్తి కలిగిన చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ఓర్పు, నేర్పుతో రాజకీయపయనం సాగించారు. ముప్పై సంవత్సరాలుగా ఎన్నో అవరోధాలు ఎదురైనా దృఢసంకల్పంతో ముందుకు సాగి చట్టసభల్లోకి ప్రవేశించగలిగారు. పొన్నలూరు మండలంలోని మాలపాడు అనే కుగ్రామం లో సామాన్య కుటుంబంలో కొండయ్య జన్మించారు. కావలి, ఒంగోలు, గుంటూరు లాంటి పట్టణ ప్రాంతాల్లో విద్యాభ్యాసం పూర్తిచేశారు. విద్యార్థి దశలో వామపక్ష భావజాలంతో విద్యార్థి ఉద్యమాల్లో పాల్గొంటూ నాయకత్వ లక్షణాలను అలవర్చుకున్నారు. విద్యాభ్యాసం చివరి రోజుల్లోనే వ్యాపారరంగంలో అడుగిడిన ఆయన 1997 ప్రాంతంలో ప్రత్యక్ష రాజకీయరంగ ప్రవేశం చేశారు. రమారమి మూడు దశాబ్దాలపాటు ఆయన రాజకీయాల్లో ఓర్పుగా. నేర్పుగా పయనిస్తూ అవకాశం కోసం వేచిచూశారు. ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ చట్టం కొండయ్య రాజకీయ ప్రవేశానికి మార్గం సుగమం చేసింది. అప్పట్లో ఆయన స్వగ్రామం పరిధిలోని పంచాయతీలో అగ్రవర్ణాలలో ఒక సామాజికవర్గానికి చెందిన బడా వ్యక్తుల పెత్తనం అధికంగా ఉండేది. 1995-96 కాలంలో ఆ పంచాయతీ సర్పంచ్ పదవి బీసీలకు రిజర్వ్ అయింది. వ్యాపారరంగంలో ఎక్కడ ఉన్నా స్వగ్రామంతోపాటు ఆప్రాంత ప్రజలతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తూ గ్రామంలోని పేదలకు మౌలిక వసతుల కల్పనకు కొండయ్య చేదోడుగా నిలిచారు. దీంతో పంచాయతీకి సర్పంచ్‌గా రంగంలోకి రావాలని అక్కడి ప్రజలు ఒత్తిడి చేశారు. ఆయన రంగంలోకి వచ్చి అన్నివర్గాల ప్రజల మద్దతుతో సర్పంచ్ పదవిని ఏకగ్రీవంగా దక్కించుకున్నారు. తెలుగుదేశంతోనే ఆయన పయనాన్ని సాగిస్తూ పొన్నలూరు మండల రాజకీయాల్లో చక్రం తిప్పారు. 2001-02 ప్రాంతంలో మండల పరిషత్ ఎన్నికలు రావడంతో ఆవైపు దృష్టి సారించారు. దివంగత ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన బీసీలకు స్థానిక సంస్థలలో రిజర్వేషన్ సౌకర్యం మరోసారి ఆయనకు కలిసొచ్చింది. ఎంపీపీ పదవి బీసీ మహిళకు రిజర్వ్ కావడంతో అటు పార్టీశ్రేణులు, ఇటు ప్రజల సూచనతో తన సతీమణిని రంగంలోకి దించి ఆమెను ఎంపీపీని చేసుకోగలిగారు.

చట్టసభల్లోకి ప్రవేశించేందుకు అనేక ప్రయత్నాలు

భార్య ఎంపీపీ అయ్యే నాటికే రాజకీయంగా ముం దుకు సాగాలన్న దృఢదీక్షతో ఉన్న కొండయ్య చట్టసభ ల్లోకి ప్రవేశించాలన్న ఆకాంక్షను పెంచుకున్నారు. కనిగిరి, కందుకూరు లాంటి నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేగా పోటీచేయాలని ప్రయత్నాలు చేశారు. పార్టీనుంచి అవకాశం లభించలేదు. 2009లో తొలిసారి ఆయన్ను ఒంగోలు లోక్‌సభ నుంచి తెలుగుదేశం పార్టీ రంగంలోకి దించింది. ఓటమి చవిచూసినా తన ఆకాంక్షకు అనుగుణంగా రాజకీయాల్లో ముందడుగు వేశారు. కొంతకాలం ప్రత్యక్ష రాజకీయాల్లో తనపాత్ర తగ్గినట్లు కనిపించినా తన ఆకాంక్షకు అనుగుణంగా ఇటు అసెంబ్లీ లేక పార్లమెంటుకు పోటీచేయాలన్న ప్రయత్నాలను మాత్రం విరమించలేదు. అయితే బీసీ వర్గ నాయకుడిగా రాజకీయాల్లో తనదైన ముద్రను కొనసాగించారు. అలాగే తెలుగుదేశం హయాంలో అధినేత చంద్రబాబు దృష్టిని ఆకర్షిస్తూనే ముందుకుసాగారు.

వైద్య, తాగునీటి రంగాలపై దృష్టి

పేద ప్రజలు అధికంగా ఉండటంతో చీరాల ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధికి తొలుత చర్యలు తీసుకున్నారు. అక్కడ ప్రభుత్వ వైద్యశాలను క్రిటికల్ కేర్ యూనిట్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రం మొత్తంగా ఇలా ఐదు ప్రభుత్వ వైద్యశాలలను అభివృద్ధి చేయాలని నిర్ణయించగా కొండయ్య చేసిన ప్రతిపాదన, ముఖ్యమంత్రిని పదేపదే కలవడం ద్వారా అందులో చీరాల వైద్యశాల ఎంపికయ్యేలా చేసుకున్నారు. గ్రామాలలో తాగునీటి సదుపాయాల అభివృద్ధికి జలజీవన్ మిషన్‌లో చీరాల రూరల్, వేటపాలెం మండలాలను చేర్పించగలిగారు. తద్వారా గ్రామాలలో ఇంటింటికీ మంచినీటి కొళాయి సౌకర్యం ఏర్పడబోతోంది. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని చీరాల సమీపంలోని 50 ఎకరాల విస్తీర్ణంలోని చెరువును రిజర్వాయర్‌గా అభివృద్ధి చేసి కృష్ణా జలాలు మళ్లింపు ద్వారా పూర్తిస్థాయి మంచినీటి సౌకర్యం కల్పించే లక్ష్యంగా ముందడుగు వేయబోతున్నట్లు తెలిపారు. అందుకుగాను రూ.140 కోట్ల వ్యయ అంచనాతో ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు తెలిపారు. ఓడరేవు ప్రాంతంలో సురక్షిత మంచినీటి పథకం కల్పనకు రూ.1.90 కోట్లతో కార్యక్రమాన్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఇవిగాక కుందేరు పరిధిలోని 400 ఎకరాల ప్రాంతంపై సర్వేకు కలెక్టర్‌తో మాట్లాడి చర్యలు తీసుకున్నారు. తదనుగుణంగా కుందేరు ప్రాంత అభివృద్ధిపై ప్రణాళిక రూపొందించే అవకాశం కనిపిస్తోంది.

పెత్తనం కాదు.. సేవ చేస్తున్నా..

- కక్షలు, కార్పణ్యాలు, వేధింపులకు ఫుల్‌స్టాప్
- మౌలిక సౌకర్యాలతోపాటు శాశ్వత అభివృద్ధి పథకాలపై దృష్టి
- నిత్యం అందుబాటులో ఉండేందుకే కుమారులు
- పదవులన్నీ పార్టీ శ్రేణులకే
- నా తొలి అడుగు సంతృప్తికరం
- 'ఆంధ్రజ్యోతి'తో చీరాల ఎమ్మెల్యే కొండయ్య



వివరాలు 4వ పేజీలో

చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా ప్రత్యేక సంచిక

మునిసిపల్ ఆఫీసా.. రాజకీయ పార్టీ కార్యాలయమా?

ఆ పరిస్థితితోనే మునిసిపల్ పాలకవర్గంపై దృష్టి

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

శాసనసభ్యుడిగా ఎన్నికైన తర్వాత పార్టీ ఫిరాయింపు రాజకీయాలకు దూరంగా నడక సాగిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య అకస్మాత్తుగా మున్సిపల్ పాలకవర్గంపై దృష్టి సారించారు. రానున్నరోజుల్లో జరగనున్న పురపాలక ఎన్నికలపైన దృష్టిపెట్టిన ఆయన పాలన, రాజకీయపరంగా ఎదురైన కొన్ని సంఘటనలను దృష్టిలో ఉంచుకుని పాలకవర్గాన్ని దక్కించుకునే దిశగా అడుగులేశారు. అప్పటికి వైసీపీ చేతిలో పాలకవర్గం ఉంది. మునిసిపాలిటీలో అభివృద్ధి పనులకు సంబంధించిన కొన్ని అంశాలలో పాలకవర్గం నుంచి ఆయనకు ఎదురుదెబ్బలు తగిలాయి. ఆయన ప్రవేశపెట్టిన అభివృద్ధి పనుల ప్రతిపాదనలకు పాలకవర్గంలో తిరస్కరణలు ఎదురయ్యాయి. దీంతో పాలకవర్గం పెత్తనంలో ఉన్న వైసీపీ నేతలతో సంప్రదింపులు జరపడం ప్రారంభించారు. ఆ సందర్భంగా మునిసిపల్ కార్యాలయానికి వెళ్లి వచ్చే సందర్భాలలో అక్కడి పరిస్థితులను గమనించారు. చైర్మన్ చాంబర్, ఆవరణలో రాజకీయ వాతావరణం ఇబ్బందిగా ఉండటాన్ని గమనించారు. అధికారం కోల్పోయిన వైసీపీ నాయకులు అతిథి గృహాలు, ఇతరచోట్ల మకాం వేసే అవకాశం లేక మునిసిపల్ కార్యాలయాన్నే వేదికగా మార్చుకున్నారు. దీన్ని గమనించిన ఎమ్మెల్యే కొండయ్య రాజకీయ నాయకుల రాకపోకలను, చైర్మన్ చాంబర్‌లో వైసీపీ నాయకుల సమావేశాలను నిరోధించాలని అధికారులకు సూచించారు. అయితే పాలకవర్గం వైసీపీ ఏలుబడిలో ఉండటంతో కొండయ్య సూచనలను అధికారులు అమలు చేయలేకపోయారు. దీంతో పాలకవర్గం మార్పుపై దృష్టి సారించిన కొండయ్య వైసీపీలో కౌన్సిలర్లుగా గెలుపొందిన పూర్వకాలపు టీడీపీ అభిమానులను, అసంతృప్తితో ఉన్న కౌన్సిలర్లను తనవైపు తిప్పుకోగలిగారు. దానికితోడు మాజీ ఎమ్మెల్యే ఆమంచి వర్గానికి చెందిన కౌన్సిలర్లు వైసీపీ ఏలుబడిలోని పాలకవర్గంపై అసంతృప్తితో ఉన్నారు. దీంతో అభివృద్ధి సాధనకు పాలకవర్గం నుంచి సహకారం అవసరమన్న అభిప్రాయాన్ని అందరి దృష్టికి తీసుకెళ్లి వైసీపీకి చెందిన మునిసిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టి విజయం సాధించారు. ఆసందర్భంగా రాజకీయ చతురతను కూడా వినియోగించారు. వైసీపీలో ఉన్న చైర్మన్‌ను సైతం పార్టీలో చేర్చుకున్నా కౌన్సిలర్ల అభిప్రాయాలు, భవిష్యత్తు రాజకీయ అవసరాలను దృష్టిలో ఉంచుకుని చైర్మన్‌ను పదవీచ్యుతుడిని చేయగలిగారు. గత ఎన్నికల నుంచి కూటమికి సహకరించిన పూర్వరోజుల్లో టీడీపీలో పయనించిన వారిలో ఒకరిని చైర్మన్‌ను చేసే దిశగా అడుగులేస్తున్నారు. రెండు వర్గాలకు చెందిన ఇద్దరు కౌన్సిలర్లలో ఒకరిని ఎంపిక చేసుకుని వారిద్దరినీ సమన్వయంచేసి అందులో ఒకరిని రేపోమాపో చైర్మన్ స్థానంలో కూర్చోబెట్టే ప్రణాళికను రూపొందించారు. సౌమ్యుడైన రాజకీయ నాయకుడిగా భావించిన నియోజకవర్గంలోని రాజకీయ విశ్లేషకులు, చివరికి ప్రత్యర్థిపార్టీల నాయకులు కూడా ఆశ్చర్యపడేలా మునిసిపల్ పాలకవర్గాన్ని కూటమి ప్రభుత్వం గుప్పిట్లోకి రాబట్టుకోగలగడం విశేషం. నియోజకవర్గంలో తన రాజకీయ సుస్థిరతకు ఈమార్పు కూడా దోహదపడింది.



పల్లెకు పండుగ

- ఏడాదిలో భారీగా సీసీ రహదారుల నిర్మాణం
- చీరాల మండలంలో రూ.2.70 కోట్లతో 54 రోడ్లు
- వేటపాలెంలో రూ.2.74 కోట్లతో 43 చోట్ల పనులు

చీరాల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గ్రామీణ ప్రాంతాలకు మహర్దశ పట్టింది. పల్లె పండుగ కార్యక్రమం కింద రోడ్ల నిర్మాణానికి భారీగా నిధులు మంజూరు చేయడంతో రహదారి కష్టాలు తీరుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య భారీగా నిధులు తీసుకువచ్చి చీరాల నియోజకవర్గంలోని రోడ్ల రూపురేఖలు మారుస్తున్నారు. దాదాపుగా రూ.5.14 కోట్లతో రోడ్ల నిర్మాణం పూర్తి చేయించి ప్రారంభోత్సవాలు చేశారు. గత ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి, అరకొర నిర్మాణాలతో విసిగిపోయిన ప్రజలు ఈ రోడ్ల పూర్తితో చాలా వరకు ఆనందంగా ఉన్నారు. చీరాల మండలంలో 54 సీసీ రోడ్లకు గాను రూ.2.70 కోట్లు మంజూరయ్యాయి. వాటిలో ఇప్పటికే 35 పనులు పూర్తయియ్యాయి. వేటపాలెం మండలంలో 43 సీసీ రోడ్లుకు సంబంధించి రూ.2.74 కోట్లు మంజూరు కాగా వాటిల్లో ఇప్పటికే 29 పనులు పూర్తయి ప్రారంభోత్సవాలు జరిగాయి. అదనంగా మరో 18 సీసీ రోడ్ల నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు పంపడం విశేషం.


సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య (ఫైల్)

ఏరియా ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ యూనిట్

- రూ.23.75 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం

చీరాల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : చీరాల ఏరియా వైద్యశాల గతంలో 30 పడకల ఆసుపత్రిగా ఉండేది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 100 పడకలకు పెంచారు. ఉప్పుగుండూరు, మార్టూరు, పర్చూరు. ఇంకొల్లు, కారంచేడు, చినగంజాం, వేటపాలెం, చీరాల, బాపట్ల ప్రజలు సైతం ఇక్కడికి వచ్చి వైద్యం చేయించుకుంటున్నారు. నిత్యం సుమారు 350 నుంచి 450 వరకు ఓపీలు ఉంటాయి. మరోవైపు జాతీయ రహదారితోపాటు సర్వీసు రోడ్డులో జరిగే రోడ్డు ప్రమాదాలు కోకొల్లలు. అయితే మేజర్ శస్త్ర చికిత్సలకు వసతులు లేక, గర్భిణులు కాస్త సమస్యాత్మకమైన చికిత్సలు అందక నిత్యం ఒంగోలు, గుంటూరు వంటి ప్రాంతాలకు వెళ్తున్నారు. ఈక్రమంలో వైద్యం అందడంలో ఆలస్యమై ఎంతోమంది అసువులు బాశారు. మిగిలిన వారు ప్రైవేటు వైద్యశాలల్లో చేరి లక్షలు ఖర్చుచేయలేక అల్లాడుతున్నారు. ఈవిషయాన్ని గుర్తించిన ఎమ్మెల్యే కొండయ్య చీరాలకు క్రిటికల్ కేర్ యూనిట్‌ను మంజూరు చేయించారు. ఇటీవల ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్రంలో 5 క్రిటికల్ కేర్ యూనిట్‌ల ఏర్పాటుకు సిద్ధం కాగా, చీరాలలో పరిస్థితిని సీఎంకు వివరించి పట్టుబట్టి మరీ చీరాలకు ఒకదాన్ని ఎమ్మెల్యే తీసుకువచ్చారు. అందుకు సంబంధించిన నిధులు రూ.23.75 కోట్లు మంజూరయ్యాయి. దీని వలన నూతనంగా మరో 50 బెడ్లు ఏర్పాటు కావడంతోపాటు, అత్యాధునిక శస్త్ర చికిత్సలు చీరాలలోనే జరుగనున్నాయి. దీంతో ఇకపై నాణ్యమైన వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగానే కార్పొరేట్ స్థాయిలో ప్రజలకు వైద్యం అందుతుంది.


సీఎం చంద్రబాబును కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య (ఫైల్)


చీరాలలో డ్రెయిన్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య (ఫైల్)

దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం

- వార్డుల్లో రూ.65 లక్షలతో డ్రెయిన్‌లకు మరమ్మతులు
- రోడ్లు, కాలువల నిర్మాణానికి మరో రూ.3.76 కోట్లు
- కుందేరు ఆధునికీకరణకు రూ.89.72 కోట్లతో ప్రతిపాదనలు

చీరాల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : కాలువల్లో ఎక్కడి మురుగు అక్కడే నిలిచి దుర్గంధం. కొద్దిపాటి వర్షం కురిసినా ప్రవాహం ముందుకు సాగలేక రోడ్లపై మురుగు చేరి దుర్గంధం. దోమలతో సహవాసం. ఇదీ ఏడాది క్రితం వరకూ చీరాల పట్టణ ప్రజల పరిస్థితి. కానీ ఎమ్మెల్యే ఎం.ఎం. కొండయ్య ప్రత్యేక ప్రణాళికతో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. రూ.65 లక్షలు మంజూరు చేయించి డ్రెయిన్‌ల మరమ్మతులతోపాటు కాలువల్లో పూడికతీతపై ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో మసీదు సెంటర్‌లోని ప్రధాన డ్రెయిన్ మురుగుతో అస్తవ్యస్తంగా మారి పట్టణంలో దుకాణాలు, ఆఖరికి మసీదు సెంటర్, సెయింట్ మార్క్స్ లూథరన్ చర్చి ప్రాంగణంలో సైతం మురుగు చేరుతూ ప్రజలు పడుతున్న ఇబ్బందులు తీరాయి. త్వరలో 15వ ఆర్థిక సంఘం నిధులతో 20 సీసీ రోడ్లు ఏర్పాటు చేయనున్నారు. శిథిలదశకు చేరిన ప్రాంతంలో డ్రయిన్‌ల నిర్మాణాలు చేపట్టనున్నారు. సుదీర్ఘంగా ఆక్రమణల చెరలో చిక్కి బక్క చిక్కిన కుందేరు అభివృద్ధికి ఎమ్మెల్యే కొండయ్య కంకణం కట్టుకున్నారు. ఆక్రమణలు తొలగించి ఆధునీకరణకు రూ.89.72 కోట్లకు ప్రతిపాదనలు తయారు చేయించి ప్రభుత్వానికి పంపారు.

తాగునీటి కష్టాలకు చెక్

రూ.10కోట్లతో ఇంటింటికీ మంచినీటి కొళాయి

చీరాల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ప్రజల తాగునీటి కష్టాలకు చెక్ పడనుంది. ఇప్పటి వరకూ ఎండాకాలం, వానా కాలం అన్న తేడా లేకుండా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో నిత్యం తాగునీటి ఎద్దడి ఉంది. అందులోనూ వాడరేవు, విజయలక్ష్మీపురం, గవినివారిపాలెం, నక్కలవారిపాలెం, దేవినూతల, వేటపాలెం పరిధిలో పొట్టి సుబ్బయ్యపాలెం, రామన్నపేట, కఠారిపాలెం, పాపాయిపాలెం, కీర్తివారిపాలెం, పుల్లరిపాలెం ప్రాంతాల వాసులు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. ఇక మునిసిపాలిటీలో నిత్యం కొమ్మమూరు నుంచి ప్రధాన పైప్‌లైన్‌లకు లీకులు ఏర్పడి ప్రజలు తాగునీటి సమస్య ఎదుర్కొంటున్నారు. ఈనేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎమ్మెల్యే కొండయ్య నడుం బిగించారు. జల జీవన్ మిషన్ ద్వారా ఏకంగా రూ.10 కోట్లు మంజూరు చేయించారు. ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయి ఏర్పాటు చేస్తున్నారు. అందుకు సంబంధించిన పనులు శరవేగంగా సాగుతున్నాయి. దీంతో నియోజకవర్గ ప్రజలకు తాగునీటి కష్టాలు తీరనున్నాయి.


గజ ఈతగాళ్లకు సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే కొండయ్య (ఫైల్)

పర్యాటకంపై కొండయ్య ప్రత్యేక దృష్టి

- గజ ఈతగాళ్ల ఏర్పాటుతో పూర్తి రక్షణ

గతంలో బీచ్‌లో వరుస మరణాలతో పర్యాటకులు భీతిల్లారు. ఒక దశలో అధికారులు సైతం బీచ్‌ను మూసేశారు. సమస్యపై తనదైన శైలిలో ఆలోచన చేసిన ఎమ్మెల్యే కొండయ్య పర్యాటకుల రక్షణకు శ్రీకారం చుట్టారు. రిసార్ట్స్ నిర్వాహకులు, అధికారులతో పలుమార్లు సమావేశాలు నిర్వహించారు. పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సంతోషంగా తిరిగి వెళ్లేలా చూడాలని సూచించారు. అలాగే ప్రమాదాలను అరికట్టేందుకు హెచ్చరిక బోర్డులతోపాటు, రిసార్ట్స్ నిర్వాహకుల సహకారంతో గజ ఈతగాళ్లను నియమించారు. పర్యాటకుల క్షేమమే లక్ష్యంగా, తీరం అభివృద్ధే పరమావధిగా ముందుకు సాగారు. దీంతో పూర్తిస్థాయిలో తీరంలో మరణాలకు అడ్డుకట్ట పడింది.

అన్నదాతలకు అండ

ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు రూ.5.60 కోట్లు మంజూరు

చీరాల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) :నియోజకవర్గంలో చేనేత తరువాత వ్యవసాయ రంగంపై ఆధారపడిన వారు అధికంగా ఉన్నారు. ఏటా ఖరీఫ్‌లో వరి, వేరుశనగ, మొక్కజొన్న ప్రధాన పంటలుగా రైతులు సాగు చేస్తారు. గవినివారిపాలెం, తోటవారిపాలెం, అక్కయ్యపాలెంలో మూడు ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. కానీ గత పాలకుల నిర్లక్ష్యంతో అవి సక్రమంగా నడవడం లేదు. పూర్తిస్థాయి మరమ్మతులు చేయకపోవడంతో ఆయకట్టు రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈవిషయాన్ని గుర్తించిన ఎమ్మెల్యే కొండయ్య వాటి మరమ్మతులకు రూ.5.60 కోట్లు మంజూరు చేయించారు. చీరాలలో ఇరిగేషన్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.1.70 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.


విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య (ఫైల్)

విద్యుత్ సమస్యలకు పరిష్కారం

చీరాల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ అంతరాయంతో రాత్రింబవళ్లు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అయితే ఏడాది పాలనలోనే సమస్యలను గుర్తించిన ఎమ్మెల్యే కొండయ్య రూ.2 కోట్లతో మునిసిపల్ పరిధిలోని గంజిపాలెంలో1, దండుబాటలో మరొకటి పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేయించారు. అంతేకాకుండా పలుచోట్ల అదనంగా రూ.60 లక్షలతో 6 ట్రాన్స్‌ఫార్మర్‌లను ఇటీవలే అమర్చారు. విద్యుత్ శాఖ కార్యాలయం, జీప్లస్ 2 భవనం, చీరాల ఆపరేషన్ సర్కిల్ కార్యాలయానికి సంబంధించిన రూ.4.11 కోట్లతో ఇటీవలే ప్రారంభోత్సవాలు చేశారు. టెండర్‌లు త్వరలో జరుగనున్నాయి.


పొదుపు సంఘాల మహిళలకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య (ఫైల్)

పీ4 ద్వారా పొదుపు సంఘాల మహిళలకు పెద్దపీట

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ4 ప్రణాళికతో ప్రతి పొదుపు మహిళను పారిశ్రామిక వేత్తగా తీర్చి దిద్దేందుకు ఎమ్మెల్యే కొండయ్య అడుగులు వేస్తున్నారు. ఈక్రమంలోనే బ్యాంకు లింకేజీ రుణ సాయంతో ఇప్పటి వరకు స్త్రీనిధి నుంచి చీరాల మండలానికి రూ.91.75 కోట్లు, వేటపాలెం మండలానికి రూ.95.11 కోట్లు, అలాగే పట్టణ పేదరిక నిర్మూలన (మెప్మా) సంఘాలకు ముద్ర, పీఎంఏజీవై పథకాల ద్వారా రూ.59.10 కోట్లు అందజేశారు. దీంతో మహిళలు చిన్న,పెద్ద తరహా యూనిట్‌లు ఏర్పాటు చేసుకుని ఆయా కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారు.



ఇద్దరు కుమారులతో కలిసి అభివాదం చేస్తున్న కొండయ్య (ఫైల్)



సీఎం రిలీఫ్ ఫండ్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య (ఫైల్)

ఆర్వోబీలు, పలు రోడ్లకు నిధులు

చీరాల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : నియోజక వర్గంలో పలుచోట్ల ఆర్వోబీలు లేక ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈక్రమంలో స్థానికులు ఎమ్మెల్యే కొండయ్యకు సమస్యను వివరించారు. వెంటనే స్పందించిన ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడారు. సేతు బంధన్ పథకం ద్వారా చీరాల వైకుంఠపురం గేటు వద్ద ఆర్వోబీ ఏర్పాటుకు అనుమతి తెచ్చారు. అందుకు సంబంధించిన నిధులు కూడా ఇప్పటికే మంజూరయ్యాయి. అలాగే వాడరేవు నుంచి బాపట్ల మండలం వెదుళ్లపల్లికి వెళ్లే మార్గంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.15 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. అయితే ఇప్పటికే డీఎంఎఫ్టీ నుంచి రూ.2.37 కోట్లు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించాల్సి ఉంది. జాండ్రపేట - వేటపాలెం మధ్య ఉన్న మైనర్ బ్రిడ్జి పునర్నిర్మాణానికి 16వ ఆర్థిక సంఘం నిధులతో రూ.1.50 కోట్లకు ప్రతిపాదనలు పంపించారు. అలాగే పాపాయిపాలెం నుంచి సముద్రతీరం వరకూ బీటీ రోడ్డు నిర్మాణం నిమిత్తం రూ.1.80 కోట్లకు ప్రతిపాదనలు పంపారు. చీరాల-కారంచేడు ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి బోయినవారిపాలెం వరకు రోడ్డు మరమ్మతులకు రూ.2 కోట్లు మంజూరయ్యాయి. పనులు శరవేగంగా జరుగుతున్నాయి. చీరాల - వాడరేవు ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి బుర్లవారిపాలెం వరకు వయా వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాల రోడ్డు మరమ్మతులకు రూ.కోటితో పనులు ప్రారంభమయ్యాయి. వాడరేవు నుంచి పొట్టిసుబ్బయ్యపాలెం వరకు 2వ లైను అభివృద్ధికి సంబంధించి రూ.8 కోట్లు మంజూరు కాగా పనులు జరుగుతున్నాయి. రామాపురం నుంచి అక్కయ్యపాలెం, కఠారిపాలెం, అబ్దుల్ కలామ్‌కాలనీ మీదుగా బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1.15 కోట్లు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించాల్సి ఉంది.



యువనాయకుడు గౌరీఅమర్నాథ్‌తో కలిసి వాడరేవులో ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న కొండయ్య (ఫైల్)

అత్యవసర వైద్యం అవసరమైన వారికి అండదండలు

ఆరోగ్య సమస్యలతో వైద్యశాలల్లో చేరి చికిత్స పొందుతున్న ఆయా కుటుంబాలకు కూటమి ప్రభుత్వం సహకారంతో ఎమ్మెల్యే అండదండలు అందిస్తున్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా చికిత్స పొందిన ప్రతి ఒక్కరికీ చెక్కులు పంపిణీ చేస్తున్నారు. మునుపెన్నడూ లేని విధంగా గడచిన ఏడాది కాలంలోనే సుమారు 150 మంది పేదలకు రూ.2.60 కోట్ల మేర సీఎంఆర్ఎఫ్ అందజేశారు. మరో రూ.5 కోట్లకు సిఫారసు చేశారు. వారికి కూడా త్వరలోనే నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది. తద్వారా హాస్పిటల్లో చేరి అప్పుల ఊబిలో కూరుకుపోతున్న పేద కుటుంబాలకు ఎమ్మెల్యే కొండయ్య కొండంత అండగా నిలుస్తున్నారు.

ఫలించిన నేతన్నల చిరకాల స్వప్నం

చీరాల కుప్పడం చీరకు జాతీయస్థాయిలో గుర్తింపు

చీరాల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : వారంతా చేనేతలు. వృత్తినే నమ్ముకుని సంప్రదాయ మగ్గాలపై చీరలు నేస్తూ గుర్తింపు కోసం మూడు దశాబ్దాలుగా ప్రయాస పడుతూనే ఉన్నారు. కానీ పూటగడవక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఒకే జిల్లా, ఒకే ఉత్పత్తి (ఓడీఓపీ) విధానంతో జాతీయ గుర్తింపును అందించింది. స్థానిక శాసనసభ్యుడు ఎంఎం కొండయ్య నేతన్నలు నేసిన చీరను, అందుకు సంబంధించిన నాణ్యతను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, జౌళిశాఖ మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి చీరాల చీర ప్రాధాన్యతను కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. ఈక్రమంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గత జనవరి 9న కేంద్ర బృందం సభ్యులు ఇష్‌దీప్, డాక్టర్ దివ్యడింగ్రా క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. అనంతరం చీరాల కుప్పడం చీరకు జాతీయ స్థాయిలో గుర్తింపు కల్పిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. గతంలో జీఎస్టీ, నూలు ధరలు పెరిగి నేతన్నలు పడిన కష్టం వర్ణనాతీతం. ఇతర ప్రాంతాల్లోని వేర్వేరు చీరలకు సంబంధించి ఏదో ఒక గుర్తింపు లభిస్తూనే ఉంది. కానీ గాంధీజీ సహాయంతో విదేశీ వస్త్రాలను సైతం వ్యతిరేకించి ఉద్యమించిన చీరాల చీరకు ప్రాధాన్యం లభించకపోవడంతో డీలాపడ్డారు. అయితే కూటమి ప్రభుత్వం సహకారంతో స్థానిక శాసనసభ్యుడు కొండయ్య చీరాల కుప్పడంకు చరిత్ర పుటల్లో లిఖించే గుర్తింపు తెచ్చి పెట్టారు. దీంతో మార్కెటింగ్... తద్వారా ఉపాధి అవకాశాలు మరింత పెరుగనున్నాయి. చీరాల చేనేతలకు ఎనలేని గుర్తింపును అందించిన కొండన్నకు ప్రజలు నీరాజనాలు పడుతున్నారు.



చీరాల కుప్పడంకు ప్రాధాన్యం కల్పించాలని మంత్రి సవితను కోరుతున్న ఎమ్మెల్యే కొండయ్య (ఫైల్)

పెత్తనం కాదు.. సేవ చేస్తున్నా..



ఒంగోలు, జూన్ (ఆంధ్రజ్యోతి) : 'ప్రజలపై పెత్తనం కోసం కాదు, సేవ కోసం వచ్చా. అదే చేస్తున్నా. కక్షలు కార్పణ్యాలు వేధింపులు లేకుండా నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణాన్ని కల్పించా. మౌలిక సౌకర్యాలు కల్పిస్తూ శాశ్వత అభివృద్ధి పథకాలపై ప్రత్యేక దృష్టి సారించా. ఈక్రమంలో నా తొలి అడుగు సంతృప్తికరంగా సాగించా' అని చీరాల శాసనసభ్యుడు మద్దులూరి మాలకొండయ్య స్పష్టం చేశారు. ఎమ్మెల్యేగా ఎన్నికై ఏడాది పూర్తయిన సందర్భంగా శనివారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలపై ఆయన మాట్లాడారు. ఒక ప్రశ్నకు బదులుగా తాను రాజకీయంగా సౌమ్యుడినే కానీ, అవసరమైతే దేనికీ వెనుకాడబోనన్నారు. నియోజకవర్గంలో రాజకీయ ప్రశాంతత ఏర్పరచాలన్న లక్ష్యంతో ఓర్పు, నేర్పుతో ముందుకు సాగుతున్నానని చెప్పారు. కక్ష సాధింపులు, వేధింపులు, ఆక్రమణలు, అధికారిక బెదిరింపులు లేని పాలనను ఈ ఏడాదిలో అందించినట్లు చెప్పారు. అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉండేందుకే తన కుమారులను ప్రజల కోసం పని చేయిస్తున్నానే తప్ప రాజకీయ వారసత్వం కోసం కాదని స్పష్టం చేశారు. సచివాలయంలోనో ఇతరత్రా రాజకీయ పనుల మీదో... అంతో ఇంతో వ్యాపార పనుల మీదో తాను బయటకు వెళ్లినప్పుడు కూడా నియోజకవర్గ ప్రజలకు తన తరపున అందుబాటులో ఉండేందుకే కుమారులు రాజకీయంగా పని చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది మొత్తంగా తాను అందుబాటులోలేని రోజులు కుమారులు ఉండి ప్రజా అవసరాలు తీరుస్తూ పని చేశారన్నారు.

వచ్చే ఎన్నికల్లో నేనే పోటీ చేస్తా

వచ్చే ఎన్నికల్లోనూ తానే పోటీ చేస్తానని ఎమ్మెల్యే కొండయ్య స్పష్టం చేశారు. తన తొలి ఏడాది పాలన సంతృప్తినిచ్చిందని చెప్పారు. 'ఇటు పట్టణంలో, అటు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇచ్చా. గ్రామాల్లో రూ.15 కోట్లకు పైగా వెచ్చించి రోడ్ల నిర్మాణాలు చేపట్టాం. చాలా వరకు పూర్తి చేశాం. రెండు మూడు దశాబ్దాలుగా ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రజలు తిరిగినా వేయని రోడ్లను పూర్తి చేశాను. అందుకు సాల్మన్ సెంటర్‌లో వేసిన ఒక్క రోడ్డు ప్రత్యక్ష ఉదాహరణ' అని కొండయ్య చెప్పారు. ఇలాంటివి పలు గ్రామాల్లో అనేకం ఉన్నాయన్నారు.

మునిసిపాలిటీలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రణాళిక

మునిసిపాలిటీలోని 33 వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళిక రూపొందించినట్లు కొండయ్య చెప్పారు. ఇప్పటికే జరిగిన పనులను పక్కన పెడితే డ్రెయినేజీ శాశ్వతాభివృద్ధికి, ప్రతి వీధిలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి, అన్ని ప్రాంతాల్లో తాగునీటి పైపులైన్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి, పురపాలక శాఖ మంత్రి నారాయణతో సహా పలువురు అధికారులను కలిసి ఆ పనులపై చర్చించడం జరిగిందన్నారు. ప్రాధాన్యతా క్రమంలో పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇప్పటికే చేపట్టిన కార్యక్రమాలు, చర్యల వల్ల పర్యాటకుల రాకపోకలు పెరిగాయన్నారు. వారి రాకపోకలు అధికమయ్యే కొద్దీ స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. విశాఖ తరహాలో తీర ప్రాంత బీచ్ అభివృద్ధికి ప్రణాళిక రూపొందించి ఇప్పటికే కొన్ని కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. 'దళిత, బడుగు, బలహీనవర్గాలతోపాటు పేద ప్రజలు ఉన్న నియోజకవర్గాల్లో బహుశా తొలిది మాదే. అందుకే ఆయా వర్గాల వారి ప్రజల ఆర్థిక అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకుని శాశ్వత అభివృద్ధి సాధనకు కార్యాచరణ రూపొందించా. అవన్నీ సాధించడం కష్టంతో కూడుకున్న పనే. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో సాధించగలనన్న నమ్మకం ఉంది' అని కొండయ్య చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మా యువనాయకుడు నారా లోకేష్‌లు ఈ కార్యాచరణ సాధనకు పూర్తిగా సహకరిస్తామని హామీ ఇచ్చారని కొండయ్య చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్ ఏర్పాటు చేయాలన్నా బలమైన ఆలోచనతో ఉన్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ఆయా వర్గాలు, ఆయా వృత్తుల్లో ఉన్న పేద యువతీ యువకులను ఆయా రంగాల్లో సమర్థులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఆ కేంద్రం ఏర్పాటుపై దృష్టి పెట్టినట్లు తెలిపారు. భవిష్యత్తులో నియోజకవర్గంలో హ్యాండ్‌లూమ్ పార్క్, జీడిపప్పు ప్రాసెసింగ్ పార్క్, మత్స్యకారులకు కోసం ఫిషింగ్ హార్బర్, సీఫుడ్ ప్రాసెసింగ్ లాంటి వాటిని సాధించి తర్ఫీదు పొందిన యువతీయువకులకు మంచి ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ఆలోచనతో ఉన్నట్లు కొండయ్య ఇంకో ప్రశ్నకు బదులుగా ఇవి సాధించడం అంత ఈజీ కాదన్నారు. కానీ కూటమి ప్రభుత్వాలే అధికారంలో ఉన్నందున తనవంతు ప్రయత్నం ద్వారా ఎంతోకొంత పురోభివృద్ధి సాధించగలనన్న విశ్వాసంతో ఉన్నట్లు తెలిపారు.

పార్టీ కోసం పనిచేసే వారికే పదవులు

పార్టీ వ్యవహారాలను కొండయ్య ప్రస్తావిస్తూ.. ఆది నుంచి పార్టీ కోసం పనిచేసిన వారికే పదవులు దక్కాయన్న విషయాన్ని గుర్తించాలన్నారు. ఇప్పటి వరకు ఇచ్చిన ముఖ్యమైన పదవులన్నీ టీడీపీలో తొలి నుంచి ఉండి కష్టపడిన వారికే దక్కాయన్నారు. దీని వలన శ్రేణులకు పార్టీ ఇస్తున్న ప్రాధాన్యాన్ని అర్థం చేసుకోవచ్చన్నారు. విధిలేని పరిస్థితుల్లోనే కౌన్సిలర్‌లను వేరే పార్టీ నుంచి చేర్చుకుని మునిసిపాలిటీలో టీడీపీ జెండా ఎగిరే విధంగా చేయాల్సి వచ్చిందని తెలిపారు. ఇంకో ప్రశ్నకు బదులుగా మునిసిపల్ చైర్మన్‌ను తానేమీ మోసం చేయలేదన్నారు. 'ఆయన పార్టీలోకి వస్తామంటే చేర్చుకున్నాం. అదే సమయంలో పార్టీ శ్రేణుల భవిష్యత్తు, అభివృద్ధి అవసరాలకు అనుగుణంగా అవిశ్వాస తీర్మానంతో ఆయన్ని తొలగించాం. రేపు ఎవరి ద్వారా ప్రజలకు, పార్టీకి మేలు జరుగుతుందో వారినే చైర్మన్‌ను చేస్తాం' అని కొండయ్య స్పష్టం చేశారు.

తీరంలో పారిశుధ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు



తెలంగాణ నుంచి ఇప్పటికే కుటుంబసమేతంగా పలుమార్లు తీరానికి వచ్చాం. ఈసారి తీరం చాలా పరిశుభ్రంగా ఉంది. పోలీసుల పర్యవేక్షణ, గజ ఈతగాళ్ల పరిశీలన చాల మంచిగా అనిపించింది.

- నిర్మల, హైదారాబాద్, పర్యాటకురాలు

అన్న క్యాంటీన్‌తో ఆనందం వచ్చింది



అంతకుమునుపు టీడీపీ హయాంలో బాడుగలు ఉన్నా లేకపోయిన రూ.5కే నాణ్యమైన భోజనం చేశాం. కానీ వైసీపీ హయాంలో పూర్తిగా క్యాంటీన్‌లు మూసి సచివాలయం నడిపారు. ఈ సమయంలో కడుపు నింపుకునేందుకు నానా అవస్థలు పడ్డాం. ఈ ప్రభుత్వంలో క్యాంటీన్‌కు పూర్వ వైభవం వచ్చింది.

- సత్యన్నారాయణ, రిక్షా పుల్లర్

అమృత్‌తో తాగునీటి సమస్యకు చెక్



మునిసిపల్ పరిధిలో ప్రజలకు తాగునీటి సమస్యల్లేకుండా చూస్తున్నాం. ఎక్కడయినా మరమ్మతులు ఉన్నా అనునిత్యం పర్యవేక్షిస్తున్నాం. ఈక్రమంలో చాలావరకు సమస్యలను పరిష్కరించాం. ఎమ్మెల్యే చొరవతో రాబోయే 30 ఏళ్లను దృష్టిలో ఉంచుకుని అమృత్ పథకంలో భాగంగా రూ.23.08 కోట్లు మంజూరయ్యాయి. తద్వారా తాగునీటికి శాశ్వత పరిష్కారం దొరికింది.

- రఘురామ్, మునిసిపల్ డీఈ

పూట గడవడం కష్టంగా ఉండేది



గతంలో చేనేత రంగుల ధరలు పెరిగి పని కష్టంగా మారింది. నిత్యావసరాల ధరలు పెరిగి తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నాం. చేనేత రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ఈ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈక్రమంలోనే ఉచిత విద్యుత్‌ను ప్రకటించింది. చేనేత రంగ అభివృద్ధికి ఎమ్మెల్యే కొండయ్య ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. చాలా ఆనందంగా ఉంది.

- బొగ్గుల సువర్ణ, చేనేత కార్మికురాలు

నాణ్యమైన సేవలే లక్ష్యం



ఎమ్మెల్యే సహకారంతో ఇటీవల కాలంలో సుమారు రూ.5 కోట్ల నిధులతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు అమర్చాం. ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తున్నాం. నాణ్యమైన సేవలే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

- హరిప్రసాదరావు, విద్యుత్‌శాఖ డీఈఈ

మాట ఇచ్చారు.. నెరవేర్చారు



మాది వ్యవసాయ కుటుంబం. నా భర్త సుబ్బారెడ్డి రోజువారీ వ్యవసాయ కూలీ. ముగ్గురు బిడ్డలను చదివిస్తున్నాం. అయితే తినీతినక ఇబ్బందులు పడుతున్న మా కుటుంబానికి ఈ ప్రభుత్వంతో ఆసరా లభించింది. ఏకంగా ఇచ్చిన మాట ప్రకారం ఇంట్లోని ముగ్గురు బిడ్డలకు తల్లికి వందనం కింద ఒక్కొక్కరికీ రూ.13 వేలు చొప్పున రూ.39 వేలు నా బ్యాంకు ఖాతాలో జమ అయ్యింది.

- కుక్కల శిరీష, తల్లికి వందనం లబ్ధిదారురాలు

రైతు సమస్యలపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి



నియోజకవర్గంలో రైతులకు సంబంధించిన సమస్యలపై ఎమ్మెల్యే కొండయ్య ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ఈ క్రమంలో ఎత్తిపోతల మరమ్మతులు, కాలువల్లో పూడికతీత పనులు జరుగుతున్నాయి. సమస్యలను నేరుగా వ్యక్తపరచుకునే అవకాశం ఉంది.

- నక్కల లక్ష్మణ, గవినివారి పాలెం ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు

శక్తి యాప్‌తో మహిళలకు రక్షణ



మహిళలు, చిన్నారులు అని లేకుండా అఘాయిత్యాలు జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం సాకేతికపరమైన విధానంతో శక్తి యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. యాప్ ఇన్‌స్టాల్ చేసుకుని ఫోన్ షేక్ చేస్తేనే పోలీసులకు సమాచారం చేరుతుంది. ఇది అందరికీ ఉపయోగకరం.

- సుకీర్తన, ఈపూరుపాలెం


నాకు ఉపాధి.. ప్రజలకు రక్షణ



గతంలో తీరంలో వరుస మరణాలు సంభవించాయి. ఆ సమయంలో గ్రామాల్లో ఎమ్మెల్యే కొండయ్య ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఈ నేపథ్యంలోనే మత్స్యకార కుటుంబాలకు చెందిన కొంతమందిని గజఈతగాళ్లుగా నియమించారు. దీంతో పర్యాటకులకు నిత్య రక్షణ. మాకు ఉపాధి లభించింది. థాంక్యూ ఎమ్మెల్యే సార్..

- పోతురాజు, గజ ఈతగాడు

నవోదయం 2.0తో నేరస్థులకు చక్కని జీవితం



ఉపాధి లేక, తప్పని పరిస్థితుల్లో నేరాలకు అలవాటు పడి నాటుసారా, ఇతర రాష్ట్రం మందు విక్రయాలపై స్థానికంగా చాలామంది కేసుల బారిన పడ్డారు. ప్రభుత్వం నవోదయం 2.0 ద్వారా నేరస్థులకు ఉపాధి కల్పిస్తూ సత్ప్రవర్తన కలిగించే దిశగా అడుగులు వేస్తోంది.

- నాగేశ్వరరావు, ఎక్సైజ్ సీఐ

ఉష్ణోగ్రత (అంచనా)

15-6-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	35	28
తెనాలి	35	28
నరసరావుపేట	35	26
బాపట్ల	35	28
రెంటచింతల	36	26
చీరాల	35	28

ధాన్యం.. ధనమేది?

- రైతులకు రూ.25.33 కోట్లు బకాయి
- పల్నాడు, బాపట్ల జిల్లాల్లో అన్నదాతల ఆందోళన
- 24 గంటల్లో చెల్లింపులని.. నెల దాటినా అందని వైనం
- ఖరీఫ్ సాగుకు డబ్బు అందుతుందా లేదా అన్న ఆందోళన

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ముప్పాళ్ల మండలానికి చెందిన రైతు చలపతిరావు రైతు సేవా కేంద్రం ద్వారా 94.4 క్వింటాళ్ల ధాన్యం గత నెల 10న విక్రయించారు. ఇదే మండలానికి చెందిన కోటేశ్వరరావు 44 క్వింటాళ్లు, వెంకటేశ్వర్లు 6.4 క్వింటాళ్ల ధాన్యం 36 రోజుల క్రితం ధాన్యం విక్రయించారు. అయితే వీరి ముగ్గురి ఖాతాల్లో నేటికి ఒక్క రూపాయి కూడా నగదు జమ కాలేదు. వీరు ముగ్గురే కాదు పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఇలాంటి వారు వందల సంఖ్యలోనే ఉన్నారు. రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు 24 గంటల్లో నగదు చెల్లిస్తున్నామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్తున్నారు. అయితే ఆ మాటలు అమలుకు నోచుకోవడం లేదు. ధాన్యం విక్రయించి నెల దాటినా, నేటికీ చేతికి ధనం అందకపోవడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సాగు ప్రారంభమైంది. ఈ పరిస్థితుల్లో పెట్టుబడికి నగదు అందివ్వాలని రైతులు కోరుతున్నారు. ధాన్యం విక్రయించినా నగదు చేతికి అందకపోవడంతో అప్పులకు వడ్డీ పెరిగిపోతున్నదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ధాన్యం నిల్వలు

అన్నదాతల అయోమయం..

ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించి నగదు చెల్లింపులో జాప్యం జరిగితే న్యాయం కోసం రైతులు ప్రభుత్వాన్ని ఆశ్రయిస్తారు. అయితే ప్రభుత్వమే కొనుగోలు చేసి, చెల్లింపుల్లో జాప్యం చేస్తుండటంతో తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియని అయోమయ పరిస్థితుల్లో రైతులున్నారు. మద్దతు ధర లభిస్తుందనే ఆశతో వందలాది మంది రైతులు రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించారు. పల్నాడు జిల్లాలో 359 మంది రైతులకు రూ.6.33 కోట్లు, బాపట్ల జిల్లాలో 1200 మంది రైతులకు సుమారు రూ.19 కోట్లు చెల్లించాలి. ధాన్యం డబ్బు ఎప్పుడు వస్తుందో తెలుసుకునేందుకు రైతులు రైతు సేవా కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లపై పౌరసరఫరాల శాఖ డీఎం నారదమణిని వివరణ కోరగా ఎఫ్‌సీఐ నుంచి నిధులు విడుదలలో జాప్యం జరిగిందని, త్వరలోనే రైతుల ఖాతాల్లో నగదు జమవుతుందన్నారు.



డీసీఎంఎస్ చైర్మన్ హరిబాబు దంపతులను సత్కరిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యేలు పుల్లారావు, యార్లగడ్డ, మన్నవ మోహనకృష్ణ, తులసీ రామచంద్రప్రభు

కష్టపడే వారికే గుర్తింపు

- నామినేటెడ్ పదవుల్లో సిఫార్సులుండవ్
- జగన్‌లాంటి వ్యక్తులను రాకుండా చూసుకోవాలి
- 'తల్లికి వందనం' పథకంతో వైసీపీకి మరణ శాసనం
- క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నా ఒక్కొక్కటిగా హామీల అమలు
- డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం సత్కార సభలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

గుంటూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవుల్లో ఎవరి సిఫార్సులుండవని, కష్టించి పనిచేసిన కార్యకర్తలకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లు తప్పక గుర్తింపు ఇస్తారని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) చైర్మన్ వడ్రాణం హరిబాబునాయుడి అభినందన సభ స్థానిక ఏ కన్వెన్షన్ హాల్లో శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన పెమ్మసాని మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థికంగా క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నా ఇచ్చిన హామీల కోసం సీఎం చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు అమలు చేసిన 'తల్లికి వందనం' పథకం వైసీపీకి మరణ శాసనం లాంటిదన్నారు. సంక్షేమం, అభివృద్ధి అజెండాగా అహర్నిశలు కృషి చేస్తున్న చంద్రబాబు నాయకత్వం కావాలని, జగన్‌లాంటి విధ్వంసకారుడు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ పార్టీలో కష్టించి పనిచేసిన వారందరికీ పదవులు వస్తాయని, ఎవరూ నిరాశ చెందాల్సిన అవసరం లేదన్నారు.

డీసీసీబీలో దోపిడీ: గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ

వైసీపీ హయాంలో జిల్లా సహకార సెంట్రల్ బ్యాంకుల్లో ఆ పార్టీ నాయకులు పందికొక్కుల్లా దోచుకుతిన్నారని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావు ఆరోపించారు. డీసీసీబీలో జరిగిన అవినీతిని వెలికి తీస్తామని, అవినీతిపరులను వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. అనంతరం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్, డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, ఏపీ ఐటీ సంస్థ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, టీటీడీ సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, తులసీ గ్రూపు సంస్థల చైర్మన్ తులసీ రామచంద్రప్రభు, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, కూటమి నేతలు పాటిబండ్ల నాగేశ్వరరావు, తాడిశెట్టి మురళీమోహన్, తాళ్ల వెంకటేష్‌యాదవ్, గాదె వెంకటేశ్వరరావు, బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్, కన్నా రవిదేవరాజ్, కార్పొరేటర్లు హరిబాబును ఘనంగా సత్కరించారు.

రక్త నిల్వలను పెంచేందుకు కృషి

- రెడ్ క్రాస్‌ను వైసీపీ కలుషితం చేసిందంటూ వ్యాఖ్యలు
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

గుంటూరు(తూర్పు), జూన్ 14 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో రక్త నిల్వలను గణనీయంగా పెంచేందుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ తెలిపారు. ప్రపంచ రక్త దాతల దినోత్సవం పురస్కరించుకుని శనివారం గుంటూరులోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంస్థలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏడాదికి 5 లక్షల 33 వేల యూనిట్లు అవసరమని, ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలకు చెందిన బ్లడ్ బ్యాంకుల్లో దాదాపు 7 లక్షల యూనిట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. దానిని 10 లక్షలకు పెంచేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు చెప్పారు. రోజురోజుకి పెరుగుతున్న రక్తహీనత, క్యాన్సర్ వ్యాధులను దృష్టిలో పెట్టుకుని ఈ నిల్వలను మరింతగా పెంచాలన్నారు. రక్త సేకరణలో స్వచ్ఛంద సంస్థల పాత్ర అభినందనీయమన్నారు. ప్రతి ఏడాది అవసరమైన 5 లక్షల యూనిట్లలో 20 శాతం రెడ్ క్రాస్ ద్వారానే అందుతుందని చెప్పారు. అటువంటి రెడ్ క్రాస్‌ని గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా కలుషితం చేసిందన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

బియ్యాన్ని బొక్కేశారు



- ఎండీయూల దారి మళ్లింపు బట్టబయలు
- ప్రతీ నెలా గుంటూరులో 5 శాతం పక్కదారి
- బాపట్ల, పల్నాడు జిల్లాల్లో కనిపించని వ్యత్యాసం

గుంటూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్(ఎండీయూ) ఆపరేటర్ వ్యవస్థ ప్రతీ నెలా నాలుగు నుంచి ఐదు శాతం రేషన్ సరుకులను దారి మళ్లించేదన్న విషయం వెలుగులోకి వచ్చింది. ఎండీయూలను తొలగించి రేషన్ డీలర్ల ద్వారా తిరిగి సరుకుల పంపిణీ ప్రారంభించిన దృష్ట్యా ఈ నెల డిస్ట్రిబ్యూషన్ ఆదివారంతో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు జరిగిన పంపిణీ గణాంకాలను పరిశీలిస్తే పల్నాడు, బాపట్ల జిల్లాల్లో గతంలో ఎండీయూలు, ప్రస్తుతం డీలర్ల ద్వారా పంపిణీలో పెద్దగా వ్యత్యాసం కనిపించలేదు. గుంటూరులోనే దాదాపుగా ఐదు శాతం వరకు తక్కువగా కార్డుదారులకు సరుకుల పంపిణీ జరిగింది. దీనిని పరిగణనలోకి తీసుకుంటే ఆ ఐదు శాతం ఎండీయూలు కార్డుదారుల వద్దకే వెళ్లి ఈ-పోస్ యంత్రాల్లో వేలిముద్రలు వేయించి సరుకులు పక్కదారి పట్టించినట్లు అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఎండీయూల ద్వారా రేషన్ పంపిణీని వైసీపీ ప్రభుత్వం ప్రారంభించిందో ఆ నెల నుంచి గణనీయంగా పెరిగింది. గతంలో 87 నుంచి 88 శాతం మధ్య ఉండగాఎండీయూ వ్యవస్థ వచ్చిన తర్వాత ఒక్కసారిగా పంపిణీ శాతం 92 దాటిపోయింది. అదేమంటే తాము గడప గడపకు వెళ్లి సరుకులు ఇస్తున్నాం కాబట్టి అందరూ తీసుకొంటున్నారని బుకాయించేవారు. ఏ నెల చూసుకొన్నా గుంటూరులో ఇదే పరిస్థితి. ఇందుకు కారణం కార్డుదారులతో వేలిముద్రలు వేయించి బియ్యం కేజీకి లెక్కకట్టి నగదు చేతిలో పెట్టి ఆ బియ్యాన్ని నల్లబజారుకు తరలించి సొమ్ము చేసుకొనేవాళ్లని అర్థమవుతోంది. ఇప్పుడు రేషన్ డీలర్ల ద్వారా సరుకుల పంపిణీ జరుగుతుండటంతో బియ్యం అవసరం లేని వాళ్లు షాపులకు వెళ్లడం లేదు. ఈ కారణంగానే గుంటూరు జిల్లాలో పంపిణీ శాతం ఎండీయూ వ్యవస్థ అమల్లోకి రాక ముందు ఎంత శాతం ఉండేదో ఇప్పుడు కూడా అదే స్థితికి చేరుకున్నది. ఆదివారం మహా అయితే ఒక శాతం మించి సరుకులు తీసుకునే పరిస్థితి ఉండదు.

గత ఐదు నెలల్లో పంపిణీ శాతం ఇలా...

జిల్లా	కార్డుల సంఖ్య	ఫిబ్రవరి	మార్చి	ఏప్రిల్	మే	జూన్
గుంటూరు	589531	92.50	92.38	92.66	91.42	87.17
పల్నాడు	634893	88.08	86.39	86.21	85.98	85.87
బాపట్ల	476529	86.26	86.23	86.05	86.90	85.32

లక్ష్యం.. సాధించారు

- నీట్‌లో మెరిసిన గుంటూరు విద్యార్థులు
- పేదలకు మెరుగైన వైద్యం అందిస్తామంటున్న ర్యాంకర్లు

గుంటూరు(విద్య), జూన్ 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ కావడమే లక్ష్యంగా భావించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం.. అధ్యాపకుల సహకారంతో నీట్‌లో మెరిశారు. లక్ష్యం కోసం అకుంఠిత దీక్షతో కృషి చేసి లక్షల మంది పోటీ పడిన నీట్ పరీక్షలో మెరుగైన ఫలితాలు సాధించారు. మే 4న నీట్ పరీక్ష జరగ్గా అందుకు సంబంధించిన ఫలితాలను ఎన్‌టీఏ శనివారం విడుదల చేసింది. ఈ పరీక్షలో గుంటూరుకు చెందిన పలువురు విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. వివిధ విభాగాల్లో ర్యాంకులు సాధించిన కొంతమంది విద్యార్థులు తమ లక్ష్యాలను ఆంధ్రజ్యోతికి తెలిపారు.

పేదలకు డాక్టర్‌గా సేవ చేస్తా



వైద్య విద్య పూర్తి చేసి పేదలకు సేవ చేస్తాను. ఢిల్లీ ఎయిమ్స్‌లో సీటు సాధించి వైద్య విద్య పూర్తి చేస్తాను. అనంతరం న్యూరాలజీలో స్పెషలైజేషన్ చేయాలనేది లక్ష్యం. గుంటూరులోని భారత్‌పేటలో ఉంటాం. తల్లి విజయ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గణిత అధ్యాపకురాలు. తండ్రి భానుప్రకాశ్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడు.

- విక్రాంత్, 9వ ర్యాంకు(ఎస్సీ విభాగం)

రైతు కుమార్తె డాక్టర్



గుంటూరులోని దేవాపురంలో ఉంటాం. తండ్రి కృష్ణారెడ్డి రైతు. తల్లి సునీత గృహిణి. చిన్నప్పటి నుంచి తల్లిదండ్రులు డాక్టర్ కావాలని తనను ప్రోత్సహించారు. ర్యాంకు సాధనలో అధ్యాపకుల శిక్షణ ఎంతో ఉపయోగపడింది. పేదలకు సేవలు అందిస్తాను.

- నాగిరెడ్డి మనస్విని, 49వ ర్యాంకు(ఈడబ్ల్యూఎస్)

జిప్మర్‌లో సీటే లక్ష్యం



జిప్మర్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేయడమే లక్ష్యం. నీట్ పరీక్ష కోసం తల్లిదండ్రులు రెబా విద్య, రత్నాకర్ చేసిన కృషి మరువలేను. విదేశాల్లో ఉండే తల్లిదండ్రులు ఎన్నో త్యాగాలు చేసి తమ చదువు కోసం గుంటూరు వచ్చారు. వైద్య విద్య తర్వాత పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తాను.

- ఎస్పీ జడ్సన్, 108వ ర్యాంకు (ఎస్సీ విభాగం)

ఢిల్లీ ఎయిమ్స్‌లో చదవాలి



జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఢిల్లీ ఎయిమ్స్‌లో వైద్య విద్య పూర్తి చేస్తాను. ప్రకాశం జిల్లా యర్ర గొండపాలెం మాది. అయితే గుంటూరులో విద్యను అభ్యసించా. తల్లి తిరుపతీబాయ్ గృహిణి. తండ్రి ఏసానాయక్ గ్రామంలోనే ఉపాధ్యాయుడిగా పని చేస్తారు. ఎంబీబీఎస్ తర్వాత న్యూరో సర్జన్‌గా గ్రామీణ పేదలకు వైద్యం అందిస్తాను.

- ఆర్ తరుణ్‌కుమార్, 51వ ర్యాంకు (ఎస్టీ విభాగం)

చినతురకపాలెం విద్యార్థిని ప్రతిభ



నరసరావపేట టౌన్ : నీట్ ఫలితాలలో నరసరావు పేట మండలం చినతురకపాలేనికి చెందిన షేక్ నసీమా ఈడబ్ల్యూఎస్ కేటరిగిలో 80వ ర్యాంకు సాధించింది. 720 మార్కులకు 603 మార్కులు సాధించింది. నరసరావు పేటలో పదో తరగతి వరకు, ఇంటర్ గుంటూరులో చదివింది. తల్లిదండ్రులు షేక్ నబీసకినా, మహబూబ్‌సుభాని సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లుగా పని చేస్తారు.



కేర్ నాచరోపతి మెడికల్ వైద్యకళాశాల, కేర్ విద్యార్థులతో కలిసి కలెక్టర్ వెంకటమురళి ఆసనాలు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- యోగాంధ్రలో కలెక్టర్ వెంకటమురళి

పిట్టలవానిపాలెం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జీవితంలో యోగాను ఒక భాగం చేసుకోవాలని, దానితో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. శనివారం డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ ఆధ్వర్యంలో పిట్టలవానిపాలెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో యోగాంధ్ర జరిగింది. పిట్టలవానిపాలెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ఐలెండ్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కేర్ నాచరోపతి మెడికల్ వైద్యకళాశాల, కేర్ విద్యాసంస్థల విద్యార్థులతో కలిసి కలెక్టర్, డీఎంహెచ్‌వో తదితరులు ఆసనాలు వేశారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ మానసిక సమతుల్యత లేని సమాజానికి యోగా ఉపయోగపడుతుందన్నారు. విధుల నిర్వహణలో ప్రతీ ఒక్కరూ ఒత్తిళ్ల కారణంగా ఇబ్బందులు పడుతున్నారని, మానసిక ఒత్తిడి నుంచి యోగా విముక్తి చేస్తుందన్నారు. అంతర్జాతీ య యోగా దినోత్సవం రోజున సూర్యలంకలో 10 వేల మందితో యోగాంధ్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో యోగాసనాలలో కేర్ నాచరోపతి మెడికల్ కళాశాల విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డ్వామా పీడీ జయలక్ష్మి, మహిళా శిశు సంక్షేమశాఖ పీడీ రాధామాధవి, పశు సంవర్ధకశాఖాధికారి డాక్టర్ వేణుగోపాలరావు, ఎక్సైజ్‌శాఖ పర్యవేక్షకులు వెంకటేశ్వర్లు, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జి ఎం పీడీవో ఏలీషాబాబు, సూపరింటెండెంట్ డి.మధుసూదనరెడ్డి, చంద్రిక, దివ్యశ్రీతో పాటు ఎం.వెంకటశివకుమార్, మాజీ ఎంపీపీ వెంకట సులోచన నారాయణ, టీడీపీనాయకులు వెంకటపతిరాజు, సయ్యద్ నిజాం పాల్గొన్నారు.

ఖరీఫ్‌కి ఆక్వాటెక్ పనులు పూర్తి

రేపల్లె, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌కి ఆక్వాటెక్ పనులను పూర్తి చేసే విధంగా చర్యలు చేపడుతున్నట్లు కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు తెలిపారు. భట్టిప్రోలు మెయిన్‌కెనాల్‌పై రూ.10 కోట్లతో నిర్మిస్తున్న ఆక్వాటెక్ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఖరీఫ్‌కి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులను పూర్తి చేసేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. ఆక్వాటెక్‌పనులు పూర్తయితే చెరుకుపల్లి, నగరం, నిజాంపట్నం మండలాల పరిధిలోని 30 వేల ఎకరాలకు సాగునీరు పూర్తిస్థాయిలో అందుతుందని తెలిపారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పూర్తిస్థాయిలో పాటించేలా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు.



ఆక్వాటెక్ పనులను పరిశీలిస్తున్న మురళీధరరావు, శివప్రసాద్

అవీ..ఇవీ..

విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో వరిగడ్డి దగ్ధం

● మంటలను అదుపులోకి తెచ్చిన అగ్నిమాపక యంత్రం



మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

బల్లికురవ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సోమవరప్పాడు గ్రామంలో శనివారం చావల వెంకటాద్రి అనే రైతుకు చెందిన రెండు ఎకరాల వరిగడ్డి విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో దగ్ధమైంది. అందిన సమాచారం మేరకు వెంకటాద్రి పంట పొలం నుంచి వరిగడ్డిని ట్రాక్టర్‌పై ఇంటికి తరలిస్తుండగా గ్రామంలోకి వచ్చేసరికి విద్యుత్ తీగలు గడ్డికి తాకి మంటలు చెలరేగాయి. వెంటనే ట్రాక్టర్ డ్రైవర్ గడ్డిని కింద పడవేయడంతో ట్రాక్టర్‌కు ఎలాంటి నష్టం జరగలేదు. స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా, ఫలితం లేక పోవడంతో వెంటనే అద్దంకి అగ్నిమాపక యంత్రానికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. గ్రామంలో ఉన్న ఇరుగు పొరుగు గడ్డి వాములకు మంటలు వ్యాపించకుండా సకాలంలో మంటలు అదుపులోకి తీసుకు వచ్చారని ప్రజలు తెలిపారు. దగ్ధమైన గడ్డి విలువ సుమారు రూ. 20 వేల వరకు ఉంటుందని బాధిత రైతు తెలిపారు.

ఉరివేసుకొని వివాహిత ఆత్మహత్య

● భర్తతో విభేదాలు రావడంతో మనస్తాపం

రామన్నపేట(చీరాల), జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : ఉరివేసుకొని వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం ఉదయం వేటపాలెం మండల పరిధిలోని రామన్నపేటలో చోటుచేసుకొంది. పర్చూరు మండలం ఉప్పుటూరుకు చెందిన డొక్కా శ్రావణి (40) భర్తతో విభేదాలు ఉండడంతో తన ఇద్దరు కుమార్తెలతో కలిసి రామన్నపేటలో నివసిస్తోంది. ఆమెకు పుట్టింటి వారి నుంచి కూడా సహకారం లేకపోవడంతో మనస్తాపంతో ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. సమాచారం అందుకున్న ఎస్సై జనార్ధన్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని చీరాల ఏరియా వైద్యశాలలో పోస్ట్‌మార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పౌరహక్కుల నేత కనకయ్య సతీమణి మృతి

● రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి

● పలువురు ప్రముఖుల నివాళి



కృష్ణంశెట్టి పార్వతి(ఫైల్)

పర్చూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) :పర్చూరు ప్రాంతీయ విద్యాభివృద్ధి సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు, పౌరహక్కుల నేత, ప్రముఖ న్యాయవాది కృష్ణశెట్టి కనకయ్య సతీమణి, హిందీ ప్రచారసభ సాహితీ అవార్డు గ్రహీత కృష్ణంశెట్టి పార్వతి(78) శనివారం మృతి చెందారు. ఇటీవల బాపట్ల జిల్లా, కొరిశపాడు మండలంలోని మేదర మెట్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ స్వగ్రామం పర్చూరులోని ఆమె నివాసంలో మృతి చెందారు. ఈమెకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆమె మృతదేహాన్ని సందర్శించి పలువురు నివాళ్లు అర్పించారు. వారిలో ప్రభుత్వ సహాయ న్యాయవాది (ఏజీపీ) కొల్లా నరేంద్ర కుమార్, ప్రాతీయ విద్యాభివృద్ధి సంఘం ప్రతినిధులు పాబోలు ఉదయ భాస్కర్, అహ్మద్‌బాషా, రాష్ట్ర సచివాలయ ఉద్యోగసంఘం మాజీ అధ్యక్షులు ఉప్పుటూరి మురళీకృష్ణ, డిప్యూటీ కలెక్టర్ కఠారి రమేష్ నాయుడు, కృష్ణంశెట్టి రామకోటేశ్వరరావు, మనఊరు పత్రిక సంపాదకులు కొల్లా వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు. ఆదివారం ఉదయం పర్చూరులో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుమారుడు కృష్ణశెట్టి అజయ్‌బాబు తెలిపారు.

కర్రతో దాడి చేసి కొట్టాడని వ్యక్తి పై ఫిర్యాదు

మార్టూరు, జూన్14(ఆంధ్రజ్యోతి): ట్రాక్టరును వేగంగా ఎందుకు నడుపుతున్నావని ప్రశ్నించినందుకు తనపై కర్రతో దాడిచేసి గంతెబోయిన సునిల్ అనే వ్యక్తి గాయపరచాడని మూకిరి అశోక్‌బాబు అనే వ్యక్తి శనివారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి వివరాల మేరకు.., మండలంలోని వలపర్ల గ్రామానికి చెందిన సునిల్ శనివారం ఉదయం ఎస్సీ కాలనీలో ట్రాక్టరును వేగంగా నడుపుకుంటూ వెళుతుండగా ఫిర్యాది అశోక్‌బాబు ప్రశ్నించాడు. అందుకు ఆగ్రహం వ్యక్తం చేస్తూ సునిల్ కర్రతో అశోక్ బాబును గాయపరచారు. దాంతో తలకు గాయమైన అశోక్‌బాబు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ స్టేషన్‌కు సమాచారం అందించారు. హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలను కించపరచడం జగన్ నైజం

● ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : మహిళలను కించపరిచేలా మాట్లాడడం వైసీపీ నైజం అని ఎమ్మెల్యే ఎంఎం. కొండయ్య విమర్శించారు. శనివారం వేటపాలెం మండలం దేశాయిపేటలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పొదిలిలో మహిళలపై వైసీపీ నేతలు రాళ్ల రువ్వడంపై విరుచుకు పడ్డారు. మహిళలు సంతోషంగా ఉండటం చూసి ఓర్వలేక చర్చలు పెట్టి అసభ్యకరంగా మాట్లాడిస్తున్నాడన్నారు. జగన్‌రెడ్డికి ప్రజలు ఎప్పుడో బుద్ధి చెప్పారని, ఇకనైనా తల్లీ, చెల్లీ, ఇతర మహిళలను గౌరవించడం నేర్చుకోమని హితబోధ చేశారు. ఇది ప్రజా ప్రభుత్వం అని ఇక్కడ జగన్ ఆటలు చెల్లవని పేర్కొన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతిపై అసభ్యకరంగా మాట్లాడిన వారిని సమర్థించడం సిగ్గు చేటని అన్నారు. శాంతియుతంగా నిరసన చేస్తున్న మహిళలపై రాళ్ల వేయించిన ఘనత జగన్‌దేనన్నారు. కిలో పొగాకు ధర కూడా తెలియకుండా పరామర్శకు వెళ్లడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఒకే ఇంట్లో ఐదుగురికి సైతం తల్లికి వందనం అందించి వారికి సంతోషాన్ని పంచిన ఘనత టీడీపీ కూటమి ప్రభుత్వానిదేనన్నారు. ఇకనైనా మహిళలను గౌరవించుకోవడం నేర్చుకోవాలని జగన్‌కు సూచించారు.

వాహనం ఢీకొని గేదె మృతి

నాగులుప్పలపాడు, జూన్14 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక గేదె మృతి చెందగా మరో రెండు గేదెలు గాయపడ్డాయి. ఈ ఘటన శనివారం ఉప్పుగుండూరు సమీపంలోని చినగంజాం టోల్‌గేట్ వద్ద జరిగింది. ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన బట్టు వేణుకు చెందిన గేదె, కొమ్మనబోయిన శ్రీనివాసరావుకు చెందిన రెండు గేదెలు శుక్రవారం రాత్రి నుంచి కనిపించకపోవడంతో వారు వెదుకుతున్నారు. ఈక్రమంలో గ్రామ సమీపంలోని టోల్‌గేట్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని వేణుకు చెందిన గేదె రోడ్డు పక్కన పడి మృతి చెంది ఉంది. అలాగే శ్రీనివాసరావుకు చెందిన రెండు గేదెలు తీవ్ర గాయాలతో కనిపించాయి. మృతి చెందిన గేదె రూ.లక్ష విలువ చేస్తుందని యజమాని ఆవేదన వ్యక్తం చేశారు.

మినీ బైపాస్ రోడ్డు నిర్మాణానికి సన్నాహాలు

● నిర్వాసితులకు అద్దంకి కొండ వద్ద స్థలాలు కేటాయింపు ● మౌలిక వసతుల కల్పన పై మున్సిపల్ అధికారుల దృష్టి



అద్దంకి లో మినీ బైపాస్ గా అభివృద్ధి చేయనున్న కాలువ కట్ట



అద్దంకికొండ వద్ద చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్

అద్దంకి, జూన్14(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో మినీ బైపాస్ రోడ్డు నిర్మాణానికి సన్నాహాలు ఊపందుకున్నాయి. కాలువ కట్టపై తాత్కాలిక నివాసాలు ఉన్న కుటుంబాలకు అద్దంకి కొండ వద్ద శింగరకొండపాలెం సమీపంలో స్థలాలు కేటాయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రతిపాదిత స్థలంలో పెద్ద గోతులు ఉండడంతో చదును చేసే పనులు ప్రారంభమయ్యాయి. విజయవాడ-బెంగళూరు గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణం చేస్తున్న మెగా ఇంజనీరింగ్ సంస్థ సహకారంతో అద్దంకికొండ వద్ద ఎక్స్‌కవేటర్, టిప్పర్లను ఉపయోగించి చదును చేస్తున్నారు. అనంతరం రోడ్లు ఏర్పాటు, విద్యుత్ సౌకర్యం, నీటివసతి కల్పించి అభివృద్ధి చేసేందుకు మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జూలై చివరి నాటికి కాలువ కట్టపై ఇళ్ల తొలగించే విధంగా పనులు వేగవంతం చేశారు. సుమారు 70 ఇళ్లు ఉన్నట్లు గుర్తించి ఖాళీ చేసి అద్దంకి కొండ వద్ద కేటాయించే స్థలానికి వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని ఆయా కుటుంబాలకు అధికారులు సమాచారం ఇచ్చారు. రేణింగవరం నుంచి నామ్ రోడ్డు వరకు మధ్యలో కాలువ ఉంచి రెండు వైపులా సిమెంట్ రోడ్లు నిర్మాణం చేయనున్నారు. అదే సమయంలో ఆయా ప్రాంతాల నుంచి వచ్చే మురుగు నీటి ప్రవాహానికి వీలుగా సైడ్ డ్రైన్లు ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం నుంచి రూ.15 కోట్ల నిధులు కూడా మంజూరయ్యాయి. త్వరలో టెండర్లు కూడా పిలిచేందుకు సిద్ధం చేస్తున్నారు. మినీ బైపాస్ నిర్మాణం పూర్తయితే నామ్ రోడ్డు లో కొంత మేర ట్రాఫిక్ తగ్గి రోడ్డు ప్రమాదాలు కూడా తగ్గే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

చేనేతలకు అండగా ప్రభుత్వం : ఎమ్మెల్యే కొండయ్య



కుప్పడం చీరను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

దేశాయిపేట (చీరాల), జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : చీరాల చేనేతలకు ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఎమ్మెల్యే ఎంఎం. కొండయ్య పేర్కొన్నారు. చీరాల కుప్పడం చీరకు జాతీయ గుర్తింపు లభించిన నేపథ్యంలో శనివారం వేటపాలెం మండల పరిధిలోని దేశాయిపేటలో టీడీపీ సీనియర్ నాయకులు సిద్ధి బుచ్చేశ్వరరావు, చేనేతలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే కొండయ్య ముందుగా గ్రామంలోనే మగ్గాలను పరిశీలించి చీర తయారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ చేనేత రంగం సంక్షోభంలో ఉండగా పూట గడిచేందుకు నేతన్నలు అవస్థలు పడినట్లు చెప్పారు. వారిని ఆదుకొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్రంలో వ్యవసాయం రంగం తరువాత అంతటిప్రాధాన్యత కలిగి నది చేనేత రంగమేనన్నారు. ఎట్టి పరిస్థితులలోనూ చేనేత ల చేయి విడిచిపెట్టమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సహకారంతో సాధ్యమైనంత వేగంగా హ్యాండ్ లూమ్ పార్కు ఏర్పాటుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. అలాగే నేతన్న చీరకు గుర్తింపు వచ్చేందుకు కృషిచేసిన ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేలకు చేనేత లు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హ్యాండ్‌లూమ్ చైర్మన్ సజ్జా హేమలత, ఏఎంసీ చైర్మన్ కౌతవరపు జనార్ధనరావు, చేనేత నాయకులు, కార్మికులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రక్తదానంపై ప్రజలు అపోహలు వీడాలి

హోమియో వైద్యులు కావూరి రఘుచంద్



నాగినేని రామకృష్ణను సన్మానిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకిటౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రక్తదానంపై ప్రజలు అపోహలు వీడి ఆరోగ్యంగా ఉన్న ప్రతిఒక్కరూ సంవత్సరానికి రెండుసార్లు రక్తదానం చేయవచ్చని హోమియో వైద్యులు డాక్టర్ కావూరి రఘుచంద్ అన్నారు. శనివారం రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం స్థానిక గీతా మందిర్‌లో నిర్వహించారు. రక్తదానం చేసిన దాతకు కూడా ఆరోగ్యపరంగా ఫలితం ఉంటుందన్నారు. రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లేనన్నారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు 30 సార్లు రక్తదానం చేసిన ఏఎంసీ మాజీ చైర్మన్ నాగినేని రామకృష్ణను రోటరీ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాగినేని మాట్లాడుతూ, తన ఆరోగ్య రహస్యం రక్తదానమేనని, ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి రక్తదానం మీద కవిత చదివి సభలో వినిపించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, సెక్రటరీ చుండూరి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, అసిస్టెంట్ గవర్నర్ షక్ మహమ్మద్ రఫీ, సందిరెడ్డి శ్రీనివాసరావు, సయ్యద్ మౌలాలి, రఘురామశర్మ, త్రిమూర్తులు, పూర్ణచంద్రరావు, కృష్ణారావు పాల్గొన్నారు.

రక్తదానం చేయడం ఆరోగ్యకరం

మార్టూరు : రక్తదానం చేయడం ఆరోగ్యకరమని ఎలాంటి అనారోగ్యం ఉండదని మార్టూరు కమ్యూనిటి హెల్త్ సెంటరు వైద్యాధికారి డాక్టరు అశోక్ రెడ్డి అన్నారు. శనివారం అంతర్జాతీయ రక్తదానం దినోత్సవం సందర్భంగా మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్ప్ స్వచ్ఛంద సంస్థ, ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో కమ్యూనిటి హెల్త్ సిబ్బంది,హెల్ప్ సిబ్బంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో సిబ్బంది కె.దుర్గ, ఎం సామ్రాజ్యం, శ్రీనివాసరావు, వసంత, బ్లడ్‌బ్యాంక్ మేనేజర్ జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

యోగా ప్రాధాన్యతను ప్రతి వ్యక్తి గుర్తించాలి

ఎంపీడీవో స్వరూపారాణి



పంగులూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పంగులూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): యోగా వలన కలిగే ప్రయోజనాలను దాని ప్రాధాన్యతను సమాజంలోని ప్రతివ్యక్తి గుర్తించాలని ఎంపీడీవో కె.స్వరూపారాణి అన్నారు. మండల కేంద్రమైన పంగులూరు, బూదవాడ గ్రామాలలో శనివారం యోగా అవసరాన్ని ప్రజలకు వివరిస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. యోగాతో ఆరోగ్యకరమైన జీవితం గడపవచ్చన్నారు. నిత్యజీవితంలో యోగా భాగంకావాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బాలరాజేశ్వరి, ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ కృష్ణకుమార్ అన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ సుమంత్, టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, బాచిన చౌదరిబాబు, గుడిపూడి రామారావు, కొమ్మారెడ్డి శ్రీనివాస రెడ్డి, పంచాయితీ కార్యదర్శి రాంబాబు, ఆయా గ్రామాల సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అద్దంకిలో యోగాంధ్ర ర్యాలీలు

అద్దంకి : యోగాడేను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం అద్దంకి పట్టణంలోని 5, 15 వార్డులలో ర్యాలీలు నిర్వహించారు. జూన్ 21న జరిగే యోగాడే ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమాలలో అద్దంకి పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు వడ్డవల్లి పూర్ణచంద్రరావు, చిలుకూరి అనిల్, వెంకట్రావు, చుండూరి మురళీసుధాకర్, నాగరాజు, కురిచేటి వెంకట సుబ్బారావు, చామర్తి శ్రీనివాసరావు, షేక్ కాలేషాబాబు విరాట్ తదితరులు పాల్గొన్నారు.

రంగస్థల కళాకారుడు జయబాబు మృతి

● పలువురు కళాకారుల నివాళి

● కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం





నివాళి అర్పిస్తున్న కళాకారులు, సుబ్బిశెట్టిగా జయబాబు(ఫైల్)

అద్దంకిటౌన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రంగస్థల నటుడు, సుబ్బిశెట్టి పాత్రదారి నూకతోటి జయబాబు(59) శుక్రవారం రాత్రి గుండె పోటుతో మృతి చెందాడు. పట్టణంలోని నంబూరివారిపాలెంలో నివాసం ఉండే జయబాబు చింతామణి నాటకంలోని సుబ్బి శెట్టి పాత్రదారిగా అందరిని అలంరించారు. టీడీపీ అద్దంకి నియోజకవర్గ సాంస్కృతిక విభాగం ఉపాధ్యక్షుడిగా నూకతోటి జయ బాబు పనిచేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం మృతదేహాన్ని బాపట్ల జిల్లా తెలుగు దేశం పార్టీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు గోవాడ శ్రీకాంత్‌తో పాటు పలువురు సందర్శించి నివాళ్లు అర్పించారు. ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్ గోపాలకృష్ణ విషయం తెలుసుకుని జయబాబు నివాళ్లలు తెలిపి, కుటుంబ సభ్యులకు తన సంతాపాన్ని తెలిపారు. జయబాబు కుటుంబ సభ్యులకు కళాకారుల తరఫున రూ.15 వేలను అంద జేశారు. అద్దంకి రంగస్థలం ఒక గొప్పనటుడిని కోల్పోయిందని, ఆయన స్థానం భర్తీ చేయలేనిదన్నారు.. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు చౌదరి, షేక్ మీరావలి, జ్యోతి రమేష్, మిడసల మల్లికార్జున రావు, మాబు, ఆలకుంట శ్రీనివాసరావు, తన్నీరు నాగేశ్వరరావు, రామదాసు, ఉలిచి బాబురావు, బుజ్జి, లక్ష్మయ్య, సీనియర్ నటిమణి భానుమతి, కృష్ణకుమారి, వెంకట కృష్ణ, అశ్విని, ఇతర ప్రాంతాల కళాకారులు మృతదేహాన్ని సందర్శించి నివాళ్లు అర్పించారు.

చందనాలంకరణలో వేంకటేశ్వరస్వామి



చందనాలంకరణలో స్వామివారు

మేదరమెట్ల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మేదరమెట్లలోని శ్రీభూనిలాసమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా మొదలయ్యాయి. శనివారం 41వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామివారిని చందనంతో అలంకరించారు. ఉదయం నుంచే నిత్యహోమం, ప్రత్యేక పూజాకార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శుక్రవారం నుంచి ప్రారంభమైన బ్రహ్మోత్సవాలను పండితులు నారాయణం బాలసుబ్రహ్మణ్యాచార్యులు, ఆలయ పూజారి హయగ్రీవాచార్యుల ఆధ్వర్యంలో వైఖానస ఆగమశాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు.18న బుధవారం స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా మహిళలు కోలాటంతో భక్తులను అలరించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు పాదర్తి కాజారావు, మద్దాలి సంజీవరావు, మునగంటి వీరబ్రహ్మం, గొల్ల సుబ్బారావు, అరవపల్లి రామచంద్రరావు, దేసు చంద్రశేఖర్, దేసు ఆంజనేయులు, సామా వెంకటసుబ్బారావు, పోలిశెట్టి రామారావు, మద్దాలి రాఘవరావు, ఆదూరి ప్రసాద్, చీకటమర్ల రవి, తిరువీధులు శ్రీనివాసరావు, నాగసూరి రామాంజనేయులు, పేరకం శ్రీను తదితరులు కార్యక్రమ నిర్వహణలో పాల్గొన్నారు.

హైదరాబాద్ ఐఐఐటీకి విష్ణుప్రియ ఎంపిక



దంతం విష్ణుప్రియ

పందిళ్లపల్లి(చీరాల), జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాదు ఐఐఐటీకి వేటపాలెం మండలం పందిళ్లపల్లికి చెందిన దంతం విష్ణుప్రియ ఎంపికైంది. 2022-23లో పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి ఫలితాల్లో 591 మార్కులతో నూజివీడులో స్థానం దక్కించుకుంది. అయితే అక్కడ ఇంటర్‌లో 9.7 జీపీఏతో రాణించి అందరిని అబ్బురపరిచింది. ఈనేపథ్యంలోనే హైదారాబాదు ఇంజనీరింగ్ అడ్మిషన్ కోసం నిర్వహించిన ఎస్‌పీఈసీ (స్పెషల్ ఛానల్ ఫర్ ఎడ్యుకేషన్) పరీక్షలో ఉన్నతంగా రాణించడంతో అందుకు సంబంధించి శనివారం విడుదలైన ఫలితాల్లో విష్ణుప్రియ మెరిసింది. దీంతో పలువురు ప్రముఖులు చిన్నారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నారు.

ఇలా సరిచేశారు..!

● రోడ్డు మధ్యలో గుంతపై డ్రమ్ము ఏర్పాటు



గుంతపై ఏర్పాటు చేసిన డ్రమ్ము

మార్టూరు, జూన్14 (ఆంధ్రజ్యోతి): మార్టూరులోని హీరో షోరూం సమీపంలో జాతీయ రహదారి నుంచి సర్వీసురోడ్డులోని వెళ్లే మలుపు అది. ఈ మలుపులో పెద్ద గొయ్యుంది. వర్షం పడిన ప్రతిసారి నీరు నిలిచి ఉంటుంది. అక్కడ గోతిలో వాహనచక్రాలు పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల జాతీయ రహదారి అధికారులు తారుతో మరమ్మతులు చేసినా మళ్లీ గొయ్యి యథాస్థితికి వచ్చింది. దీంతో స్థానికంగా ఉన్న ఓ యువకుడు వినూత్నంగా ఆలోచించారు. ఆ గొయ్యిలో ఒక డ్రమ్మును ఏర్పాటు చేశారు. దీంతో అప్రమత్తమవుతున్న వాహన చోదకులు గోతిని తప్పించి వాహనం నడుపుతున్నారు. తద్వారా ప్రమాదాలు జరగకుండా ఉంటున్నాయి. ఈ సర్వీసురోడ్డులోనికి చిలకలూరిపేట వైపు నుంచి వచ్చే వాహనాలు కార్లు, లారీలు, ద్విచక్రవాహనాలు సర్వీసురోడ్డు గుండా జొన్నతాళి సెంటరుకు, మార్టూరు టౌన్ లోకి వస్తుంటాయి. డ్రమ్ము ఏర్పాటుతో వాహనచోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొరిశపాడు క్లస్టర్ సీసీగా శ్రీనివాసరావు

మేదరమెట్ల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) కొరిశపాడు వెలుగు సీసీ (కమ్యూనిటీ కో-ఆర్డినేటర్)గా తుళ్లూరి శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. శనివారం మోదేపల్లి సీసీగా పనిచేస్తూ సాధారణ బదిలీలలో భాగంగా కొరిశపాడు వచ్చారు.

ఎస్టీవోను కలిసిన ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు



ఎస్టీవో ఖాదర్‌బాషాను సత్కరిస్తున్న ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు

అద్దంకిటౌన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం సభ్యులు శనివారం స్థానిక కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై చర్చించారు. ఈ క్రమంలో నూతన ఎస్టీవోగా బాధ్యతలు స్వీకరించిన ఖాదర్‌బాషాకు, సీనియర్ అసిస్టెంట్ అనూషకు స్వాగతం పలుకుతు వారిని సత్కరించి అభినందనలు తెలిపారు. అద్దంకి నుండి బదిలీపై వెళ్లిన ఎస్టీవో ప్రసన్నను, సీనియర్ అసిస్టెంట్ కొండలరావులను సంఘసభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో జిల్లాశాఖ అధ్యక్షుడు రావూరి బాపయ్యచౌదరి, కార్యదర్శి కరి కమలేశ్వరరావు, కోశాధికారి పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, అద్దంకిశాఖ అధ్యక్షుడు అడుసుమల్లి అనంత రామకోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నిమ్మరాజు నాగేశ్వరరావు, కోశాధికారి వారణాసి రఘురామశర్మ పాల్గొన్నారు.

మణికేశ్వరంలో ఉపాధి పనులపై గ్రామసభ

అద్దంకిటౌన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని మణికేశ్వరం గ్రామంలో శనివారం ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ బృందం గ్రామసభ నిర్వహించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామంలో జరిగిన ఉపాధి హామీ పనులు, వాటి వివరాలను గ్రామసభలో ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో అద్దంకి, కొరిశపాడు ఏపీవోలు, కోటేశ్వరి, గాయత్రి, టీడీపీ నాయకులు కరిముల్లా, సచివాలయ ఉద్యోగులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల కోసం దరఖాస్తుల ఆహ్వానం

చినగంజాం, జూన్ 14(ఆంధ్రజ్యోతి) : చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కొత్తపాలెం-1, మున్నంవారి పాలెం-1, రాజుబంగారుపాలెం-1 గ్రామ సచివాలయాలలో ఖాళీగా మూడు ఆశా కార్యకర్తల పోస్టుల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని, వైద్యాధికారి డాక్టర్ పి.సాయిశ్రీచరణ్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ మేరకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 17వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సూపర్‌వైజర్‌ను సంప్రదించాలని తెలిపారు. దరఖాస్తుదారులు ఆయా సచివాలయాల పరిధిలోని వారై ఉండాలని వైద్యాధికారి సూచించారు.


చేనేతలు సంఘటితం కావాలి

దేవాంగపురి(చీరాల), జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : చేనేతల సమస్యలు పరిష్కారం జరగాలంటే సంఘటితం కావాలని పలువురు చేనేత కార్మికుల నాయకులు అన్నారు. శనివారం మండల పరిధిలోని దేవాంగపురి శ్రీచౌడేశ్వరి కళ్యాణ మండపంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. నేతన్నలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో దేవాంగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బీరక సురేంద్ర, మాచర్ల మోహన్‌రావు, దామర్ల శ్రీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు మార్టూరులో విద్యుత్ కోత

మార్టూరు, జూన్14(ఆంధ్రజ్యోతి): మార్టూరు సబ్‌డివిజన్ పరిధిలో విద్యుత్ ఫీడర్ల మెయిన్‌టెనెన్స్ నిమిత్తం మార్టూరు, యద్దనపూడి, బల్లికురవ మండలాల్లోని పలు గ్రామాలలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ కోత ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని డీఈఈ ఎం.సురేంద్రబాబు శనివారం ఒక ప్రకటనలో కోరారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
1
శ్రీ పొట్టి శ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
ఆదివారం 15 జూన్ 2025



నీట్‌లో జిల్లాకు ఉత్తమ ఫలితాలు

● వైద్య విద్యకు 80 శాతం మంది అర్హత

నెల్లూరు(విద్య), జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : ఎంబీబీఎస్, బీడీఎస్ వంటి కోర్సుల్లో ప్రవేశానికి జాతీయస్థాయిలో నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్-అండర్ గ్రాడ్యుయేట్ (నీట్-యూజీ) ప్రవేశ పరీక్ష ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో జిల్లాకు ఉత్తమ ర్యాంకులు లభించాయి. మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ మే 4వ తేదీన నీట్ పరీక్షను నిర్వహించగా, జిల్లా వ్యాప్తంగా 2,913 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఇటీవల ప్రాథమిక కీ విడుదల చేసి అభ్యంతరాలు స్వీకరించిన అధికారులు తాజాగా ఫలితాలను ప్రకటించగా జిల్లాలో 80శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి వైద్యవిద్య ప్రవేశాలకు అర్హత సాధించారు.

అత్యుత్తమ ర్యాంకులు ఇవే..

నీట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు మెడికల్ విభాగంలో జాతీయస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. నారాయణ మెడికల్ అకాడమీకి చెందిన విద్యార్థుల్లో వివిధ కేటగిరిలో ఎస్.ఈ. కవిన్ 161వ ర్యాంకు, పి.శ్రీరామ్ 253, ఎన్.యోగేష్ కార్తీక్ 323, ఎం.వెంకట శ్రీనివాస్ 515, ఎస్.వైష్ణవ్ కుమార్ 546, పి.లలిత్ శ్రీహాస్ 563, టి.సుభాష్ శంకర్ 804, ఎం.విశ్వక్ 955, పి.కత్రివేల్ 962వ ర్యాంక్ సాధించారు. అలాగే విశ్వసాయి విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు జాతీయస్థాయిలో 720 మార్కులకు బి.భానుశ్రీ సులోచన 543 మార్కులు, వి.హరిణి 542, ఎం.చేతన్ 531 సొంతం చేసుకున్నారు. డాక్టర్ కిషోర్స్ రత్నం విద్యాసంస్థల విద్యార్థిని సి.జాహ్నవి 588 మార్కులు సాధించింది.

ఉత్తమ వైద్యుడిగా సేవలందిస్తా



అమ్మానాన్న రాజశేఖర్, శ్రీలక్ష్మి ప్రభుత్వ ఉపాధ్యాయులు. వీరి ప్రోత్సాహంతోనే చదువులో ఉత్తమం గా రాణిస్తున్నాను. కళాశాలలో అధ్యాపకులు అందించిన విద్యా విధానంతో నీట్‌లో 563వ ర్యాంకు సాధించాను. అందరి ప్రోత్సాహం, సహకారంతో వైద్యవిద్యలో ఉత్తమంగా రాణించి ఉత్తమ వైద్యుడిగా సేవలందిస్తాను.

- లలిత్ శ్రీహాస్, 563వ ర్యాంకర్, నెల్లూరు

రేడియాలజిస్ట్ అవుతా



తల్లిదండ్రులు లావణ్య, వంశీకృష్ణల సహకారంతో విద్యలో ఉత్తమ ప్రతిభ చూపుతున్నాను. అధ్యాపకులు నాణ్యమైన విద్యా ప్రమాణాలు అందించడంతో నీట్‌లో 955వ ర్యాంక్ సాధించాను. అందరి ఆశయాలకు అనుగుణంగా వైద్యవిద్యలో ప్రతిభ చూపి రేడియాలజిస్ట్‌గా సేవలందిస్తాను.

- ఎం.విశ్వక్, 955వ ర్యాంకర్, నెల్లూరు

న్యూరాలజిస్ట్‌గా సేవలందిస్తా



చిన్నప్పటి నుంచే అమ్మానాన్న శ్రీలక్ష్మి, రవికుమార్‌లు నన్ను ఎంతో ప్రోత్సహించారు. అధ్యాపకులు అందించిన సహకారం, ఉత్తమ బోధనతోనే నీట్‌లో 588 మార్కులతో ఓపెన్‌లో 2,505వ ర్యాంక్ సాధించాను. నచ్చిన కళాశాలలో సీటు సాధించి వైద్య విద్యలో ఉత్తమంగా రాణించి న్యూరాలజిస్ట్‌గా సేవలిందిస్తాను.

- జాహ్నవి, 2,505వ ర్యాంకర్


బారాషహీద్ దర్గా అభివృద్ధికి రూ.5 కోట్లు విడుదల

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బారాషహీద్ దర్గా అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5కోట్లు విడుదల చేసింది. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చాక తొలిసారిగా జరుగుతున్న రొట్టెల పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభివృద్ధి పనులు, ఏర్పాట్ల కోసం ఈ నిధులు విడుదల చేశారు. ఈ నిధులు విడుదల కావడానికి కృషి చేసిన రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి రూరల్ మ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

నాటికి నేటికి ఎంత తేడా!

వైసీపీ హయాంలో 1.9 లక్షల మందికి సాయం

కూటమిలో 2.48 లక్షల మందికి ప్రయోజనం



నగరంలో కిటకిటలాడుతున్న ఓ దుకాణం

సందడిగా సండే మార్కెట్

నెల్లూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : చదువుకునే విద్యార్థులకు అందించే విద్యాసాయం విషయంలో గత వైసీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి డబ్బుల విషయంలోనే కాదు... వాటి వినియోగంలోనూ తేడా కనిపిస్తోంది. వైసీపీ హయాంలో అమ్మఒడి పథకం కింద 1.9 లక్షల మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి 13వేలు చొప్పున 247 కోట్ల రూపాయలు పంపిణీ చేసింది. కూటమి ప్రభుత్వం 2.48 లక్షల మందికి ఒక్కొక్కరికి రూ.13వేలు చొప్పున 322.4 కోట్ల రూపాయలను తల్లుల బ్యాంకు ఖాతాలో జమ చేసింది. ఒకటో తరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఇంకా డబ్బులు చెల్లించాల్సి ఉంది. వీటిని కలుపుకుంటే కూటమి ప్రభుత్వం ఇచ్చే మొత్తం మరో రూ.10 కోట్లకుపైగా పెరుగుతుందని అంచనా. విద్యాసాయం కింద వైసీపీ కన్నా కూటమి ప్రభుత్వం రూ.85 కోట్లు అదనంగా తల్లుల ఖాతాలో జమ చేస్తోంది. ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి డబ్బులు ఇవ్వడంతో ప్రభుత్వ ఖజానాపై ఈ మేరకు అదనపు భారం పడింది.

● మార్కెట్లో సందడి

ఇక వినియోగం విషయానికి వస్తే వైసీపీ హయాంలో విద్యాసాయం కింద అమ్మఒడి పథకం ద్వారా ఇచ్చిన డబ్బుల్లో ఎక్కువ భాగం పక్కదారి పట్టాయనే చెప్పాలి. తొలి ఏడాది ఆ డబ్బులతో విచ్చలవిడిగా సెల్ ఫోన్లు కొన్నారు. రెండు, మూడు సంవత్సరాల్లో పండగలు, కుటుంబ ఖర్చులకు ఎక్కువ భాగం ఖర్చు చేశారు. అయితే ఈసారి తల్లికి వందనం నిధుల వ్యయంలో ఖచ్చితమైన తేడా కనిపిస్తోంది. కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కాలుచేయి సర్దుకునేందుకు కాస్త సమయం పట్టినా సరియైన సమయంలో తల్లుల ఖాతాలో నగదు జమ చేశారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమైన రోజునే తల్లికి వందనం పథకాన్ని ప్రారంభించి, డబ్బులు జమ చేశారు. పిల్లల విద్య కోసం తల్లిదండ్రులు ఖర్చు చేసే సమయం ఇది. ఎంత పేదవారైనా, ఏ తరగతి విద్యార్థులకైనా యూనిఫారం, పుస్తకాలు, బ్యాగులు, చెప్పులు, స్కూలు ఫీజులు చెల్లించక తప్పదు. ఎన్ని బాధలున్నా వాయిదా వేయడానికి వీల్లేని ఖర్చులివి. సరిగ్గా ఈ సమయంలో తల్లుల ఖాతాల్లో డబ్బులు పడటంతో అందులో ఎక్కువ భాగం పిల్లల చదువుల కోసమే ఖర్చు చేస్తున్నారు. శనివారం నెల్లూరు నగరంలో పిల్లలకు అవసరమైన యూనిఫాం దుస్తులు, పుస్తకాలు, స్కూలు బ్యాగులు, చెప్పుల దుకాణాలు పిల్లలు, తల్లిందండ్రులతో రద్దీగా కనిపించాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను వెంటబెట్టుకుని షాపింగ్‌కు వచ్చి వారికి అవసరమైనవి, అందులోనూ వారికి నచ్చినవి కొనిచ్చి సంతోషంగా వెనుతిరిగే దృశాలు కనిపించాయి. ట్రంకు రోడ్డు, సండేమార్కెట్, గాంధీ బొమ్మ సెంటర్ తదితర ప్రాంతాల్లోని దుకాణాలు కళకళలాడుతూ కనిపించాయి.



స్కూలు సామగ్రి కొనుగోలు చేసిన ఓ కుటుంబం

నిన్న మధ్యప్రదేశ్.. నేడు గుజరాత్ కారు!

● ఒక కేసును విచారిస్తుండగా మరొకటి వెలుగులోకి..
● తాజాగా రూ.3.06 కోట్ల స్వాధీనం?
● పోలీసుల అదుపులో అనుమానితులు
● ఇది హవాలా డబ్బేనా!?.. ముమ్మరంగా విచారిస్తున్న పోలీసులు

మర్రిపాడు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : ముంబయి జాతీయ రహదారిపై రూ.కోట్లు విలువైన కరెన్సీ రవాణా అవుతోందా!? అంటే అవుననే అనిపిస్తోంది. ఈ నెల 13వ తేదీన హైవేపై మధ్యప్రదేశ్ కారును కారును వదిలి పరారైన నలుగురు అనుమానితులను పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. కారులో 4.50 కోట్ల నగదును తరలిస్తూ పథకం ప్రకారం యజమానికి తెలియకుండా కాజేసేందుకు విశ్వప్రయత్నం చేసినట్లు తెలిసింది. వెంటనే అప్రమత్తమైన జిల్లా పోలీస్ యంత్రాంగం ముమ్మరంగా తనిఖీలు చేస్తుండగా, శుక్రవారం పడమటినాయుడుపల్లిలో గుజరాత్‌కు చెందిన మరో కారు పోలీసులకు చిక్కింది. ఆ కారులో రూ.3.06 కోట్ల నగదును గుర్తించి, రెవెన్యూ అధికారుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. తొలుత మధ్యప్రదేశ్ కారులో డబ్బులతో పరారైన కేసును విచారిస్తుండగా మరోకేసులో గుజరాత్ కారు దొరకడంతో పోలీసులకు అర్థం కాక తలలు పట్టుకుంటున్నట్లు సమాచారం. సదరు కారులో కొందరు అనుమానితులను కూడా పోలీసులు ఆధీనంలోకి తీసుకున్నట్లు తెలిసింది. లోతైన విచారణ కోసం అనుమానితులను నెల్లూరుకు తలించినట్లు సమాచారం. ఇదంతా హవాలా డబ్బు అయి ఉండవచ్చని స్థానికులు అంటున్నారు.



గుజరాత్ కారులో లభించిన రూ.3.06 కోట్ల నగదు

'మాలకొండ' ఆదాయం రూ.17.08 లక్షలు

వలేటివారిపాలెం : మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామికి శనివారం భక్తుల నుంచి రూ.17,08,230 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్నదానం ద్వారా రూ.7,66,355, ప్రత్యేక దర్శనాల ద్వారా రూ.5,04,800, లడ్డూ ప్రసాదం విక్రయాల ద్వారా రూ.2,51,160, తలనీలాలు రూ.79,475, విరాళాల ద్వారా రూ.30 వేలు తదితర వాటి ద్వారా ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	119
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	238

కోడిగుడ్ల ధర (100): 515

బంగారం, వెండి ధరలు
బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9600
వెండి కిలో ధర	రూ. 109300
వెండి ఒక గ్రాము	రూ.112.30

రేపు ఆచారస్తులు, గ్రామపెద్దలతో సమావేశం

కందుకూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కందుకూరు గ్రామదేవత అంకమ్మ తిరుణాళ్ల, పాత విగ్రహాల విషయంపై చర్చించేందుకు ఈనెల 16న ఉదయం 10 గంటలకు దేవర ఇల్లు పెద్దలు, ఆచారస్తులు, సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆలయ ధర్మకర్త దివి లింగయ్యనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో అందరూ తప్పకుండా పాల్గొని సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

న్యూస్ బాక్స్

ఇళ్లు నిర్మించుకోకుంటే ప్లాట్లు ఉండవు

కావలి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు కేటాయించిన ప్లాట్లలో ఇళ్లు నిర్మించుకోకపోతే ప్లాట్లు కాపాడుకోవటం కష్టమేనని దివ్యాంగుల కాలనీ అధ్యక్షుడు మండవ వెంకట్రావు తెలిపారు. పట్టణంలోని చంద్రబాబునాయుడు కాలనీ ప్రాంతంలోని దివ్యాంగుల కాలనీలో శనివారం కాలనీ వాసులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ప్లాట్లను కాపాడుకునే విషయంపై చర్చించారు. ప్లాట్లను పొందిన వారు వెంటనే ఇళ్ల నిర్మాణాలు చేపట్టుకోవాలని తెలిపారు. కాలనీలో మౌలిక వసతులు కల్పనకు ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కాలనీలో సకలాంగులు అక్రమంగా జొరబడి ప్లాట్లు ఆక్రమించుకున్న వారిని ఎమ్మెల్యే, అధికారుల సహకారంతో బయటకు పంపేందుకు అందరం ఐకమత్యంగా పోరాడాలని చెప్పారు. ఈ సమావేశంలో కాలనీ వాసులు సోమయ్య, బాష, బాజీ, మస్తానమ్మ, శైలేష్ తదితరులు పాల్గొన్నారు.

కోవూరు పశువైద్యాధికారిగా డాక్టరు శ్రీకాంత్

కందుకూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోవూరు పశువైద్యాధికారిగా డాక్టరు శ్రీకాంత్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం కోవూరు పశువైద్యాధికారిగా సేవలందించిన డాక్టరు ఎస్.సుధాకర్ శనివారం మాచవరం పశువైద్యశాలలో వైద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించారు.

మాలకొండయ్య మృతికి సీఐటీయూ నేతల నివాళి

ఉలవపాడు, జూన్ 14(ఆంధ్రజ్యోతి) : సీఐటీయూ నాయకుడు, పీటీపీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ కరేడు ర్యాంప్ మాజీ అధ్యక్షుడు చిలకపాటి మాలకొండయ్య(76) శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన సీఐటీయూ నాయకులు ఆయన మృతదేహన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మాజీ రాష్ట్ర కార్యదర్శి వై.సిద్ధయ్య, నాయకులు జీవీబీ కుమార్, చిమటా శ్రీనివాసరావు, చిలకా శ్రీనివాసులు, పీటీపీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం, ఆనందం

● ఆర్టీవో టీవీ నాగలక్ష్మి



కందుకూరులో యోగా ప్రాక్టీసు చేయిస్తున్న ఆర్టీవో టీవీ నాగలక్ష్మి, తదితరులు

కందుకూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ప్రతి రోజు యోగా చేస్తే ఆరోగ్యంగా, ఆనందంగా జీవించవచ్చునని కందుకూరు ప్రాంతీయ రవాణాశాఖ అధికారిణి టీవీ నాగలక్ష్మి పేర్కొన్నారు. శనివారం ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయంలో నిర్వహించిన ప్రీ ఇంటర్నేషనల్ యోగా డే వేడుకల్లో సిబ్బందితో పాటు పట్టణంలోని వివిధ వర్గాల ప్రజలు హాజరుకాగా వారందరితో ఆమె యోగాసనాలు చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ చెన్నూరి రాంబాబు, డాక్టరు టీ. మల్లికార్జునరావు, చక్కా వెంకటకేశవరావు, ఎల్‌ఐసీ డీవో శశిధర్‌రెడ్డి, ఆర్ఎస్ఎస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

● **కావలిరూరల్** : యోగాతో ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవచ్చని ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీదేవి పేర్కొన్నారు. కావలి మండలంలోని అన్ని సచివాలయాల వద్ద మాక్ యోగా కార్యక్రమం నిర్వహించారు. అన్నగారిపాలెంలో జరిగిన యోగా శిక్షణ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీదేవి పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఈనెల 21వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ సమద్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● **అల్లూరు** : అల్లూరు నగర పంచాయతీలోని పలుప్రాంతాల్లో ప్రజలకు యోగా శిక్షణ నిర్వహించారు. నగర పంచాయతీ కమిషనర్ ఉమమహేశ్వరరావు పాల్గొని యోగాంధ్ర విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

● **లింగసముద్రం** : స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద కార్యాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది, శ్రామికులు, రైతులతో కలిసి యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులు పాల్గొని మాట్లాడుతూ యోగాసనాలను జీవితంలో ఒక భాగం చేసుకోవాలని చెప్పారు.

● **వలేటివారిపాలెం** : మండలంలోని పోలినేనిపాలెం, పోకూరు, నూకవరం, నేకునాంపురం, లింగపాలెం, శాఖవరం, అంకభూపాలపురం, పోలినేనిచెరువు, బడేవారిపాలెం, చుండి, అమ్మపాలెం, వలేటివారిపాలెం, అయ్యవారిపల్లె గ్రామాల్లో అధికారులు, సచివాలయ సిబ్బంది యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరేంద్రదేవ్ పాల్గొన్నారు.

● **బిట్రగుంట** : బోగోలు ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో యోగాంధ్ర కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, యోగా గురువు అరుణకుమారి, తహసీల్దారు సురేష్‌బాబు, డిప్యూటీ తహసీల్దారు భరత్‌కుమార్, టీడీపీ మండల కన్వీనర్ నాగేశ్వరరావు, బోగోలు ఇంచార్జి ఎం.వెంకయ్య, పీఆర్ఏఈ శ్రీనివాసులు, ఏపీఎం నవీన్, సీనియర్ అసిస్టెంట్ నవీన్ కుమార్‌రెడ్డి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు, లోకేష్, కృష్ణారెడ్డి

చిత్రపటాలకు పాలభిషేకం



చంద్రబాబునాయుడు, లోకేష్, కృష్ణారెడ్డి చిత్రపటాలకు పాలభిషేకం చేస్తున్న తల్లులు

కావలిటౌన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి) : తల్లికి వందనం పథకం ద్వారా తల్లుల ఖాతాలో నగదు జమ అయిన సంతోషంలో 20వ వార్డులో టీడీపీ నాయకులు తిరువీధి ప్రసాద్ ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖా మంత్రి లోకేష్, ఎమ్మెల్యే కృష్ణారెడ్డి చిత్రపటాలకు తల్లులు పాలాభిషేకం చేశారు. ప్రసాద్ మాట్లాడుతూ గతంలో అమ్మఒడి పేరుతో ఇంటికి ఒక్క బిడ్డకు మాత్రమే నగదు వేశారని, నేడు కూటమి ప్రభుత్వంలో ఒక ఇంటిలో ఎంతమంది బిడ్డలు ఉన్నా అందరికీ నగదు జమ చేయడం చారిత్రాత్మకం అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలు దేవుళ్లతో సమానం : డీఎస్పీ

కందుకూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రక్తదాతలు దేవుళ్లతో సమానమని డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా కందుకూరు సబ్‌డివిజన్ పోలీసుశాఖ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పట్టణ పోలీసుస్టేషన్ ఆవరణలో నిర్వహించిన ఈ శిబిరాన్ని డీఎస్పీ ప్రారంభించగా సీఐ కే. వెంకటేశ్వరరావుతోపాటు పోలీసు అధికారులు, సిబ్బంది, ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు, వివిధ రంగాలకు చెందిన యువకులు 61మంది రక్తదానం చేశారు. ఇప్పటికి 68సార్లు రక్తదానం చేసిన కె.రమేష్‌కు డీఎస్పీ ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు శివనాగరాజు, మహేంద్రనాయక్, చిలకపాటి మధుబాబు, చక్కా కేశవ, గుర్రం చిన అల్లూరయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ప్రభుత్వ పథకాలు వర్తింపచేయాలి

● అంగన్‌వాడీ వర్కర్ అండ్ వెల్ఫేర్స్ యూనియన్ నాయకురాలు సుబ్బరావమ్మ



మాట్లాడుతున్న కారసాల సుబ్బరావమ్మ

గుడ్లూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పథకాలు అంగన్‌వాడీ వర్కర్లకు వర్తింపజేయాలని సీఐటియూ అనుబంధ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కారసాల సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని చేవూరుకు వచ్చిన ఆమె స్థానిక ప్రజాసంఘాల నాయకులతో సమవేశం నిర్వహించి మాట్లాడుతూ అంగన్‌వాడీల్లో పనిచేసే వర్కర్లకు రూ.11,500, ఆయాలకు రూ.7000 మాత్రమే వేతనం ఇస్తున్నారని, ఈ క్రమంలో వీరు ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదు చేసి ప్రభుత్వ పథకాలు నిలిపివేయడం తగదన్నారు. తక్షణం తల్లికి వందనం పథకం వారికి వర్తింపచేయాలని కోరారు. దీనికోసం సీఐటీయూ, దాని అనుబంధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఈనెల 16న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్ల ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి కొట్టే వెంకయ్య, ప్రజాసంఘాల నాయకులు దామా కృష్ణయ్య, ఎం.వెంకటేశ్వర్లు, ఇరువూరి బ్రహ్మయ్య, ధన్యాసి పిచ్చయ్య, నూతలపాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సాయిమందిరంలో గాయత్రీ హోమం

కందుకూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోపాడులోని సాయిమందిరంలో శనివారం గాయత్రీ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. గురు రామ్‌రతన్‌జీ సమాధి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన హోమంలో మోపాడు, చుట్టుపక్కల గ్రామాలతో పాటు కందుకూరు పట్టణం నుంచి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.

బదిలీపై వెళ్తున్న అధికారికి ఘన సత్కారం



మాలకొండలో సీనియర్ అసిస్టెంట్‌ను పూలమాల శాలువాతో సత్కరించిన ఆలయ సిబ్బంది

వలేటివారిపాలెం. జూన్ 14(ఆంధ్రజ్యోతి): మాలకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయ సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు బదిలీ కావడంతో ఆలయ సిబ్బంది శనివారం పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈయన ఇటీవల జరిగిన జనరల్ బదిలీల్లో భాగంగా పల్నాడు జిల్లా అడిగొప్పల శ్రీ నిదానంపాటి లక్ష్మీ అమ్మవారు దేవస్థానం ఆలయ అధికారిగా బదిలీపై వెళ్లారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడితే బెదిరించడం దారుణం

కందుకూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై గళమెత్తుతుంటే పోలీసులు బెదిరించడం శోచనీయమని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ నేతి మహేశ్వరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇండోసోల్ కంపెనీ కోసం ఏటా మూడు పంటలు పండే కరేడు పరిధిలోని భూములను సేకరించటాన్ని, చేవూరు, రావూరు గ్రామాల పరిధిలో భూసేకరణ లోపాలపై మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, కొరివి వినయ్‌కుమార్‌లతో కలిసి రైతులతో మాట్లాడినందుకు ఉలవపాడు ఎస్ఐ అంకమ్మరావు ఫోన్‌చేసి బెదిరించారని తెలిపారు. అధికారులు రాజకీయపార్టీల జెండామోసే పరిస్థితికి వస్తే అంతేస్థాయిలో ప్రశ్నిస్తామని పేర్కొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఉదయగిరి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాయపాళెం పంచాయతీ గంగిరెడ్డిపల్లి గ్రామంలో శనివారం సీతారాముల కల్యాణోత్సవాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి వేదికపై ఉంచి వేదమంత్రోచ్చరణాల నడుమ కల్యాణతంతును శాస్త్రోక్తంగా నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి దంపతులు కల్యాణోత్సవంలో పాల్గొని స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంతోపాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొని స్వామివారికి కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామివారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పొన్నమాను గ్రామోత్సవం

సంగం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారెడ్డిపాళెంలోని సీతా లక్ష్మణ సమేత ఆత్మారామస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి పొన్నమాను గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఈసందర్భంగా ఆత్మారాముడి ఉత్సవ విగ్రహాన్ని పొన్నమాను వద్ద ఉంచి శ్రీకృష్ణుడి వేషధారణలో అలంకరించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ పూజారి వేదగిరి సత్యనారాయణచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.

పెళ్లికానుక అందజేత

సీతారామపురం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వడ్డిపల్లి రామయ్య కుమారై స్వప్న వివాహం సందర్భంగా ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 10 వేల రూపాయలు, జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ మెంబర్ భోగినేని కాశీరావు పెళ్లి ఖర్చులకు 5 వేల రూపాయల పెళ్లి కానుకను స్థానిక నాయకుల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన వీర మహిళ భోగినేని సులోచనమ్మ, భోగినేని కాశిరత్తయ్య, టిడిపి మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు, మాజీ జెడ్పిటిసి కలివెల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



వరికుంటపాడులో యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21వ తేదీన నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా శనివారం ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో నాగూర్‌వలి మాట్లాడుతూ క్రమం తప్పకుండా యోగా సాధన చేయడంతో దీర్ఘకాలిక వ్యాధులను సైతం దూరం చేసుకొని సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునన్నారు. అనంతరం ఉన్నత పాఠశాల ప్రాంగణంలో యోగా సాధన చేయించారు. కార్యక్రమంలో హెల్త్, వెల్ఫేర్ అసిస్టెంట్లు శ్రీనివాసులు, షంషీర్, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● **ఏఎస్ పేట:** మండలంలోని కావలి ఎడవల్లిలో శనివారం తెలుగు యువత జిల్లా మాజీ అధ్యక్షుడు ఏలూరి మాలాద్రినాయుడు ఆధ్వర్యంలో యోగా డే కార్య క్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామ ప్రజలు, విద్యార్థులు, సచివాలయ సిబ్బందితో యోగాసనాలు చేయించారు.

● **సంగం:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో షాలెట్ ఆధ్వర్యంలో శనివారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. యోగాసనాలపై సాధన చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా సాధన వల్ల మానసిక, శారీరక ఒత్తిడి నుంచి ఉపశమనం కలుగుతుందని, అంతేకాకుండా ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ నరసయ్య, కార్యాలయ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

● **ఉదయగిరి** : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఎంపీడీవో అప్పాజీ పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని 12 సచివాలయాల పరిధిలో గుర్తించిన 111 ప్రదేశాల్లో సామూహిక యోగా కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన యోగా కార్య క్రమంలో అధికారులు, సిబ్బంది, స్థానికులు యోగాసనాలు చేశారు. యోగాపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● **వింజమూరు** : మండలంలోని నల్లగొండ గ్రామంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ప్రాంగణంలో శనివారం గ్రామస్థులకు యోగాపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి అధ్యక్షత వహించగా ఆలయ ఈఓ శాంతయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


● **సీతారామపురం:** యోగాతో ఆరోగ్యం చేకూరుతుందని ఎమ్మార్వో కృష్ణారెడ్డి తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమంలో ఎమ్మార్వో కృష్ణారెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో భార్గవిల ఆధ్వర్యంలో శనివారం ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో మండల అధికారులు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, స్థానికులు యోగాసనాలు వేశారు.

పథకాల అమలుపై హర్షం

ఉదయగిరి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్‌లో భాగంగా తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాల అమలుకు శ్రీకారం చుట్టడం హర్షణీయమని ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు సందిరెడ్డి రామారావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తల్లికి వందనంలో భాగంగా కుటుంబంలో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి రూ. 13 వేలు చొప్పున నగదు వేయడం పేద పిల్లల విద్యాభివృద్ధికి చేయూతనిచ్చినట్లయ్యిందన్నారు. త్వరలో అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తుండడం శుభ పరిణా మమన్నారు.

● **సీతారామపురం:** విద్యార్థుల భవిష్యత్తుకు తల్లికి వందనం పథకం బంగారుబాట అని మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు అన్నారు. శనివారం టీడీపీ కార్యాలయంలో మండల క్లస్టర్ ఇన్ చార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండల నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ చరిత్రలోనే తల్లికి వందనం గొప్ప పథకం అని హర్షం వ్యక్తం చేశారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బంది

ఆత్మకూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం, ఆర్ఎంవో డాక్టర్ ఉషాసుందరి తెలిపారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా ప్రభుత్వ వైద్యశాల వైద్యులు, సిబ్బంది స్థానిక జిల్లా వైద్యశాల నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు రక్తదానం చేయండి.. ప్రాణాన్ని కాపాడండి అంటూ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు రమణ, సుపనంద, కవిత, సుస్మిత పాల్గొన్నారు.

సోమశిల నీటిమట్టం

అనంతసాగరం జూన్ 14 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శనివారం 95 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా 38.355 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. పెన్నా డెల్టాకు 3,850, ఉత్తర కాలువకు 375, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

రేషన్ దుకాణం ప్రారంభం



రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న జనసేన నేత సయ్యద్ అక్బర్ బాషా

ఏఎస్ పేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): అనుమసముద్రం గ్రామంలో శనివారం రేషన్ దుకాణం పునఃప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ అక్బర్ బాషా పాల్గొని పలువురికి సరుకులు పంపిణీ చేశారు. కార్డుదారులు రేషన్ దుకాణంలో సరుకులు తీసుకోవచ్చని, దివ్యాంగులకు, 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ఇంటి వద్దే సరుకులు ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ షేక్ షేరజ్ జాస్మిన్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కోటేశ్వరస్వామికి అశ్వవాహన సేవ

సంగం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరులో ఉన్న కోటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి అశ్వవాహన సేవ, అలకలతోపు కార్యక్రమం శుక్రవారం రాత్రి ఘనంగా జరిగింది. ఈసందర్భంగా అశ్వ వాహనంపై కోటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవానికి భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థినికి ఆర్థిక సాయం

ఆత్మకూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థిని కె జ్ఞానసిరికి శనివారం దొరసానమ్మ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ జాగర్లమూడి ప్రణీత్ రూ.20వేల చెక్కును అందజేశారు. కె జ్ఞానసిరి ఎస్‌సీఈ కళాశాలలో ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. బాగా చదువుకుని వృద్ధిలోకి రావాలని ఆకాంక్షిస్తూ ఆమె తండ్రి అశోక్‌కు చెక్కును అందజేశారు.

నందిగుంటలో చోరీ

వింజమూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నందిగుంట గ్రామంలో ఓ ఇంట్లో శుక్రవారం చోరీ జరిగింది. 15 సవర్ల బంగారం, రూ. 50వేలు నగదు దొంగలు అపహరించినట్లు ఇంటి యజమాని వరలక్ష్మీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో క్లూస్ టీంతో పరిశీలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.